సంపుటి : 74 సంచిక : 32 పుటలు : 52

# జాగృతి

కలి 5124 - శ్రీ శుభకృత్ జ్యేష్ఠ శుద్ధ సప్తమి
06-12 జూన్ 2022
వెల : ₹15/-



గర్జిస్తున్న గతంతో..

# జ్ఞానోదయమవుతుందా?

వందల ఏళ్లు మౌనం దాల్చిన చారిత్రకసత్యాలు గతం పుటల నుంచే తమ ఘోషను స్పష్టంగా వినిపిస్తున్నాయి

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

74 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

74 సంవత్సరాల జాగృతి 1946 -2020

జాగృతి

జాతీయ తెలుగు వారపత్రిక

ఆసక్తి కలిగించే విశ్లేషణలు.. జాగృతపరిచే కథనాలు..
చైతన్యం నింపే వాస్తవాలు.. స్ఫూర్తిని నింపే రచనలతో
ఇపుడు జాగృతి వారపత్రిక మరింత కొత్తగా మీ ముందుకు వస్తున్నది.

రండి..
జాతీయభావాల వేదిక
జాగృతి వారపత్రికలో
చందాదారులుగా
చేరుదాం.. చేర్పిద్దాం!

జాగృతి చందాను ఆన్‌లైన్‌లో పంపుటకు కిందనున్న క్యు.ఆర్. కోడ్‌లను
మీ మొబైల్‌తో స్కాన్ చేయండి.. లేదా లింక్ ద్వారా చందా చెల్లించండి!

ఒక సంవత్సర చందా రూ.**650/-**
**http://payit.cc/S18970**

Jagriti Bank A/c details :
Jagriti Prakasan Trust,
A/c No.920010061405325,
Axis, Kothapet Branch, Hyderabad.
IFSC : UTIB0002157, PAN : AAATJ3829L

ఐదు సంవత్సరాల చందా రూ.**3000/-**
**http://payit.cc/S18973**

3-4-228/4/1, Kachiguda, Hyderabad-500027.
Ph : 040-27561453, 9959997013. email : jagritiweeklysub@gmail.com

# నవయుగభారతి 'అక్షయపాత్ర' పథకానికి పోషకులుగా ముందుకురండి

# తెలుగుపాఠకులకు ఉత్తమ సాహిత్యాన్ని అందించటంలో భాగస్వాములు కండి

కొన్ని పుస్తకాలు చిన్నవి కావచ్చు. కాని చదివిన వారిలో మంచి ఆలోచనలను ప్రవేశపెట్టి వారి జీవితాలను సక్రమపథంలో నడిపించగలవు. అటువంటి పుస్తకములు ఎక్కువ సంఖ్యలో ముద్రితమై, తక్కువధరకు నిరంతరంగా లభిస్తూ ఉండాలి. ఇది జరగాలంటే మార్కెట్ ఆర్థికసూత్రాలకు అతీతంగా ఆ పుస్తకాల ముద్రణకు ప్రత్యేక పోషణ ఉండాలి. ఎంపిక చేయబడిన పుస్తకములకు దాదాపుగా 50% శాతం వ్యయాన్ని తిరిగితీసుకొనని పెట్టుబడిగా సమకూర్చాలని, తద్వారా పుస్తకం వెలను 30 శాతంవరకు తగ్గించాలని నవయుగభారతి ఆలోచిస్తున్నది.

కొన్ని పుస్తకాలు బృహత్తరమైనవి. తగినంత సంఖ్యలో అమ్ముడుపోగలవని నమ్మకం కలిగితే వాటిని అనువదింపజేయటమూ, ముద్రించి మార్కెట్లోకి తీసికొనిరావటమూ సాధ్యమవుతుంది. ఆ నమ్మకం లేకపోతే ఆ పుస్తకాలను తెలుగులో ప్రచురింపజేయటం దుష్కరమవుతుంది. కాబట్టి ఎంత బరువైన పుస్తకమైనా, కొనేందుకు తగినంత సంఖ్యలో సిద్ధంగా ఉన్నవారిని సమకూర్చుకోవాలనీ ఆలోచిస్తున్నది. **ఈ రెండు ఆశయాల సమన్వయరూపం ఈ అక్షయపాత్ర పథకం.**

**ప్రతి తెలుగు కుటుంబం నుండి కనీసం ఒక్కరైనా ముందుకు రావాలని మా విన్నపం. మీరు చేయవలసింది. 10,116 రూ.లు పోషకసభ్యత్వంగా చెక్కు ద్వారాగానీ, బ్యాంకు (ఆన్‌లైన్) ద్వారాగానీ చెల్లించటం. మీ ఫోటోను, చిరునామా, ఫోను నెంబరు మొదలైన వివరాలను తెలియజేయటం. దీనికి నవయుగభారతినుండి రశీదు పంపబడుతుంది. పది సంవత్సరములలోగా 15 వేల రూపాయల వెలగల్గిన క్రొత్తగా ప్రచురింపబడే పుస్తకాలు అనేక విడతలుగా 3 లేదా 4 నెలల వ్యవధితో రిజిష్టరుపోస్టులో మీకు పంపబడుతాయి.**

అదనంగా ప్రతులు కావాలని మీరు కోరుకుంటే 25% తగ్గింపుతో మీకు అందజేయబడతాయి (రవాణావ్యయం మీరే భరించవలసి ఉంటుంది). ఒకవేళ 15వేల రూపాయల వెలగల కొత్త పుస్తకాల ప్రచురణ పదిసంవత్సరాలకంటే ముందుగానే పూర్తయి, అవి మీకు అందజేయటం జరిగినపుడు మీ పోషక సభ్యత్వాన్ని నవీకరించుకోవలసిందిగా కోరగలము.

ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసంగా వేయిమందిని పోషక సభ్యులుగా చేర్చుకోగలమన్న విశ్వాసంతో ఈ విజ్ఞప్తి వెలువరిస్తున్నాం. మధ్యలో విరమించుకోవటం ఉండదని, మీకు ఏవిధమైన నష్టం కలగనిరీతిలో, మీ సంతృప్తిని చూరగొనేలా ఉత్తమగ్రంథాలను వెంటవెంటనే ప్రచురించి అందీయగలమని హామీ ఇస్తున్నాము.

**ఇప్పటివరకు పోషకసదస్యులుగా చేరనివారు ఇప్పుడైనా త్వరపడండి. ఎందుకంటే ఇది మీ విజ్ఞతకు గీటురాయి. మీరు సభ్యులు అయితేనే మరో పదిమందికి చెప్పగలరు.**

## రండి ! భారతిసేవలో కదలిరండి !!

| డా. వడ్డి విజయసారథి | బాలేంద్ర పొట్లూరి | నేతి క్షీరసాగర్ | కె. రామకృష్ణ |
|---|---|---|---|
| సమన్వయకర్త-సంపాదకుడు | అధ్యక్షుడు | కార్యదర్శి | కోశాధికారి |
| 9493173187 | 9885978090 | 9440543725 | 9246534799 |

**చెక్కులు పంపడానికి, ఉత్తరప్రత్యుత్తరాలకు చిరునామా :**
**నవయుగభారతి, జాగృతి భవనం,**
**3-4-288/4/1, లింగంపల్లి, కాచీగూడ, హైదరాబాద్ - 27**
nksagar@ymail.com

**సేవింగ్స్ బ్యాంకు అకౌంట్ నెం : 0418408438**
IFSC Code : IDIB000B052,
Indian Bank, Barakathpura, Hyderabad
చెక్కులు/నగదుబదిలీ 'నవయుగభారతి' పేరున పంపాలి.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, 1-1-60/5, Musheerabad, RTC 'X' Road, Hyderabad-500 020. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

## జాగృతి చందా – సూచనలు

**5 సం॥ల చందా రూ.3000, సంవత్సర చందా రూ.650, విడి ప్రతి రూ.15**

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

**చందా కట్టించే వారికి సూచనలు :**

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

**చందా పంపవలసిన చిరునామా :**

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

**జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :**

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- చెక్కు, డిడిపై **Jagriti Prakashan Trust** అని ఆంగ్లంలో రాయాలి.

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి | అసోసియేట్ ఎడిటర్ | 9959310103 |
| కె. హరీష్ | సబ్ ఎడిటర్ | 9959991304 |

డిజైనర్లు : సిహెచ్. కుమార్, ఎం. అనిత


కేరళలోని అళప్పుజ నినాదాల కేసు విన్న తరువాత ఆ రాష్ట్ర హైకోర్టు వేసిన ప్రశ్న–'అసలు ఈ దేశంలో ఏం జరుగుతోంది?' ఈ ప్రశ్నలోని క్షోభను అర్థం చేసుకోవాలి. హైకోర్టు న్యాయమూర్తుల నుంచి అంత మాట వెలువడేటట్టు చేసిన నినాదాలు ఏవి? ఎవరు ఇచ్చినవి? మే 21న పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) అనే దగుల్బాజీ సంస్థ నిర్వహించిన ఊరేగింపులో వినిపించాయవి. 'హిందువులూ, క్రైస్తవులూ మన గడ్డమీద బుద్ధిగా ఉండాలి. లేదంటే వాళ్లు అంతిమ సంస్కారాలకి ఏర్పాట్లు చేసుకోవాలి', 'బాబ్రీ మసీదు, జ్ఞాన్‌వాపిలకి పూర్వ వైభవం తెస్తాం'– ఒకడి భుజాల మీద కూర్చుని ఇలాంటి దారుణమైన నినాదాలు ఇచ్చినవాడు ఆరో తరగతి చదివే 11 ఏళ్ల కుర్రాడు.

ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయినప్పుడే దేశం దిగ్భ్రాంతికి గురైంది. అది భయంతో మాత్రం కాదు. ఒక జుగుప్సతో, ఒక ఏహ్యభావంతో, ఒక ఛీత్కారంతో కలిగిన దిగ్భ్రాంతి. వెంటనే ఆ రాష్ట్ర హైకోర్టు ఆ నినాదాలకు ఆ ప్రదర్శన నిర్వాహకులను బాధ్యులని చేసి, అరెస్టు చేయమని పోలీసులను ఆదేశించింది. మేం ఏ మతానికీ వ్యతిరేకంగా నినాదాలు చేయనప్పుడు ఒక రిపబ్లిక్‌లో ఇలా అరెస్టులకు ఆదేశించడం అప్రజాస్వామికం అంటూ ప్రజాస్వామ్యం గురించి కోర్టులకు వెంటనే పాఠాలు చెప్పే ప్రయత్నం చేశారు ముస్లిం మతోన్మాదులు. నాలుక తీటతో ఆ నినాదాలు ఇచ్చిన కుర్రాడి తండ్రి సహా మొత్తం 26 మందిని అరెస్టు చేశారు. నినాదాలు రగడ సృష్టించడంతోనే ఆ కుర్రాడి కుటుంబం పరారయింది. చివరికి తండ్రిని ఎర్నాకులం జిల్లాలో అరెస్టు చేశారు. వీళ్లు పీఎఫ్ఐ సభ్యులు కారట. కానీ ఎక్కడ ఊరేగింపు జరిగినా సకుటుంబంగా వెళ్లి జయప్రదం చేస్తారట. ఈ మాట ఎన్నో ప్రశ్నలకు తావిచ్చేదే.

ఈ దేశంలో ఏ ముస్లిం మతోన్మాది ఎక్కడ, ఎంతటి ఘాతుకానికి పాల్పడినా, ఎంత విద్రోహం తలపెట్టినా అది కేవలం అమాయకత్వంతో చేసినదేనని అంతా నమ్మాల్సిందే. లేదా ఉపాధి లేక పేదరికం కారణంగా చేసినదేనంటూ

**శాలివాహన 1944 శ్రీ శుభకృత్ జ్యేష్ఠ శుద్ధ సప్తమి**

### లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**జ్ఞానోదయమవుతుందా?** 6లో



జాతీయం
**మాలిక్‌ను మన్నిస్తావా మహాత్మా!** 12లో



ధారావాహిక నవల
**లంబసింగి రోడ్డు**
– డా॥ గోపరాజు నారాయణరావు 20లో

# జాగృతి

## సంపాదకీయం

ముద్ర వేయడానికి అనేక గొంతులు లేస్తాయి. ఇంతటి దుందుడుకు నినాదాలు ఇచ్చిన ఆ కుర్రాడిది కూడా ఒట్టి అమాకత్వమేనని అంటున్నాడు తండ్రి. సీఏఏ వ్యతిరేక ఆందోళనలో, ఎన్ఆర్‌సీ నిరసనల సమయంలో వాటిని ముచ్చటపడి నేర్చుకున్నాడట. ఆ తండ్రికి అసలు తల ఉందో లేదో, లేదా తెలివి ముదిరిందో కానీ, వాళ్లబ్బాయి ఇచ్చిన నినాదాలు ఏ మతానికీ వ్యతిరేకం కాదని తేల్చిపారే శాడు. కేవలం సంఘ పరివార్‌కే వర్తిస్తాయట. అంటే మిగిలిన కేరళ జనాభాని పీఎఫ్ఐ ఇస్లాంలో జమ చేసేసిందా ఏమిటి? అళప్పుజలోనే కాదు, ఇంకా చాలా చోట్ల మా అబ్బాయి అవే నినాదాలు ఇచ్చాడని కూడా ఆ తండ్రి కొత్త సత్యాన్ని

# ‘ఈ దేశంలో ఏం జరుగుతోంది?’

ప్రజల ముందు ఉంచాడు. ఆ కాసిన్ని నినాదాలకే ఇంత రాద్ధాంతం ఎందుకో నాకయితే అర్థం కావడం లేదనీ, ఈ మాత్రానికే ఆ పసివాడిని వేధించాలా అనీ అమాయకత్వం నటిస్తున్నాడు. కానీ ఆ నినాదాలు ఆ కుర్రాడికి నేర్పించారని నిఘా వర్గాలు చెబుతున్నాయి. మేం కొన్ని నినాదాలే రాసిచ్చాం, మిగిలినదంతా ఆ కుర్రాడి సొంత కవిత్వమేనని నిర్వాహకులు చెప్పడం మరీ వికృతం.

న్యాయస్థానాల స్పందన గురించి మరొక పీఎఫ్ఐ నేత వ్యాఖ్యానం మరీ బరి తెగింపు. ‘ఇలాంటి నినాదాలకి న్యాయస్థానాలు ఇట్టే కలవరపడతాయి. కేరళ హైకోర్టు న్యాయమూర్తులనూ దిగ్భ్రాంతికి గురి చేశాయంటే, అందుకు కారణం తెలుసా? వాళ్లకి లోపల ఉన్నవి కాషాయ చెడ్డీలు.’ ఇదీ ఆ నాయకుడి వాచాలత్వం. ఇంతకీ ఇదంతా భారత గణతంత్ర పరిరక్షణ కోసం పీఎఫ్ఐ పడుతున్న ఆరాటమట.

ఒక కుర్రవాడితో మతోన్మాద నినాదాలు ఇప్పించడం, రాజకీయ కార్యకలాపాలకి ఉపయోగించడం పెద్ద తప్పిదం. హక్కుల కార్యకర్తలు, పిల్లల రక్షణ ఉద్యమకారులు ఏ మూల అఘోరిస్తున్నారో మరి, వారం తరువాత కూడా చడీచప్పుడూ లేదు. ఆ రాష్ట్రాన్ని అరాచకశక్తుల అడ్డాగా మార్చేస్తున్న సీపీఎం అనే సిగ్గులేని రాజకీయ పార్టీకీ ఇంకా మెలకువ రాలేదు.

‘ఈ దేశంలో ఏం జరుగుతోంది?’ అన్న ఆ ప్రశ్న చాలా చాలా ఆలస్యంగానే న్యాయవ్యవస్థ వేసింది. ఏం జరుగుతున్నదో కేరళ ఏలికలకు తెలియనిది కాదు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వానికి తెలియనిది కాదు. పశ్చిమ బెంగాల్‌లో మమతకి తెలియనిది కూడా కాదు. ముస్లిం బుజ్జగింపు ధోరణి ఫలితమిది. సెక్యులరిజం వికృతరూపమిది. భావి ముస్లింలనూ భారతీయ సమాజానికి శత్రువులుగా మలుస్తున్నారు. హిందువుల శోభాయాత్రలను మా ప్రాంతాలలో అడుగుపెట్టనివ్వం అన్న వైఖరి నుంచి, ఈ గడ్డమీద బుద్ధిగా ఉండకపోతే నూకలు చెల్లిపోతాయని హెచ్చరించే వరకు వచ్చారు. మైనారిటీల హక్కుల మాటున జరుగుతున్నది ఇదే. కాబట్టి ఇప్పటికైనా కళ్లు తెరుచుకుని, బుజ్జగింపు ధోరణిని వీడి ఏం జరుగుతోందో చూడమని ఆ కొందరు ఏలికలను, కొన్ని పార్టీలను కోర్టులే ఆదేశించడం తక్షణావసరం. జరుగుతున్నది ఇదీ అంటూ ఎవరో ఫిర్యాదు చేసే వరకు కోర్టులు ఎందుకు ఆగాలి! ఎన్నో అంశాల మీద తమకు తామై కేసులను విచారణకు స్వీకరిస్తున్న కోర్టులు దేశ విచ్ఛిత్తికి, ఐక్యతకు జరుగుతున్న కుట్రల గురించి తమకు తామై ఎందుకు స్పందించరాదు?

పీఎఫ్ఐ వంటి దేశద్రోహ, మతోన్మాద, వేర్పాటువాద సంస్థ ఈ మధ్య తరచూ ఆర్ఎస్ఎస్ మీద కత్తులు నూరుతోంది. ఇలాంటి విషప్రచారంతో ఆర్ఎస్ఎస్‌ను అప్రతిష్ట పాల్జేయడం దానికి సాధ్యం కాదు. అసలు పీఎఫ్ఐ లాంటి సంస్థను వ్యతిరేకిస్తున్న సంస్థగా ముద్ర వేయడమంటేనే ఆర్ఎస్ఎస్‌ను తిరుగులేని దేశభక్తి సంస్థగా, నిర్మాణాత్మక వ్యవస్థగా ప్రపంచం ఎదుట మరొకసారి నిలపడమే. ★

06 జూన్ 2022, సోమవారం

అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



ప్రత్యేక వ్యాసం

**చరిత్ర పురుషుల నుంచి ఏం నేర్చుకోవాలి?**

23లో



మహిళ

**‘ఇసుక సమాధి’ కింద ఇంకిపోని ‘విభజన’ విషాదం**

36లో

కథ

**నేను అప్పారావు కొడుకుని**

– చిక్కాల జానకిరామ్



32లో

అంతర్జాతీయం

**క్వాడ్‌లో భారత్ అద్భుత దౌత్య విజయం**



40లో


| | | |
|---|---|---|
| మోదీకి ముఖం చూపించలేకే పారిపోయారా? (తెలంగాణ) | - | 14 |
| రెండు రుగ్మతలకు ఓ డాక్టర్ ప్రిస్క్రిప్షన్ (పుస్తక సమీక్ష) | - | 15 |
| కోనసీమ విధ్వంసానికి కారకులెవరు? (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| నమో కూర్మరూపా.. జయ జగదీశ హరే..! (ప్రత్యేక వ్యాసం-1) | - | 26 |
| ‘ఆజాద్ హింద్’తో నేతాజీ మన్ కీ బాత్ (అమృత్ మహోత్సవ్) | - | 28 |
| పలుగూ పార కాదు, పలకా బలపం చేతికివ్వాలి | - | 30 |
| తాంబూలం-11 (ఆరోగ్యం:ఆనందం) | - | 38 |
| వార్తా విశేషాలు | - | 42 |
| ఐపీఎల్ నయా చాంపియన్ గుజరాత్ టైటాన్స్ (క్రీడ) | - | 43 |
| ఆ సంస్కృతి మనకొద్దు! (అంతర్జాతీయం-1) | - | 44 |
| బాలజాగృతి | - | 46 |
| వారఫలాలు | - | 48 |
| పదరసం | - | 49 |
| ఫన్ తక్కువ, ఫ్రస్ట్రేషన్ ఎక్కువ: ఎఫ్ 3 (సినిమా) | - | 50 |




## గర్జిస్తున్న గతంతో..

# జ్ఞానోదయమవుతుం ఇా

కాశీలో విశ్వనాథుని మందిరాన్ని కబళిస్తున్నట్టే ఉంటుంది జ్ఞాన్‌వాపి మసీదు. ఒక సుదీర్ఘ న్యాయ పోరాటం తరువాత మే 19న వారణాసి జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశంతో ఈ మసీదు లోపలి భాగాలను వీడియో సర్వే చేసి, కోర్టుకు సమర్పించారు. మసీదులో హిందూ ఆనవాళ్లు ఉన్నాయన్నదే హిందువుల వాదన. కోర్టు నియమించిన ప్రత్యేక సహాయ కమిషనర్ ఈ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య తరువాత హిందువులు చేస్తున్న మరొక ఆత్మగౌరవ ప్రకటనగా ఇప్పుడు అంతా భావిస్తున్న ఈ సర్వే కార్యక్రమం ఐదుగురు సాధారణ గృహిణులు కోర్టుకు చేసుకున్న విన్నపం మేరకు పునఃప్రారంభ మైంది. అయితే శబరిమలై అయ్యప్పస్వామి ఆలయంలో అన్ని వయసుల మహిళల ప్రవేశం గురించి అసలు హిందూమతంతో సంబంధం లేని, మతాచారాలు అసలే పట్టని, వాటితో సంబంధమే లేని, హిందూ ధర్మాన్ని కించపరచడమే ధ్యేయంగా ఆ కొందరు మహిళలు వేసిన వ్యాజ్యం వంటిది కాదిది. వీరంతా ఏ రాజకీయ దురుద్దేశాలు లేకుండా కేవలం ధార్మిక దృష్టితో తమ మత హక్కును నిలబెట్టి న్యాయం చేయవలసిందని కోర్టును అర్థించారు. జ్ఞాన్‌వాపి గోడను ఆనుకుని ఉన్న శృంగార గౌరీ అమ్మవారికి నిత్యం పూజలు చేసుకునే వెసులుబాటు కల్పించమన్నదే ఆ విన్నపం అసలు ఉద్దేశం. రోజుకు ఐదు పర్యాయాలు విధిగా దైవ ప్రార్థన గావించే మతస్థులు సంవత్సరానికి ఒక్కరోజు మాత్రమే హిందువులు ఆ అమ్మవారిని సేవించుకోవడానికి అనుమతించడం ఏం న్యాయం? మొత్తానికి తీగ లాగితే చరిత్ర డొంకంతా కదిలినట్టయింది. శృంగార గౌరీ నిత్య ఆరాధన అంశం చరిత్ర పుటలలోని హిందువుల ఘోషకు ఊపిరినిచ్చింది. 40,000 మసీదుల కింద ఉన్న పవిత్ర దేవాలయాల శిథిలాలలో కదలికను తెచ్చింది. ఇదంతా జ్ఞాన్‌వాపి మసీదు మీద తమకు ఉన్న హక్కు గురించి హిందువులు సాగిస్తున్న న్యాయపోరాట స్వరూపం.

విషయంలోకి వెళ్లే ముందు ఒక్క విషయం గమనించాలి. అయోధ్య, కాశీ, మధుర – ఈ మూడు పరమ పవిత్ర క్షేత్రాల మీద హిందువులు తమ హక్కును నిరూపించుకోవడానికి న్యాయస్థానాలనే ఆశ్రయించారు. దశాబ్దాలు, శతాబ్దాలు కూడా నిరీక్షించారు. ఇందులో ఎన్నో అపజయాలు. కొన్ని విజయాలు. అయోధ్య ఉద్యమం తారస్థాయిలో ఉన్నప్పుడే జ్ఞాన్‌వాపి అంశం కూడా కోర్టు ముందుకు వచ్చింది. 1991లో, అంటే వివాదాస్పద కట్టడం కూలడానికి ఒక సంవత్సరం ముందే వారణాసికి చెందిన కొందరు అర్చకస్వాములు వారణాసి





# దా?

చరిత్ర పునరావృతమవుతుందని చెప్పడం తిరుగులేని సత్యం. తమ చుట్టూ పేర్చిన అబద్ధాలను దగ్ధం చేసుకుంటూ చారిత్రకసత్యాలు నేరుగా న్యాయస్థానాల ముంగిట వాలడం ఇవాళ్టి కొత్త పరిణామం. ఒక జాతి వారికి చెందిన పురాణాలు పరలోకానికి సంబంధించిన పాపపుణ్యాల గురించి చెబుతాయి. ఆత్మ క్షాళనకు దారి చూపుతాయి. కానీ ఆ జాతి చరిత్ర కోల్పోయిన ఆత్మగౌరవం గురించి చెబుతుంది. జాతి పునర్నిర్మాణం గురించి చెబుతుంది. కోల్పోయిన దేమిటో గుర్తు చేస్తుంది కూడా. ఇప్పుడు భారతదేశంలో జరుగుతున్నది అదే. వందల ఏళ్లు మౌనం దాల్చిన చారిత్రకసత్యాలు గతం పుటల నుంచే తమ ఘోషను స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఆ ఘోష ఏడెనిమిది వందల ఏళ్ల కాలంలో హిందువులు అనుభవించిన క్షోభకు సంబంధించినదే. ఆ బాధకు నివారణ చారిత్రక తప్పిదాలను సరిదిద్దుకోవడమే. సరిగ్గా ఈ మహా యజ్ఞమే సరికాదంటున్నాయి కొన్ని శక్తులు. అబద్ధాల కింద, వక్రభాష్యాల చాటున ఉండిపోయిన చరిత్రను ప్రపంచానికి తెలియనీయడం దేశానికి శ్రేయస్కరం కాదని సుద్దులు చెబుతున్నాయి. అంతిమంగా దానర్థం హిందువులు రాజీ పడాలనే. మసీదుల కింద మగ్గుతున్న ఆలయాలు వెలుగు చూడకూడదనే. ఇంకా, ముస్లింలలోని విజేత మనస్తత్వం భద్రంగా ఉండాలి. విదేశీ దురాక్రమణదారులంతా హిందూధర్మాన్ని నాశనం చేసి, ఆలయాలను నేలకూల్చిన మాట నిజమే కావచ్చు. కానీ దానిని మరచిపోవడం భవిష్యత్తుకు మంచిదన్నది సెక్యులరిస్టుల ఉవాచ. వందా రెండు వందలా! 40,000 మసీదుల కింద ఉన్న దేవాలయాలను వెనక్కి ఇమ్మంటే మైనారిటీల మనసుకు ఎంత నెప్పో కదా అంటున్నారు మేధావులు. ఇందుకు తాజా ఉదాహరణ జ్ఞాన్‌వాపి మసీదు ఉందంతం, దాని మీద వస్తున్న వాదనలు.

న్యాయస్థానంలో ఒక పిటిషన్ దాఖలు చేశారు. జ్ఞాన్‌వాపి మసీదు ప్రాంగణంలో ఉన్న హిందూ దేవుళ్లకు నిత్యపూజలకు అనుమతించా లన్నదే వారి విన్నపం. కానీ వారణాసి కోర్టులో జరుగుతున్న విచారణను మూడు దశాబ్దాల తరువాత అలహాబాద్ హైకోర్టు 2021లో నిలిపివేసింది. 17వ శతాబ్దంలో ఆలయాన్ని కూల్చి మసీదు కట్టారన్న ఆరోపణలో నిజమెంతో తేల్చడానికి తలపెట్టిన సర్వేను కూడా సస్పెండ్ చేసింది. ఇంకోవక్క, ఇలా సర్వే చేయించడం జూలై 11,1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టానికి విరుద్ధమని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు వాదించింది. ఈ చట్టం ప్రకారం 1947 నాటికి ఆలయాలు ఏ స్థితిలో ఉన్నాయో అదే స్థితిని కొనసాగించాలి. ఇలా వివాదాన్ని త్రిశంకు స్వర్గంలో వదిలివేసిన సమయంలోనే మరొక పరిణామం జరిగింది. ఆ ఐదుగురు హిందూ సోదరీమణుల ద్వారా కేసు మళ్లీ పట్టాలెక్కింది. అంతకు ముందే ఉత్తరప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవప్రసాద్ మౌర్య, వాస్తవం మీద ముసుగును ఈ సర్వే తొలగిస్తుందని ప్రకటించి, దేశప్రజల దృష్టిని ఈ అంశం మీదకు మళ్లించారు. ఇక్కడొక విషయం గుర్తు చేసుకోవాలి. 1991 నాటి ప్రార్థనాస్థలాల పరి రక్షణ చట్టం చెల్లుబాటును పరిశీలించవలసిందేనని 2021 మార్చిలో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే ధర్మాసనం ప్రకటించింది. సాక్ష్యాలు పరిపూర్ణంగా ఉన్నప్పుడు ఒక కట్టడం మూలరూపాన్ని నిరాకరించడం తగదని చాలామంది న్యాయనిపుణులు అభిప్రాయపడ్డారు కూడా.

జ్ఞాన్‌వాపి గోడల మీద కనిపించే హిందూ దేవతామూర్తులను నిత్యం పూజించుకోవడానికి అనుమతి మంజూరు చేయించవలసిందిగా ఢిల్లీలో ఉండే ఆ ఐదుగురు మహిళలు వారణాసి కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ మేరకు కోర్టు వీడియో సర్వే నిర్వహించి మే 10వ తేదీకి సమర్పించాలని ఆదేశించింది. ఈ సర్వే జ్ఞాన్‌వాపి-శృంగార గౌరీ అమ్మవారి ప్రతిమ ఉన్న ప్రాంతంలో చేయాలి. కానీ కోర్టు ఆదేశాలను మొదట మసీదు నిర్వహణ సంఘం ఖాతరు చేయకుండా సర్వేకు అనుమతించలేదు. కోర్టు నియమించిన కమిషనర్ అజయ్‌కుమార్ మిశ్రాకు ఆ అర్హత లేదని ఆ సంఘం వాదించింది. ఆయనకు పక్షపాత దృష్టి ఉందని, కాబట్టి వేరే కమిషనర్‌ను నియమించాలని కోరింది. ఆ విన్నపాన్ని కోర్టు పట్టించుకోలేదు. ప్రాథమిక సర్వే నిర్వహించిన మిశ్రా కొన్ని అంశాలను మీడియాకు వెల్లడించారన్న ఆరోపణతో ఆయనను మార్చారు. మిశ్రా స్థానంలో విశాల్‌సింగ్‌ను నియమించారు. మే 17కు సర్వే పూర్తి చేయాలని మే 12న ఆదేశించింది. మే 13న అంజుమన్ ఇంతేజామియా మసీదు కమిటీ సుప్రీంకోర్టుకు వెళ్లి, సర్వే మీద స్టే కోరింది. కమిటీకి చుక్కెదురైంది. 14వ తేదీన సర్వే మొదలయింది. మొదటి రోజున నాలుగు గదులలో సర్వే జరిగింది. ఇందులో మూడు ముస్లింలవి, ఒకటి హిందువులది. రెండో రోజు సర్వేలోనే హిందూ ఆలయం ధ్వంసం చేసినట్టుగా చెప్పే ఆనవాళ్లు దొరికాయి. మే 16న సర్వే పూర్తయింది. అప్పుడే హిందువుల తరఫున వాదిస్తున్న ఒక న్యాయవాది వజూఖానాలో శివలింగం ఉన్నట్టు బయటకు చెప్పారు. వెంటనే సుప్రీంకోర్టు ముస్లింల ప్రార్థనలకు అడ్డు లేకుండా, శివలింగం ఉన్న ప్రదేశాన్ని సీజ్ చేయవలసిందని ఆదేశాలు ఇచ్చింది. ఇది హిందువుల మనోబలాన్ని పెంచింది.

రుజువులు కళ్లెదుటే ఉన్నా, చరిత్ర ఘోషిస్తున్నా ఒక వాస్తవాన్ని ఇంతకాలం గట్టిగా చెప్పడానికి



మసీదులో దొరికిన శివలింగం

సందేహించిన హిందూ సమాజం ఇప్పుడు గళమెత్తింది. హిందువులు పరమ పవిత్రంగా పూజించుకునే కాశీ విశ్వేశ్వరుని మందిరాన్ని గ్రేట్ మొగల్స్‌లో చివరివాడు ఔరంగజేబ్ నేలమట్టం చేసి, అదే స్థలంలో మసీదు నిర్మించాడు. తిరుగులేని ఈ చారిత్రక వాస్తవాన్ని ఇన్నాళ్లకి హిందువులు గుండె ధైర్యంతో చెప్పగలుగుతున్నారు. దీనికి చరిత్రలో ఇంకా ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయి. ఒక్క హిందువులు అందించిన పుస్తకాలలోనే కాదు, ముస్లిం పాలకులు, వారి ఆస్థానకవులు, విదేశీ యాత్రికులు రాసిన పుస్తకాలు కూడా అదే ఘోషిస్తున్నాయి. ముస్లిం పాలకులు ఈ దేశంలో మిగిలిన మతాల వారి ప్రార్థనామందిరాలను, మరీ ముఖ్యంగా హిందూ దేవాలయాలను ధ్వంసం చేసి వాటి మీదనే మసీదులు కట్టారు. అయోధ్య, కాశీ, మథుర మాత్రమే కాదు, ఈ దేశంలో దాదాపు నలభయ్ వేల మసీదులు అలా హిందువుల ఆత్మగౌరవాన్ని తొక్కుతూ నిలబడినవే. 'మాసీర్ ఇ అలంగిరి' అనే గ్రంథం ఉంది. సాకి మస్తాయిద్ ఖాన్ దీని రచయిత. ఇది ఔరంగజేబ్ పాలనా కాలం మీద వ్యాఖ్యానం వంటి చరిత్ర గ్రంథం. అందులో కాశీ ఆలయం గురించిన ప్రస్తావన ఉంది. ఏమిటది?

ఈ గ్రంథంలో మొదటి భాగం ఔరంగజేబ్ జీవించి ఉండగానే రచించారు. రెండో భాగం అతడు మరణించిన తరువాత రాసినది. పర్షియా భాషలో ఉన్న ఈ గ్రంథాన్ని ప్రముఖ చరిత్రకారుడు జదునాథ్ సర్కార్ అనువదించారు. ఆ పని జరిగినది బీజేపీ హయాంలో అనుకుంటే పొరపాటు. బ్రిటిష్ ఇండియా కాలంలోనే అనువదించారాయన.

'మాసీర్ ఇ అలంగిరి' చెబుతున్నదాని ప్రకారం బెనారస్‌లో ఉన్న 'అవిశ్వాసులు', అంటే హిందువుల గురించి ఏప్రిల్ 8,1669లో ఔరంగజేబ్‌కు తెలిసింది. టెట్టా, ముల్తాన్, మరీ ముఖ్యంగా బెనారస్‌లో బ్రాహ్మణులైన అవిశ్వాసులు తమ మత గ్రంథాన్ని బోధించడానికి పాఠశాలలు ఏర్పాటు చేశారని దేవుడికి తెలిసింది. అటు హిందువులే కాకుండా, ముస్లిం విద్యార్థులు కూడా వాళ్ల పాఠశాలలకు ఆకర్షితులై వెళుతున్నారని తెలిసింది అని ఆ పుస్తకంలో ఒకచోట రాశారు. ఇంకా, అవిశ్వాసులకు సంబంధించిన ఇలాంటి పాఠశాలలు వెంటనే కూల్చాలని, ఇస్లాం ఆదేశాలను అమలు చేయడానికి ప్రభువుల వారు వేగిరపడుతున్నారని కూడా రాశారు. ఆ అవిశ్వాసుల నిత్య ఆచార వ్యవహారాలు, పాఠశాలలు, బోధనలు అన్నీ కట్టిపెట్టాలని ఆదేశించారు. పాదుషా ఆజ్ఞ మేరకు సెప్టెంబర్ 2,1669న మొగలాయిల అధికారులు వారణాసిలో విశ్వనాథుని ఆలయాన్ని నేలకూల్చారు అని ఆ పుస్తకంలో నమోదు చేశారు.

మళ్లీ వర్తమానానికి వచ్చి, సర్వేను పరిశీలిస్తే కొన్ని వాస్తవాలు తెలుస్తాయి. మే 19వ తేదీన కోర్టుకు సర్వే నివేదిక అందింది. అడ్వకేట్ కమిషనర్ విశాల్ సింగ్ అందులోని అంశాలను వెల్లడించడానికి నిరాకరించారు. అయినా కొన్ని అంశాలు బయట పడిపోయాయి. పిటిషన్ దాఖలు చేసినవారు చెప్పినట్టే మసీదు లోపల సనాతన ధర్మానికి చెందిన కొన్ని ప్రతీకలు ఉన్నాయి. అవి దమరుకం, త్రిశూలం, కమలం. మొదటిగా సర్వే నిర్వహించిన మిశ్రా కూడా



జ్ఞాన్‌వాపి
ఫైల్ ఫొటో

ఆగ్రహం ప్రకటించగలదు. అందులో ఆశ్చర్యం లేదు. కానీ ఆ ఆనవాళ్ల నేపథ్యాన్ని కోర్టు కూడా తిరస్కరించలేదని భావించాలి. ఏమైనా మసీదులో ఉన్నట్టు చెబుతున్న హిందూ దేవుళ్ల ప్రతిమల పట్ల హిందువులు సహజంగానే ఆసక్తిని పెంచుకున్నారు. అసలు ఈ వివాదం ఎప్పటిది? కోర్టులలో దీని ప్రస్థానం ఎలా సాగింది? ప్రభుత్వాల వైఖరి ఏమిటి?

**1937:** 1937లో అలహాబాద్ హైకోర్టు ఈ వివాదానికి సంబంధించి ఒక డిక్రీ ఇచ్చింది. ఇది దీన్ మహమ్మద్ వర్సెస్ రాష్ట్ర కార్యదర్శి కేసుగా ప్రసిద్ధి గాంచింది. దీని ప్రకారం జ్ఞాన్‌వాపిని వక్ఫ్ బోర్డు ఆస్తిగాను, మసీదు కింది భాగం వ్యాస్ కుటుంబికులకు చెందినదిగాను ఆ డిక్రీ ప్రకటించింది.

**1991:** అయోధ్య వివాదం తారస్థాయికి చేరిన దశలో పీవీ నరసింహారావు ప్రభుత్వం ప్రార్థనాస్థలాల (స్పెషల్ ప్రావిజన్స్) చట్టాన్ని తీసుకువచ్చింది. అయోధ్యలోని రామజన్మ భూమి తప్ప దేశంలోని మిగిలిన అన్ని ప్రార్థనా స్థలాల విషయంలో ఆగస్ట్

జ్ఞాన్‌వాపి మసీదును హిందూ దేవాలయ శిథిలాల మీదనే నిర్మించారని ఇప్పుడు అనేక మంది హిందువులు, హిందూ సంస్థలు విశ్వసించక తప్పడం లేదు. ప్రపంచ ప్రఖ్యాత హిందూ పుణ్యక్షేత్రం వారణాసిలోని జ్ఞాన్‌వాపి మసీదులో కోర్టు ఆదేశాల మేరకు సర్వే నిర్వహించడం, ఆ సర్వేలో బయట పడినదిగా చెబుతున్న శివలింగం ఇలాంటి నమ్మకానికి వచ్చేటట్టు చేస్తున్నాయి. 1669లో మొగల్ వంశీకుడు ఔరంగజేబ్ పురాణ ప్రసిద్ధమైన ఆ దేవాలయాన్ని ధ్వంసం చేసి దాని మీద మసీదు కట్టాడని చరిత్ర చెబుతోంది. ఇది భారతీయ చరిత్రకారులు రాసుకున్న చరిత్ర కూడా కాదు. విదేశీ యాత్రికులు, మొగల్ వంశీకులు, వారి కొలువులో పనిచేసిన వారు రాసిన డైరీలలో లభ్యమవుతున్న సమాచారమే. ఇంతకీ జ్ఞాన్‌వాపి మసీదులో ఉన్నట్టు చెబుతున్న హిందూ దేవాలయ ఆనవాళ్లలో ఇవి ఐదు శాతం కూడా కాదన్న వాస్తవం గమనించాలి. మసీదు గోడల మీద కనిపించకూడని లతలు, పుష్పాలు కనిపించాయి. చివరికి నమాజ్‌కు ముందు కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునే చోటు (వజూఖానా) శివలింగం ఉన్నట్టు సమాచారం బయటకు వచ్చింది. ఇలా సర్వే విశేషాలు బయటకు రావడం మీద కోర్టు

పగిలిన హిందూ దేవతాప్రతిమలు మసీదులో ఉన్నాయని నమోదు చేశారు. అవి శేషుడు, దీపం. కానీ మసీదులోని వజూఖానాలో దొరికిన శివలింగాన్ని ఫౌంటేన్‌గా నమ్మించడానికి ముస్లింలు శతవిధాల ప్రయత్నించినా దానిని దేశం నమ్మలేదు.

తమ ప్రార్థనా స్థలాల గురించి హిందువుల వాదనకు బలం, లోతు పెరిగిన కొద్దీ సెక్యులరిస్టులు, మేధావులు రంగంలోకి దిగి రాజీ మార్గాలు సూచించడం చాలాకాలంగా జరుగుతున్నది. ఇప్పుడూ అదే జరుగుతున్నది. ఇలా గతాన్ని తవ్వుకుంటూ ఎంత వెనక్కి వెళతాం? ఒక ముగింపు ఉండాలి కదా? ఇదీ ఇప్పుడు వినిపిస్తున్న మాట. అయితే ఈ మాట కేవలం హిందువులను దృష్టిలో పెట్టుకుని అన్నమాట. ఇలాంటి సూచన ఏదీ కూడా ముస్లింలకు వినిపించకుండా చర్చలు జరపాలనీ, ఒక పరిష్కారానికీ రావాలనీ, రాజీకి రావాలనీ చెప్పడమంటే హిందువులను వెనక్కి తగ్గమనే అర్థం. జ్ఞాన్‌వాపి మసీదులో శివలింగం సహా, కొన్ని హిందూ ప్రతీకలు బయటపడినాయని వెల్లడి కాగానే ముస్లింలలో మేకపోతు గాంభీర్యం, మేధావులలో నక్క వినయం ఒక్కసారిగా పొటమరించాయి. ఇలా చిరకాలం హిందువులు, ముస్లింల మధ్య ఘర్షణ వాతావరణం ఉంటే దేశానికి మంచిది కాదని ఇప్పుడే ఆదరాబాదరా వారికి గుర్తుకు వచ్చింది. అక్కడ శివలింగం దొరకడం, కావలసినన్ని చారిత్రక

**శృంగార గౌరీ మాత పూజలకోసం కోర్టును ఆశ్రయించిన మహిళలు**




ఆధారాలు ఉండడం చూస్తే, అయోధ్య తరహాలో ఒక పెద్ద రాజకీయ, సామాజిక, న్యాయ సంఘర్షణ దేశంలో అనివార్యమని మేధావులు బెదిరించడం మొదలుపెట్టారు. నిజమే, ఈ ఆధారాలను బట్టి, కాశీ విశ్వనాథుడి గుడిని మింగుతున్నట్టు ఉండే మసీదును బట్టి హిందువులు దాని మీద తమ హక్కును చాటుకోవడం అనివార్యం. ఇన్ని రుజువులు, ఆధారాలతో సహా బయటపడినా హిందువులు అది తమదేనని ప్రకటించుకోకుండా ఇంకా ఎలా ఉండగలరు? వారికి ఆత్మగౌరవం ఉండదా? ఉండకూడదా? రేపటితరాల వారికి ఏం సమాధానం చెబుతారు? దీనికి నక్క వినయంతో సెక్యులరిస్టులు చేస్తున్న ప్రతివాదం- హిందూ దేవాలయాల మీద నిర్మించినట్టు చెబుతున్న 40,000 మసీదులు అప్పగించాల్సిందేనని హిందువులు ఇప్పటికే గళం ఎత్తారు. ఇదెలా సాధ్యం? బెంగళూరుకు చెందిన శ్రీరామసేన నాయకుడు ఈ మాట ఇప్పటికే అన్నారు కూడా. అంటే అలనాడు ముస్లింలు చేసిన విగ్రహ ధ్వంసం కార్యక్రమాన్నే తిరిగి ఇప్పుడు ప్రారంభించినట్టు అవుతుంది కదా అని నీళ్లు నములుతున్నారు. అంత రక్తపాతం జరగాలా అని అంటున్నారు. కాబట్టి మరీ పాత నిర్మాణాల జోలికి పోవడం సరికాదన్నదే చాలామంది మేధావులు, సెక్యులరిస్టుల అభిప్రాయంగా తేలుతుంది. నిజానికి ఇలాంటి అభిప్రాయానికి ఇప్పుడు ఈ దేశంలో పూచిక పుల్ల విలువ కూడా లేదు. 1991 నాటి ప్రార్థనా స్థలాల యథాతథ స్థితి కాపాడే చట్టం చెల్లుబాటే ప్రశ్నార్థకమైనప్పుడు మసీదులు కింద ఉన్న ఆలయాలు తమకు కావాలి అని హిందువులు కోరితే తప్పేమిటి? అయినా ఇన్ని ఆలయాలను మెజారిటీ హిందువులకు ప్రాతినిధ్యం

# 1937 నుంచి 2022 వరకు...

15,1947 నాటి స్థితిని యథాతథంగా కొనసాగించాలి. ఈ చట్టాన్ని చూపుతూ శృంగార గౌరీ మాత పూజకు అనుమతించాలంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేయాలని ముస్లింలు వారణాసి కోర్టుకు వెళ్లారు. అసదుద్దీన్ ఒవైసీ ఈ ఒక్క చట్టాన్ని అడ్డం పెట్టుకునే మొత్తం వ్యవహారం నడుపుదామని అనుకుంటున్నారు. అసలు ఈ చట్టాన్ని తొలగిస్తే సమస్య తీరుతుందని డాక్టర్ సుబ్రహ్మణ్య స్వామి వాదన. వాస్తవాలు కళ్లెదుట ఉన్నా ఒక చట్టం ఆధారంగా కోర్టు న్యాయాన్ని ఎలా నిరాకరిస్తుందని కొందరు ప్రశ్నిస్తున్నారు. నిర్ధారిత సాక్ష్యాలు ఉంటే ఈ చట్టం కారణంగా ఒక కట్టడానికి ఉన్న మత ప్రాధాన్యాన్ని నిరాకరించలేమని సుప్రీంకోర్టు కూడా ఇటీవల వ్యాఖ్యానించింది.

**అక్టోబర్ 15, 1991:** జ్ఞాన్‌వాపిలో కొత్త ఆలయాన్ని నిర్మించుకుని, అక్కడ పూజాదికాలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ పండిత్ సోమ్‌నాథ్ వ్యాస్, డాక్టర్ రామ్‌రంగ్ శర్మ వారణాసి కోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ కేసును జిల్లా జడ్జీ ఆగస్ట్ 13, 1998కి వాయిదా వేశారు. అయితే వారణాసి కోర్టు ఆదేశాల మీద అలహాబాద్ హైకోర్టు స్టే విధించింది.

**మార్చి 2000:** సోమ్‌నాథ్ వ్యాస్ మరణించారు. దీనితో ఆ కేసును నిర్వహించే బాధ్యతను 2018లో న్యాయస్థానం న్యాయవాది విజయ్‌శంకర్ రస్తోగికి అప్పగించింది. తరువాత రస్తోగి జ్ఞాన్‌వాపిలో సర్వే నిర్వహణకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ కేసును కోర్టు స్వీకరించడంతోనే జ్ఞాన్‌వాపి మసీదు నిర్వాహకులు సర్వేకు వ్యతిరేకంగా కేసు వేశారు.

**ఆగస్ట్ 18, 2021:** జ్ఞాన్‌వాపి గోడకు ఉన్న శృంగార గౌరీమాతనే కాకుండా అక్కడ మిగిలి ఉన్న హిందూ దేవతా ప్రతిమలకు పూజలు చేసేందుకు అనుమతించాలని కోరుతూ ఐదుగురు మహిళలు వారణాసి కోర్టును ఆశ్రయించారు. పాత దేవాలయం ప్రాంగణంలో కనిపించే, కనిపించని దేవతా మూర్తులను ఆరాధించుకోవడానికి అనుమతించాలని వారు విన్నవించారు. సర్వే జరిపించాలని ఏప్రిల్ 26, 2022న కోర్టు ఆదేశించింది. మొదట ముస్లింలు ఇందుకు అంగీకరించక పోయినా తరువాత వెనక్కి తగ్గారు. ఎట్టకేలకు మే 14-16 తేదీలలో సర్వే పూర్తయింది.

**మే 16:** శివలింగం ఆకృతి బయటపడిందని ఆరోజు వెల్లడైంది. కానీ ఇది వజూఖానాలో ఏర్పాటు చేసిన ఫౌంటేన్ అని ముస్లింలు వాదించారు. దీనితో శివలింగం ఉన్న ప్రాంతానికి సీలు వేయవలసిందిగా వారణాసి కోర్టు ఆదేశించింది. మే 17న సుప్రీంకోర్టు ఈ కేసు విచారణను చేపట్టింది.

మసీదులో దొరికిన శివలింగం ప్రస్తుతం ముస్లింల అధీనంలోనే ఉందని, ఆకృతిని మార్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని హిందువుల తరపు న్యాయవాది విష్ణు జైన్ కోర్టులో ఫిర్యాదు చేశారు. అది శివలింగం కాదని, అది ఫౌంటేన్ అని చెప్పడానికి 60 సెంటీమీటర్ల రంధ్రం చేసే ప్రయత్నం జరిగిందని ఆరోపణ ఉంది. ★

## కృష్ణ జన్మభూమి



మధురలో సరిగ్గా శ్రీకృష్ణుడు జన్మించిన స్థలానికి అతి సమీపంలోనే షాహీ ఈద్గాను 17వ శతాబ్దంలో నిర్మించారు. ఇది 13.37 ఎకరాలలో ఉంది. కట్రా కేశవదేవ్ ప్రాంగణంలో ఈ ఈద్గాను నిర్మించారని హిందూ సంస్థలు ఆరోపిస్తున్నాయి. ఈ ఈద్గాను తొలగించాలని కోరుతూ నాలుగు వ్యాజ్యాలు ఉన్నాయి. ఈద్గాను గుడి ప్రాంగణం నుంచి తొలగించాలంటూ వచ్చిన పిటిషన్‌ను 2020లో కోర్టు కొట్టివేసింది. కానీ అలహాబాద్ హైకోర్టు ఇటీవల ఈ కేసును విచారణకు స్వీకరించింది. జ్ఞాన్‌వాపి తరహాలోనే సర్వే చేయించాలని ఒక కమిషనర్‌ను కూడా నియమించింది.


## తాజ్‌మహల్



తాజ్‌మహల్ తేజోమహాలయ అనే శివాలయమేనని చిరకాలంగా ఒక వాదన ఉంది. ఇది కూడా ఆ ఆలయ శిథిలాల మీద కట్టారని వారు చెబుతున్నారు. పీఎన్ ఓక్ అనే ఇండాలజిస్ట్ ఈ వాదన తెచ్చారు. తాజ్‌మహల్‌లోని 22 గదులను సర్వే చేయించాలని కొందరి బీజేపీ నాయకుల డిమాండ్.

ఈ దేశం మీదకు దురాక్రమణదారులు రావడం, మత మార్పిడులు చేయడం, దేవాలయాలను మసీదులుగా మార్చేయడం దాచేస్తే దాగని సత్యం. అయితే అవి ఎన్ని? కర్ణాటక కేంద్రంగా పనిచేసే రామసేన నాయకుడు ప్రమోద్ ముతాలిక్ 40,000 అంటున్నారు. కర్ణాటక మంత్రి ఈశ్వరప్ప 36,000 అంటున్నారు. జ్ఞాన్‌వాపి మసీదులో వీడియో సర్వేకు ఆదేశాలు ఇచ్చిన తరువాత ఆలయాలు- మసీదుల వివాదం కొత్త పుంతలు తొక్కుతోంది. వివాదం ఉన్న మసీదులలో సర్వేలకు అనుమతించాలన్న డిమాండ్లు పెరిగాయి. అందులో మచ్చుకు కొన్ని.

## కుతుబ్ మినార్



ఢిల్లీలో కుతుబ్ మినార్ నిర్మాణం కోసం ధ్వంసం చేసిన 27 హిందూ,జైన్ ప్రార్థనామందిరాలను పునరుద్ధరించాలంటూ ఒక వ్యాజ్యం ఢిల్లీ న్యాయస్థానాలలో నానుతోంది. ఇందులోని కవ్వత్ ఉల్ ఇస్లామ్ మసీదు హిందూ ఆలయాన్ని కూల్చి ఆ శిథిలాలతోనే నిర్మించారని హిందువులు వాదిస్తున్నారు.

## శ్రీరంగపట్నం




జ్ఞాన్‌వాపి నేపథ్యంలోనే కర్ణాటకలోని శ్రీరంగపట్నం (జామియా) మసీదు హనుమాన్ ఆలయాన్ని ధ్వంసం చేసి కట్టారని మాండ్యా జిల్లా హిందువులు ఆరోపిస్తున్నారు. కాబట్టి అందులో పూజలు నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వాలని జిల్లా యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ మసీదు టిప్పుసుల్తాన్ కట్టించాడని ప్రతీతి.

వహిస్తున్న పార్టీ మాత్రం ఎలా అప్పగించగలదు? అన్నది కూడా వారి వాదనే. ఇది అంతర్యుద్ధానికి దారి తీయదా అని కూడా ముందే భయపెడుతున్నారు. అసలు ఈ వివాదాలేవీ తెర మీద లేనప్పుడే అంతర్యుద్ధం గురించి కొందరు ముస్లిం మౌల్వీలు ఫత్వాలు ఇచ్చిన సంగతిని మాత్రం వీరు సౌకర్యంగా పక్కన పెడుతూ ఉంటారు.

ఇంతకీ ముస్లింలు ఏమంటారు? ఆ అంశంలోకి వెళ్లే ముందు హిందూ ఆలయాల మీద ముస్లింల దాడుల గురించి కొన్ని అంతర్జాతీయ ఆధారాల గురించి చూద్దాం. కాశీ నగరం మీద, విశ్వేశ్వరుని ఆలయం మీద దాడులు మహమ్మద్ గజనీ కాలపు దాడుల నాటివే. అబుల్ ఫజల్ రాసిన 'అల్ బేహకి' గ్రంథం ప్రకారం భారత్‌లో గజనీ తరపు పాలకునిగా ఉన్న అహ్మద్ నియాల్‌తిగిన్ క్రీస్తుశకం 1033లో ఆ పవిత్ర నగరాన్ని దోచుకున్నాడు. ఉదయం పూట ప్రార్థన సమయంలో మొదలైన దోపిడీ మధ్యాహ్న ప్రార్థనల దాకా సాగిందట. కాశీ విశ్వనాథుడి ఆలయాన్ని ఔరంగజేబ్ కూల్చాడని చెబుతూ ప్రపంచ ప్రఖ్యాత ఇండాలజిస్ట్ జేమ్స్ ప్రిన్సిప్ చూపించిన సాక్ష్యాలు ఉన్నాయి. అయినా ముస్లింలు తమ పూర్వీకుల దురాక్రమణల మీద తమకే హక్కు ఉండాలనీ, అవి అలాగే ఉండాలని, దురాక్రమణతో కట్టిన మసీదులే అయినా అవి హిందూ ఆలయాల కంటే పవిత్రమైనవనీ చెబుతున్నట్టే ఉంది. పైగా ఒకసారి ముస్లింల అధీనంలోకి వచ్చిన స్థలం లేదా కట్టడం సూర్యచంద్రులు ఉన్నంత వరకు ముస్లింలకే అంటే తమ దైవానికే చెందుతాయని వాదిస్తున్నారు. నిజానికి ఇదే అసలు సమస్య. జ్ఞాన్‌వాపి సర్వేకు అనుమతి ఇచ్చిన నాడే, 'మేం ఒక్క మసీదును కూడా వదిలిపెట్టబోమ'ని అసదుద్దీన్ ఒవైసీ యుద్ధభేరీ మోగించారు. గతంలో చట్టవిరుద్ధంగా అయోధ్యను లాక్కున్నా, మరొక మసీదు ఏదీ అప్పగించడానికి సిద్ధంగా లేమని ముస్లింలు అంటున్నారు. అయోధ్య హిందువులదే నంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు కూడా ఇదే ధోరణిని వారు ప్రదర్శించిన సంగతిని గుర్తు చేసుకోవాలి. అయోధ్య ఎప్పటికీ తమదేనని, మళ్లీ స్వాధీనం చేసుకుంటామని మౌల్వీలు చెప్పలేదా? కాబట్టి ముస్లింలు వెనక్కి తగ్గరు. వాళ్లు మైనారిటీలు కాబట్టి, వాళ్లని నొప్పించడం సెక్యులరిస్టులకి నచ్చదు. కాబట్టి హిందువులే రాజీ పడాలని వారి కోరిక. రుజువులతో సహా ప్రార్థనా స్థలాలు హిందువులవేనని తెలుస్తున్నా, మళ్లీ హిందువులే రాజీ పడాలని చెప్పే ఏ శాసనాన్నైనా వారు ఎలా గౌరవిస్తారు? ఎందుకు గౌరవించాలి? ఐదువేల ఏళ్ల నాగరికత ఉన్న దేశంలో 1991 చట్టం చలామణి ఎంతటిదన్న ప్రశ్న అందుకే వచ్చింది. పైగా ముస్లింలలో కనిపిస్తున్నది ఏ రోటి దగ్గర ఆ పాట అన్నట్టే ఉంది. 370 రద్దుకు సంబంధించిన మూలాలు రాజ్యాంగంలోనే ఉన్నప్పటికీ వాటిని గౌరవించడానికి నిరాకరించిన వారు, ఇప్పుడు 1991 చట్టాన్ని గౌరవించాలంటూ ఎలా చెప్పగలరని కూడా హిందువులు ప్రశ్నిస్తున్నారు. ఇంతకీ సెక్యులరిస్టుల రాజీ మార్గం ఏమిటి? అయోధ్య వివాదం సమసిపోయింది. కాశీ, మధురలను హిందువులకు అప్పగించే రీతిలో ఇరు వర్గాలు రాజీ పడడం దేశానికి మంచిదని కొందరు సుద్దులు చెబుతున్నారు. అంటే ఆ మూడూ తీసుకుని హిందువులు సంతోషమేనని ప్రకటించాలి. మొదట ఈ రాజీ సూత్రాన్ని ముస్లింలు అంగీకరిస్తారేమో కనుక్కుంటే మంచిది. జ్ఞాన్‌వాపి, మధుర ఈద్గాలను శాంతియుతంగా హిందువులకు అప్పగిస్తారేమో అడగాలి.

ఢిల్లీలో కుతుబ్ మీనార్ దాదాపు పాతిక హిందూ దేవాలయాలను కూల్చి కట్టినదని భారత పురావస్తు శాఖ నివేదిక ఇచ్చింది. ఇటీవల మంగళూరులో ఒక మసీదును పునర్ నిర్మించడానికి కూల్చితే దాని కింద, పక్కన హిందూ ఆలయాల ఆనవాళ్లు బయట పడ్డాయి. తాజ్‌మహల్‌లో కూడా సర్వే చేయించాలని కొందరు కోరారు. అది తాజ్ మహల్ కాదు, తేజో మహల్ అనే శివాలయమన్న వాదన ఇప్పటిది కూడా కాదు. రెండు తెలుగు రాష్ట్రాలలోనే 140 వరకు ఇలాంటి వివాదాలు ఉన్నాయి. జ్ఞాన్‌వాపి మసీదును సర్వే చేయించడానికి కోర్టు ఆదేశించిన తరువాత దేశంలో పలుచోట్ల మసీదుల సర్వే కోసం విన్నపాలు వెల్లువెత్తాయి. కోర్టుల మాట పట్టదు. పురావస్తు శాఖ ఆధారాలు నమ్మమని చెబుతారు. ఒక్క మసీదును కూడా వదలబోమని చెబుతున్నారు. మరి ఇలాంటి వర్గంతో హిందువులు తలొంచుకుని రాజీకి రావాలని మేధావులు, సెక్యులరిస్టులు ఎలా కోరతారు? కాబట్టి కోర్టుల నిర్ణయమే తుది నిర్ణయం కావాలి. జ్ఞాన్‌వాపి అంటే జ్ఞానపు బావి. ఇప్పుడు చారిత్రక జ్ఞానాన్ని తోడిస్తున్న బావిగా కనిపిస్తున్నది. ★



మసీదు ముందు భాగం

## పీఎఫ్ఐ బెదిరింపు



జ్ఞాన్‌వాపి వివాదం కోర్టులలో ఉంది. కానీ 'ముస్లింల ప్రార్థనా స్థలాలను ఆక్రమించడానికి క్రూరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ పాప్యులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) గగ్గోలు మొదలుపెట్టింది. అంతేకాదు, ఈ చర్యలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకు రావలసిందిగా తన సంస్థ లేదా వర్గం యువకులకి, సభ్యులకి పిలుపును కూడా ఇచ్చింది. మసీదులకు వ్యతిరేకంగా ఏ రకమైన చర్యలనైనా ఎదుర్కొవాలంటూ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇదంతా ఆర్ఎస్ఎస్, ఇతర హిందుత్వ శక్తుల కుట్రేనని కూడా తేల్చేసింది. జ్ఞానవాపి మసీదు మీద, మధుర షాహీ ఈద్గా మీద అవాంఛనీయంగా హక్కును కోరుతున్నారని, దీనిని ఎదుర్కొవాలని కూడా సలహా ఇచ్చింది. కొత్తగా మంగళూరు మసీదు మీద కూడా ఆధిపత్యాన్ని కోరుతున్నారని గుర్తు చేసింది. పీఎఫ్ఐ కోర్టులను కూడా విడిచిపెట్టలేదు. హిందువులు సాక్ష్యాలుగా ప్రవేశపెడుతున్న అంశాలను అవి పరిశీలించడం లేదని ప్రకటించింది.

జ్ఞాన్‌వాపి సర్వేలో శివలింగం ఆకృతి బయటపడిందన్న వార్త బయటకు రాగానే పీఎఫ్ఐ ఈ ట్వీట్‌ను వెలువరించింది. చిత్రం ఏమిటంటే ఈ నెత్తుటి చరిత్రల అకృత్యాల గురించి దేశ వ్యాప్తంగా దర్యాప్తు చేసే పనిలో ఉండగా హిందువుల మీద మతోన్మాదం ముద్ర వేయడానికి పీఎఫ్ఐ విఫలయత్నం చేస్తున్నది. జ్ఞాన్‌వాపి వివాదం తరువాతనే కేరళలోని అళప్పుజాలో జరిగిన ఒక ఊరేగింపులో ఒక పిల్లవాని చేత ఈ సంస్థ మాట్లాడించిన మాటలు దేశం విస్తుపోయేటట్టు చేశాయి. ఈ దేశంలో హిందువులు, క్రైస్తవుల పని పడతామని ఆ పిల్లవాడు అరవడం కనిపించింది. కానీ ఈ నినాదాలు తమవి కాదని ఇప్పుడు పీఎఫ్ఐ వాదిస్తోంది. అయితే ఈ ఊరేగింపు నిర్వాహకుల మీద, అక్కడ వినిపించిన నినాదాల మీద పోలీసులు కేసు నమోదు చేశారు. ★

యూపీఏ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో మాలిక్ కరచాలనం చేస్తున్న ఫొటో ఆ మధ్య వైరల్ అయిన సంగతి తెలిసిందే. అలాగే అరుంధతీ రాయ్ కూడా అతడితో కలసి ఫొటో తీయించుకుంది. వందల మంది చావుకు కారణమైనవాడు, లక్షలాది మంది కశ్మీరీ పండిత్‌లు లోయ వీడి ప్రాణభయంతో పారిపోయే పరిస్థితులు సృష్టించినవాడు తాను గాంధీజీ అనుచరుడినని చెప్పడం కలికాలపు వింతకు మించిన వింత కాదా? త్రివర్ణ పతాకాన్ని చేతపట్టి దేశ వినాశనాన్ని కోరుతూ షాహీన్‌బాగ్‌లో తిష్ట వేసిన ఢిల్లీ అంతటా ప్రత్యేక బలగాలను మోహరించవలసి వచ్చిందంటేనే మాలిక్ ఘనత ఏమిటో అర్ధమవుతుంది. ముస్లిం మతోన్మాదులు హింసకు పాల్పడ వచ్చునని నిఘా వర్గాలు అనుమానించాయి.

జమ్ముకశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) నాయకుడు మాలిక్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ 2019లో అరెస్టు చేసింది. ఉగ్రవాదులకు నిధులు అందించిన ఆరోపణపై 2017లో నమోదైన కేసుకు సంబంధించి అప్పుడు అరెస్టు చేశారు. పాకిస్తాన్ నుంచి, ఉగ్రసంస్థ లష్కరే తాయిబా నిర్వాహకుడు ఊచకోతలో ఇతడు కూడా కీలకమే. ఇంకా షాబీర్‌షా, మస్రత్ ఆలం, మహ్మద్ యూసుఫ్ షా, అఫ్తాబ్ అహ్మద్ షా, నయీం ఖాన్, మహ్మద్ అక్బర్ ఖాండే, రాజా మెహరుజుద్దీన్ కల్వాల్, బషీర్ అహ్మద్ భట్, జహూర్ అహ్మద్ షా వతాలి, అబ్దుల్ రషీద్, నావల్ కిశోర్ కపూర్ ఉన్నారు.

మాలిక్ పుట్టినది (1966) శ్రీనగర్‌లోనే. ట్యాక్సీ డ్రైవర్లకీ, ఇద్దరు జవాన్లకీ మధ్య జరిగిన ఘర్షణను చూసిన తరువాత ఇతడు తిరుగుబాటు ధోరణిలోకి వచ్చాడని కొన్ని పత్రికలు రాస్తూ ఉంటాయి.

'నేను ఎప్పుడో ఆయుధం వదిలి పెట్టేశాను. ఆ తరువాత సాక్షాత్తు గాంధీజీ అహింసా మార్గంలోనే ఉద్యమించాను. మహాత్ముడి సిద్ధాంతాల మేరకు నడుచుకున్నాను. అహింసాయుత రాజకీయాలే నడిపాను.' ఇవి కరుడు కట్టిన ఒక ఉగ్రవాది నోటి నుంచి వెలువడిన మాటలు. అతడు ఎవరో కాదు, కశ్మీర్ వేర్పాటువాద నాయకుడు, ఉగ్రవాది, అక్కడి హిందువుల మీద జరిగిన అనేక ఘోరాలలో భాగస్వామి యాసిన్ మాలిక్. జాతీయ దర్యాప్తు సంస్థ న్యాయస్థానం (ఢిల్లీ) దోషిగా నిర్ధారించడానికి కాస్త ముందు అతడు చెప్పిన మాటలివి. యాసిన్‌ను ఉపా (అన్‌లాఫుల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్) కింద జాతీయ దర్యాప్తు సంస్థ విచారించింది. మరణదండనే ఇతడికి సరైన శిక్ష అని జాతీయ దర్యాప్తు సంస్థ న్యాయవాది వాదించినా, కోర్టు అందుకు నిరాకరించి రెండు యావజ్జీవిత కాలాల శిక్ష విధించింది. పది లక్షల రూపాయల జరిమానా విధించింది. హిందూ భారతదేశమే కశ్మీర్ మీద యుద్ధం చేస్తున్నదని మాలిక్ జాతీయ దర్యాప్తు సంస్థ న్యాయస్థానం న్యాయమూర్తి ప్రవీణ్ సింగ్ ముందు వాదించాడు. 'నేను ఏడుగురు ప్రధానులతో పనిచేశాను' అయినా నాలో ఉగ్రవాది కనిపిస్తే ఉరి తీయండి అని కూడా మాలిక్ సవాలు విసరడం ఈ ఉదంతానికి కొసమెరుపు.



# మాలిక్‌ను మన్నిస్తావా

తరహా దగాయే ఇది కూడా. మాకు రాజ్యాంగం శిరోధార్యమంటూంటూనే ఎర్రకోట మీద దాడి చేయడం ఈ కోవలోనిదే. ఇస్లామిక్ మత ఛాందసంలో, భారత వ్యతిరేక ధోరణిలో ఇప్పుడు కనిపిస్తున్న కొత్త కోణమిది. మరొకమాట కూడా చెప్పుకోవాలి.

యాసిన్ మాలిక్ అంటే పాక్ అనుకూల వేర్పాటువాదిగానే ప్రపంచానికి తెలుసు. మే 25న ఇతడికి శిక్ష ఖరారైంది. తన మీద దర్యాప్తు సంస్థలు చేసిన ఆరోపణలలో వేటినీ మాలిక్ తిరస్కరించలేదు. తాను నేరాలు చేసినట్టు రుజువు ఉంటే ఉరిశిక్ష వేసినా అభ్యంతరం లేదని బీరాలు పలికాడు. శిక్ష తగ్గించమని తాను ఏ కోర్టునూ దేబిరించననీ కూడా ప్రకటించాడు. దీనితో మే 19న ఇతడిని దోషిగా ప్రకటించారు. మే 24న యావజ్జీవ కారాగారం విధించారు. అది కూడా రెండు యావజ్జీవ కారాగార శిక్షలు. పది లక్షల రూపాయల జరిమానా కూడా విధించింది కోర్టు. తీర్పు ప్రకటించే సమయంలో హఫీద్ సయీద్, హిజ్‌బుల్ ముజాహిదీన్ నాయకుడు సయ్యద్ సలాహుదీన్‌ల నుంచి కూడా ఉగ్రవాద కార్యకలాపాల కోసం నిధులు తీసుకున్నట్టు జాతీయ దర్యాప్తు సంస్థ ఆరోపించింది. భద్రతా బలగాల మీద రాళ్లు విసిరే మూకలకు పంచడానికి, పాఠశాల భవనాలు తగలబెట్టడానికి, నిరసనలు, సమ్మెలు నిర్వహించడానికి ఈ డబ్బు వినియోగించాడని దర్యాప్తు సంస్థ అభియోగాలు మోపింది. కశ్మీర్‌లోయ నుంచి పండిత్‌లు వలస పోవడానికి ఇతడు కూడా కారణమని జాతీయ దర్యాప్తు సంస్థ ఆరోపించింది.

జాతీయ దర్యాప్తు సంస్థ న్యాయస్థానం ఇంకొందరి పైన కూడా అభియోగాలు మోపింది. ఇందులో ఫారూక్ అహ్మద్ దార్ కూడా ఒకడు. ఇతడినే బిట్టా కరాటే అంటారు. కశ్మీరీ పండిత్‌ల తరువాత తాలా పార్టీని స్థాపించాడు. 1986లో దీనికే ఇస్లామిక్ స్టూడెంట్స్ లీగ్ అని పేరు మార్చాడు. దీనికి విప్లవ సంస్థ అని పేరు. మాలిక్ నేరాల చిట్టా తక్కువదేమీ కాదు. ఇస్లామిక్ స్టూడెంట్స్ లీగ్ పంచిన కరపత్రాలతో అల్లర్లు చెలరేగేవి. 1983లో షేర్ ఇ కశ్మీర్ మైదానంలో వెస్టిండిస్‌తో జరగవలసిన క్రికెట్ మ్యాచ్‌ను భగ్నం చేయడానికి మాలిక్ ప్రయత్నించాడు. నేషనల్ కాన్ఫరెన్స్ సమావేశాలను భగ్నం చేయడం కూడా ఇందులో ఒకటి. దేశ వ్యతిరేక కార్యకలాపాలు, ఉగ్రవాద కార్యకలాపాలు, హత్యలు కారణంగా మక్బూల్ భట్ అనే ఉగ్రవాదిని ఉరి తీసినప్పుడు లోయలో అల్లర్లు సృష్టించాడు. దీనితో మాలిక్‌ను అరెస్టు చేసి నాలుగు నెలలు నిర్బంధంలో ఉంచారు. 1987 నాటి అసెంబ్లీ ఎన్నికలలో మాలిక్

# మహాత్మా!

సంస్థకు చెందిన అనుబంధ విద్యార్థి సంఘం ముస్లిం యునైటెడ్ ఫ్రంట్‌తో కలసి పనిచేసింది. మాలిక్ సంస్థ నేరుగా ఎందుకు పోటీ చేయలేదంటే, రాజ్యాంగం మీద నమ్మకం లేకపోవడమే. ఈ ఎన్నికల తరువాతే లోయలో ఉగ్రవాదం పెట్రేగిపోయింది. ఆ ఎన్నికల తరువాత మాలిక్ సాయుధ శిక్షణ కోసం ఆక్రమిత కశ్మీర్‌కు వెళ్లాడు.

కశ్మీర్‌ను రక్తపాతంతో అల్లకల్లోలం చేసిన సంస్థలలో దాదాపు మొదటిది జేకేఎల్ఎఫ్. మక్బూల్ భట్‌తో కలసి 1976లో అమానుల్లా ఖాన్



స్థాపించాడు. దీనిని ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో ప్రారంభించినప్పటికీ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాపూర్‌లో కార్యాలయం ఉండేది. లోయలో అతి పెద్ద ఉగ్రవాద సంస్థగా ఆవిర్భవించిన తరువాత జేకేఎల్ఎఫ్ విద్రోహచర్యలను ప్రారంభించింది. పాకిస్తాన్‌లో రెండేళ్లు సాయుధ శిక్షణ పొంది వచ్చిన తరువాత 1980 దశకంలో మాలిక్ ఈ సంస్థలోనే చేరాడు. లష్కరే తాయిబా, హిజ్‌బుల్ ముజాహిదీన్, జేకేఎల్ఎఫ్, జైషే మహ్మద్ వంటి సంస్థలు ఒకపక్క రక్తపాతం సృష్టిస్తుండగా, రాజకీయ పరిష్కారం నినాదంతో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడానికి ఏర్పడినది హురియత్ కాన్ఫరెన్స్. అందులో కూడా మాలిక్ సభ్యుడే.

మాలిక్ మీద 65 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో ఎక్కువ హత్య, హత్యకు ప్రయత్నించడం, దేశద్రోహం కేసులే అధికం. వీపీ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన మంత్రిమండలిలో హోంశాఖను నిర్వహించిన ముఫ్తీ మహ్మద్ సయీద్ కుమార్తె రుబయా అపహరణ ఉదంతం దేశాన్ని కదిపింది. 1989లో జరిగిన ఆ కేసులో మాలిక్ ఉన్నాడు. 1990లో జరిగిన నలుగురు వైమానిక దళ సిబ్బంది హత్య కేసులోను మాలిక్ నిందితుడు.

ఇతడు 1990లోనే బాగా గాయపడి ఉన్న దశలో భద్రతా దళాలకు దొరికాడు. తరువాత 1994 వరకు కారాగారంలో ఉన్నాడు. ఎందుకో మరి అదే సంవత్సరం బెయిల్ మీద వచ్చిన తరువాత జేకేఎల్ఎఫ్ నిరవధికంగా కాల్పుల విరమణ పాటిస్తుందని ప్రకటించాడు.

సమయం దొరికింది కదా అని పాకిస్తాన్‌లో ప్రతి నాయకుడు మాలిక్ మీద వల్లమాలిన ప్రేమ కురిపిస్తున్నారు. పనిలో పనిగా భారత్‌ను ఆడిపోసుకుంటున్నారు. మాలిక్‌కు జాతీయ దర్యాప్తు సంస్థ ఉరిశిక్ష విధించాలని సూచించడం ద్వారా భారత్ ఫాసిస్ట్ దేశమని రుజువయిందని పాకిస్తాన్ పీకేసిన ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ వ్యాఖ్యానించడం విశేషం. ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా మాలిక్‌ను శిక్షించిన రోజు భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి దినమని గోల పెట్టాడు. ఆ దేశ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో, కశ్మీరీ సోదర సోదరీమణులకు తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని నోరు పారేసు కున్నాడు. పాకిస్తాన్ సంగతి సరే. ఇస్లామిక్ దేశాల సహకార వ్యవస్థ (ఓఐసీ) వైఖరి ఎంత ప్రమాదకరంగా, నీతి బాహ్యంగా ఉన్నదో చెప్పడానికి మాటలు చాలవు. యాసిన్ మాలిక్ శిక్ష పట్ల ఆ సంస్థ నిరసన ప్రకటించింది. ఒక ఉగ్రవాది హత్యను వివాదాస్పదం చేసి ఒక దేశాన్ని బోనులో నిలబెట్టే యోచన నీచం కాదా? ఈ ధోరణి మతం ప్రాతిపదికగా ఒక దేశ వ్యవహారాలలో ఒక అంతర్జాతీయ సంస్థ కలుగచేసుకోవడమే. ఇది ప్రపంచానికి పెద్ద ప్రమాద సంకేతమే. ఒక ఉగ్రవాదిని, నరహింతకుడిని శిక్షిస్తే ఇంత రాద్ధాంతం దేనికి? ఏ రుజువులూ లేకుండా పాకిస్తాన్ మాదిరిగానో, చైనా మాదిరిగానో అతడిని గుట్టుచప్పుడు కాకుండా విచారించలేదు. జైల్లో కుక్కలేదు. అసలు ముస్లిం దేశాలలో ఉండే న్యాయవ్యవస్థ ఎలాంటిది? అక్కడ హక్కుల మాటేమిటి? ముందు ఆ సంగతి ఆ సంస్థ ప్రశ్నించుకోవాలి.



అయినా మాలిక్ ఇంత సులభంగా తన నేరాలను ఎందుకు అంగీకరించినట్టు? ఏ ధీమాతో జైలుకు వెళ్లడానికి సిద్ధమైనట్టు? ఇది కూడా కుట్రేనా? ఇవన్నీ ఎలా ఉన్నా పాకిస్తాన్ ఉగ్రవాదుల పట్ల తనకు ఉన్న అనురాగాన్ని మాలిక్ ఉదంతంతో మరొకసారి లోకానికి చాటుకుంది. శ్రీనగర్‌లో ప్రస్తుతానికి కుక్కిన పేనుల్లా ఉన్న పాక్ మానసపుత్రులు మళ్లీ గొంతెత్తారు. తీర్పు వెలువడిన తరువాత శ్రీనగర్‌లోని మాలిక్ ఇంటి దగ్గర కొందరు గుమిగూడి భారత వ్యతిరేక నినాదాలు చేశారు. వారిలో కొందరిని అరెస్టు చేశారు కూడా. ఇలాంటి ధోరణిని నిలువ రించాలంటే ఎలాంటి చట్టాలు రావాలి? అసలు హక్కులు అనేవి ఇలాంటి ముస్లిం ఉగ్రవాదులకీ, మతోన్మాదులకేనా? వీళ్ల చేతుల్లో నిర్దాక్షిణ్యంగా మరణించినవారికి హక్కులు ఉండవా? కొన్ని కోట్ల మంది నమ్ముతున్న వ్యవస్థను మతోన్మాదంతో ఏ కొద్దిమందో తుపాకీ సాయంతో భగ్నం చేద్దా మనుకుంటే ఎంతటి కఠిన శిక్షలు అవసర మవుతాయి? ★

కాశ్మీర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన పాక్ కొత్త ప్రధాని.



సుజాత గోపగోని, 6302164068

# మోదీకి ముఖం చూపించలేకే పారిపోయారా?



జాతీయ రాజకీయాలంటూ తనదైన పల్లవి అందుకున్న కేసీఆర్.. భారత ప్రధాని నరేంద్ర మోదీని ముఖాముఖిగా కలిసే సందర్భం ఎప్పుడొచ్చినా తప్పించుకుంటున్నారు. ఒక ప్రభుత్వాధినేతగా దేశ, రాష్ట్ర సంబంధాలకు వారధిగా ఉండాల్సిన కేసీఆర్.. ప్రధాని నరేంద్రమోదీకి ముఖం చాటేస్తున్నారు. కనీసం ప్రొటోకాల్‌నూ అనుసరించడం లేదు.

గతంలోనే ఓసారి హైదరాబాద్‌కు మోదీ వచ్చిన సమయంలో అనారోగ్యం కారణం చూపించగా.. మొన్నటికి మొన్న మరోసారి ప్రధానమంత్రి అధికారిక కార్యక్రమం కోసం హైదరాబాద్ వచ్చిన సమయం లోనూ కేసీఆర్ ప్రొటోకాల్ పాటించాల్సి వస్తుందని తనదైన షెడ్యూల్‌ను రూపొందించుకున్నారు. ప్రధానికి స్వాగతం, వీడ్కోలు పలకాల్సి వస్తుందని, ఆయన ఉన్నంతసేపు వెంట ఉండాల్సి వస్తుందన్న కారణంతో బెంగళూరు పర్యటనకు వెళ్లారు. ఆయన వైఖరి రాష్ట్రంలో తీవ్ర చర్చకు దారి తీసింది.

ప్రధాని నరేంద్రమోదీ హైదరాబాద్ పర్యటన ఖరారైన తర్వాత కేసీఆర్ ముందుగా రూపొందించు కున్న షెడ్యూల్ ప్రకారం వారం రోజుల పాటు దేశ రాజధాని ఢిల్లీలో ఉండాలి. ఆ మేరకు మే 20వ తేదీన కేసీఆర్ ఢిల్లీ వెళ్లారు. అక్కడ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో పాటు మరికొందరితో భేటీ అయ్యారు. మరుసటిరోజు పంజాబ్ వెళ్లి.. రైతు ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వాళ్లకు తెలంగాణ ప్రభుత్వం తరఫున మూడు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆ తర్వాత అనూహ్యంగా షెడ్యూల్‌ను పక్కనబెట్టి 22 సాయంత్రమే హైదరాబాద్ చేరుకున్నారు.

ఇక, పీఎంఓ షెడ్యూల్ ప్రకారం మే 26వ తేదీన నరేంద్రమోదీ హైదరాబాద్ వచ్చారు. ముందుగా రూపొందించుకున్న షెడ్యూల్ ప్రకారం అదేరోజు కేసీఆర్ కూడా బెంగళూరు పర్యటన షెడ్యూల్‌లో చేర్చుకున్నారు. న్యూఢిల్లీ నుంచి నేరుగా బెంగళూరు వెళ్లాల్సిన కేసీఆర్ మధ్యలోనే హైదరాబాద్ రావడంతో బెంగళూరు పర్యటన రద్దు చేసుకున్నట్టే అని కొందరు భావించారు. మరికొందరేమో హైదరాబాద్ నుంచే నేరుగా బెంగళూరు వెళ్తారని భావించారు. దీంతో, 26వ తేదీన కేసీఆర్ ఏం చేస్తారన్న దానిపై చివరి దాకా ఉత్కంఠ కొనసాగింది. కానీ, మోదీ తెలం గాణకు వచ్చిన రోజు కేసీఆర్ హైదరాబాద్‌లో ఉండ కుండా కర్ణాటక బయలుదేరి వెళ్లిపోయారు. ఇక, ఆయన ముందు రూపొందించుకున్న షెడ్యూల్ ప్రకారం బెంగళూరు నుంచి నేరుగా మహారాష్ట్రలోని రాలెగావ్ సిద్ధి, షిరిడీ వెళ్లాల్సి ఉంది. కానీ, అదేరోజు సాయంత్రం తిరిగి హైదరాబాద్ వచ్చారు. మహా రాష్ట్రకు వెళ్లాల్సిన కేసీఆర్.. ఆ పర్యటనను ఆకస్మి కంగా రద్దు చేసుకున్నారు. అంటే, కేవలం ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం, వీడ్కోలు పలకొద్దని, ఆయన పాల్గొన్న సభలో తాను పాల్గొనవద్దన్న ఉద్దేశంతోనే కేసీఆర్ తన షెడ్యూల్‌లో మార్పులు చేసుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్‌లోని ఐఎస్‌బీ 20వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. అంతకుముందు తనకు స్వాగతం పలికిన పార్టీ నేతలు, కేడర్‌ను ఉద్దేశించి బేగంపేట ఎయిర్‌పోర్టు దగ్గర బహిరంగసభలో ప్రసంగించారు. అదేరోజు చెన్నై వెళ్లిన ప్రధాని.. 30 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రధాని హైదరా బాద్, చెన్నై పర్యటనలు అధికారికంగా జరిగినవి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ పార్టీలు అధికా రంలో ఉన్నాయి. అంతేకాదు బీజేపీని ఈ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నారు. అయితే, ప్రధాని మోదీ పర్యటనలో తెలం గాణ సీఎం ఒకలా.. తమిళనాడు ముఖ్యమంత్రి మరోలా వ్యవహరించారు. మోదీ కార్యక్రమానికి డుమ్మా కొట్టి బెంగళూరు వెళ్లారు కేసీఆర్. తమిళ నాడు సీఎం స్టాలిన్ మాత్రం ప్రధాని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దీంతో ఇద్దరు ముఖ్యమంత్రుల తీరుపై జోరుగా చర్చ సాగుతోంది. మోదీకి ముఖం చూపించ లేకే కేసీఆర్ బెంగళూరు పారిపోయారని రాష్ట్ర బీజేపీ నేతలు మండిపడ్డారు. నిజానికి బీజేపీని టీఆర్ఎస్ కంటే డీఎంకే పార్టీనే ఎక్కువ వ్యతిరేకిస్తుంది. అయినా డీఎంకే చీఫ్, తమిళనాడు సీఎం స్టాలిన్ మాత్రం చెన్నై వచ్చిన ప్రధాని మోదీకి విమానాశ్రయంలో స్వాగతం పలికారు. ప్రధాని కార్యక్రమంలో పాల్గొ న్నారు. అంతేకాదు రాష్ట్రానికి సంబంధించిన డిమాండ్ల చిట్టాను, విజ్ఞప్తుల జాబితాను సభా వేదికపైనుంచే ప్రధానికి వినిపించారు.

మరోవైపు సోషల్ మీడియాలోనూ కేసీఆర్ తీరుపై నెటిజన్లు ఫైరవుతున్నారు. ప్రధాని మోదీ కార్యక్రమానికి హాజరై రాష్ట్రానికి మరిన్ని నిధులు కొత్త ప్రాజెక్టులు వచ్చేలా ప్రయత్నిం చాల్సింది పోయి, డుమ్మా కొట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ప్రధాని రాష్ట్రానికి వచ్చినప్పుడు గౌరవించాల్సిన అవసరం, బాధ్యత ఉంటాయని గుర్తు చేస్తున్నారు. ఆరోజు ప్రధాని మోదీని ప్రశ్నిస్తూ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో బ్యానర్లు వెలిశాయి. వాటిలో తెలంగాణకు సంబంధించిన 17 సమస్యలను ప్రస్తావిస్తూ మోదీని నిలదీశారు. వీటిని టీఆర్ఎస్ పార్టీయే ఏర్పాటు చేసిందనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రానికి సంబం ధించిన సమస్యలను ఇలా బ్యానర్లలో పెట్టి ప్రచారం చేసుకోవడం కంటే.. నేరుగా ప్రధానిని కలిసి నిలదీస్తే సరిపోయేది కదా అనే ప్రశ్నలు వస్తున్నాయి. మొత్తంగా ప్రధాని మోదీ పర్యటనలో కేసీఆర్ తీరుపై సొంత పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తమవుతోందని తెలుస్తోంది.

సాధారణంగా పార్టీలు సిద్ధాంతాలు వేరైనప్పుడు కేంద్రంతో కొన్ని రాష్ట్రాలు దూరంగా ఉంటాయి. కానీ గిట్టకపోయినా, నచ్చకపోయినా దేశ ప్రధాని రాష్ట్రానికి వస్తున్నారంటే ప్రొటోకాల్ ప్రకారం కొన్ని కార్యక్రమాలకు విధిగా హాజరు కావాల్సి ఉంటుంది. తెలంగాణ సీఎం కేసీఆర్ మాత్రం బీజేపీతో కొన్నాళ్లుగా నెలకొన్న విభేదాల కారణంగా ప్రధాని నరేంద్రమోదీ కార్యక్రమాలకు వరుసగా డుమ్మా కొడుతున్నారు. అయితే, రాష్ట్రంలో బీజేపీ సంచలన విజయాలు సాధించడం, క్రమంగా అధికార పార్టీకి దీటుగా ఎదుగుతుండటమే కేసీఆర్‌కు గిట్టడం లేదని, అందుకే ప్రధాని ఎన్నిసార్లు వచ్చినా దూరంగా ఉంటున్నారని అంటున్నారు.

**వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్**

# రెండు రుగ్మతలకు ఓ డాక్టర్ ప్రిస్క్రిప్షన్

ఒక పెద్ద మార్పు పరిధి ప్రపంచమే కావచ్చు. అయినా కూడా ఒక వ్యక్తిని, కుటుంబాన్ని, గ్రామాన్ని అది ఎలా కదపి కుదిపిందో, దాని ఫలితం ఏమిటో, మానసికంగా అది మిగిల్చిన గాయం లేదా సంతోషం ఎలాంటివో సాహిత్య ప్రక్రియలు చెప్పేందుకు యత్నించాలి. ఇలాంటి ప్రయత్నమే డాక్టర్ రమణ యశస్వి 'మా గణపవరం కథలు' సంకలనంలో చేశారు. ఇది 31 కథల ఈ సంకలనం.

కొవిడ్ 19 మొత్తం ప్రపంచాన్ని కల్లోల పరిచిన సమస్య. దాని ప్రభావం ప్రతి కుటుంబం మీద ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పడింది. వృత్తి చేత డాక్టర్, ప్రవృత్తికి రచయిత డాక్టర్ యశస్వి 'పెద్దమ్మ', 'బెడ్‌రూమ్‌లో బెర్ముడా ట్రయాంగిల్', 'ఓట్లు రాలు కాలం', 'గొట్టంగురు', 'తెలుగు ప్రాణం' 'ఏది మహమ్మారి?' కొవిడ్ 19 నేపథ్యంతో సంబంధం ఉన్న ఇతివృత్తాలతో రాసిన కథలే.

'పెద్దమ్మ' కథలో ఆ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంటుంది. అమెరికాలో ఉన్న తన సంతానం ఎట్టి పరిస్థితులలోను ఇక్కడకు రాదు. కానీ వారి మీద అలాంటి నిందపడడం ఆమెకు ఇష్టం లేదు. కరోనా కాబట్టి తన పిల్లలు రాలేకపోయారని లోకాన్ని నమ్మించడం ఆమె ఉద్దేశం. 'ఏది మహమ్మారి?' కరోనా సమయంలో సొంతూళ్లకీ, సొంతవాళ్లని కలుసుకోవడానికీ సాగిన ప్రయాణాలు, ఆ ప్రయాణాలలో ఎదురైన దారుణ అనుభవాలు చెప్పే కథ. ఇటీవలి ప్రపంచం చరిత్రలో అతిపెద్ద విషాదంగా చెప్పుకునే కరోనా వలసలలోని మానసిక సంఘర్షణనీ, సామాజిక దృశ్యాన్నీ చిత్రించదలిచారు. చెన్నైలో చిక్కుపడి పోయిన తండ్రి కోసం బయలుదేరిన తల్లీకూతుళ్లు అష్టకష్టాలు పడి వెళ్లాక కుటుంబ పెద్దను ఏ స్థితిలో చూశారు? ఎలా బతికించుకున్నారు? అదే కథకు ముగింపు. 'తెలుగు ప్రాణం'కథలో అమెరికాలో ఉన్న తన వారసులు తెలుగు నేర్చుకోవాలని పదవీ విరమణ చేసిన ఒక తెలుగు పండితురాలి ఆవేదన ఇందులో కనిపిస్తుంది. కరోనాతో ఆసుపత్రిలో చేరిన ఆ పండితురాలు తన కూతురు, మనవరాలి రాక కంటే ముందు తెలుగు మాటకీ, పాటకీ స్పందించడం ఇందులో ప్రత్యేకత.

ఇవాళ ప్రపంచం ఎదుర్కొంటున్న మరొక సమస్య–సామాజిక మాధ్యమాలకు వ్యవస్థ బానిసైపోవడం. వాటిని తిట్టుకుంటూనే అంతా ఊడిగం చేస్తున్న మాట నేటి నిజం. దీనికి వయసుతో, దానితో కలిగే ప్రయోజనంతో నిమిత్తం లేదు. కానీ దీని నుంచి బయటపడడానికి కొందరు చేసే ప్రయత్నం గురించి రచయిత చెప్పారు. ఈ ప్రయత్నంలో రచయిత సాంస్కృతిక విధ్వంసాన్ని చూడడం తిరోగమన మైతే కాదు. కరోనా కనిపించే మహమ్మారి. సామాజిక మాధ్యమాల వ్యసనం కనిపించని మహమ్మారి. 'బామ్మగారి 'యాప్'కాయ వైరస్' ఇతివృత్తమూ ఇదే. ఏమీ తోచడం లేదనుకుంటూ సామాజిక మాధ్యమాలకు బానిసైతే ఎలా ఉంటుందో చెప్పే కథ. ఓ మనవడు బామ్మకి వాట్సాప్ అలవాటు చేస్తాడు. అది ఆమె బలహీనతగా మారింది. కర్పూరం పాస్‌వర్డ్ చేసి దేవుడికి హారతి పట్టమంటుంది. కొబ్బరికాయ కొట్టి నైవేద్యం పెట్టకుండా ఫోటో తీసి వాట్సప్‌లో ఆల్‌గాడ్స్ గ్రూప్‌కి పంపుతుంది. దాని నుంచి బయట పడాలని ప్రయత్నించి మళ్లీ గుళ్లూ గోపురాలకు వెళుతుంది. చివరికి కాశీ వెళ్లి వాట్సప్ వదిలేసి వస్తుంది. 'అమ్మ ఉన్న ఇల్లు' కథ ఇతివృత్తం కూడా పై కథకు దగ్గరగానే ఉన్నా, వేరే కోణాన్ని స్పృశిం చింది. ఒక పెద్దావిడ నగరంలో ఉండే కొడుకు ఇల్లు వదిలి,



**మా గణపవరం కథలు**

**రచన:** డాక్టర్ రమణ యశస్వి

**ప్రతులకు:** అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో

**పే.:**220 **వెల:** రూ.200/-

**ఫోన్ :** 9848078807

పల్లెటూళ్లో ఉన్న ఇంటికి వెళుతుంది–ఫోన్‌కి దూరం కావాలని. కానీ ఆమె లేని ఇంటిని చూసిన కొడుకు వెళ్లి తీసుకువచ్చాడు. సామాజిక మాధ్యమాలు తెస్తున్న విభజనను అలా భర్తీ చేశాడు.

ఆడ/మగ జననాల మధ్య సమతౌల్యం ఉండాలని చెప్పే అంశంతో ఇందులో కథ ఉంది. చిత్రంగా అది ఒక నమ్మకం నుంచి వచ్చిన కథ. పేరు, 'కాటీడు కోక'. రెండు భాగాలుగా ఉండే ఆ కోకలో ఒక భాగం ఒక గర్భిణి తీసుకుంటుంది. రెండో భాగం మరొక గర్భిణికి వెళుతుంది. మొదటి భాగం తీసుకున్న గర్భిణికి మగబిడ్డ పుడితే, రెండో భాగం తీసుకున్న వారికీ మగబిడ్డే పుడుతాడని నమ్మకం. ఆడబిడ్డ అయితే, రెండో వాళ్లకీ ఆడబిడ్డే. కానీ ఒకే కాటీడు కోకలో మొదటి భాగం తీసుకున్న గర్భిణికి ఆడపిల్ల పుడుతుంది. ఎవరైనా ఒకటే అనుకుంటున్న గర్భిణికి మగపిల్లవాడు పుడతాడు. నిజానికి ఇక్కడ చిన్న ట్విస్ట్ పెట్టారు రచయిత. అంటే చేతులు మారింది కాటీడు కోక. ఆ చీరను మొదట తీసుకున్న ఇద్దరికీ మగ పిల్లలు పుట్టారు. చేతులు మారినప్పుడు ఆడపిల్ల పుట్టింది. ఇది ఆడ,మగ జననాల మధ్య సమతౌల్యం కోసం, అంతేకాకుండా ఒక కొత్త జీవికి సంబంధించి సంఘంలో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యం కోసం కల్పించుకున్న ఒక ఆచారమని అంటారు రచయిత. 'అల్టిమేటం' కథ ఆడశిశువుల పట్ల వివక్ష చూపే ఓ కుటుంబం నుంచి బయటకు వచ్చిన ఒక ఇల్లాలిది. ఈ కథ ముగింపు ప్రత్యేకంగా ఉంటుంది. 'ప్రేమించు' వైద్యశాస్త్రానికి సంబంధించిన కథ. ప్రేమ అనే ఒక యువతి సమస్య. అందం కోసం కొన్ని ప్రకృతి ధర్మాలను పాటించకపోవడం వల్ల కలిగే 'గుండె బాధ' ఇందులో ఇతివృత్తం. చాలా అరుదుగా స్వీకరించే హిజ్రా జీవితం నుంచి కూడా ఒక కోణాన్ని పరిచయం చేస్తూ ఇందులో 'తోటమాలి చమత్కారం' అన్న కథకు చోటిచ్చారు డాక్టర్ యశస్వి.

'ఒక గీత ఆత్మకథ'–చేతిలో గీతలు, కుల ధ్రువీకరణలు నమ్మని దివ్యాంగురాలైన అమ్మాయి కథ. వైకల్యాన్ని అధిగమించడం గురించి చెప్పేది. వాళ్లని చూసి జాలి పడకండి, గర్వపడండి అని అంటారు రచయిత. అంటే వాళ్ల విజయాలని చూసి గర్వపడమని అర్థం.

ఇటీవల భారతీయ సమాజంలో కూడా అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాల అవసరం ఎక్కువయింది. ఇది పడిపోతున్న కుటుంబ విలువలకు అద్దం పట్టే పరిణామమే. 'మదరమ్మ' అనాథ శరణాలయం నేపథ్యంగా ఉన్న కథ. తన మనవరాలినే (అరుణ) అక్కడ సుందరమ్మ పెంచుతుంది. ఆడపిల్ల పుట్టిందని కొడుకే ఈ ఆశ్రమానికి పంపేస్తాడు. అరుణ కూడా పెళ్లి చేసుకోకుండా మరొక మదరమ్మ అవుతుంది. తన లాంటివాళ్ల సేవకు జీవితాన్ని అంకితం చేస్తుంది. 'కూతురింటికి దారేది?' కూడా వృద్ధాశ్రమం నేపథ్యంగా ఉన్నదే. మారుతున్న కాలమే ఇతివృత్తంగా వచ్చిన కథలలో, ఆ కాలానికి ప్రతినిధులుగా ఉండే పాత్రలలో పాతకాలం మనస్తత్వాన్ని ఊహించలేం. వేరే స్త్రీని జీవితంలోకి తెచ్చుకున్న భర్తను మరో ఆలోచనే లేకుండా వదిలి వెళ్లిన యువతి కథ, 'ఈ మొగుడు నాకొద్దు'. జీవిత భాగస్వామి ఏం చేసినా మౌనం వహించడం ఇవాళ్టి మహిళ లక్షణం కాలేదు.

రచయిత వైద్యుడు కాబట్టి మానసిక సంఘర్షణను, వృత్తిపరమైన దృష్టి నుంచి చిత్రించారు. అలాగే వైద్యుడు రచయితను అరికట్టే ప్రయత్నమూ చేయలేదు. ★

కోనసీమ జిల్లా పేరు మార్పు అంశం హింసాత్మకంగా మారడం శోచనీయం. సున్నితమైన ఈ అంశంపై నిర్ణయం తీసుకునేటప్పుడు ప్రజాభిప్రాయాన్ని కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. అలాగే నిరసనకారులను అడ్డుకోలేక పోవడం, వారిచే ఎమ్మెల్యే ఇల్లు దహనం కావడం అనేది పోలీసుల వైఫల్యమే. ఇదిలా ఉంటే ఈ అంశాన్ని రాజకీయం చేస్తూ పార్టీలు లబ్ధి పొందాలని చూస్తున్నాయి. కోనసీమ జిల్లాకు డా. బి.ఆర్. అంబేడ్కర్ పేరు పెట్టాలన్నది ఎప్పటి నుంచో వస్తున్న డిమాండ్. కోనసీమ చూడటానికి ఎంత ప్రశాంతంగా, అందంగా ఉంటుందో అంత సున్నితమైనది. ఇక్కడి కుల సమీకరణలు పెద్ద విధ్వంసాన్ని సృష్టించిన సంఘటనలు అనేకం జరిగాయి. పేరు మార్పుపై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సమస్యను సామరస్యంగా పరిష్కరించి ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కాని ప్రభుత్వం కొన్ని వర్గాలవారి అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకపోవడం, నిరసనకారులను పట్టించుకోక పోవడంతో వారు రెచ్చిపోయి హింసకు దిగారు. ఇలాంటి వాటి కోసమే ఎదురుచూసే అరాచకశక్తులు చెలరేగిపోయి కోనసీమను అగ్నిగుండంగా మార్చాయి. ఇదిలావుంటే ఉద్రిక్త పరిస్థితిని అదుపు చేసే పేరుతో జిల్లా వ్యాప్తంగా ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేయడం వినియోగదారులకు, ఇంటి నుంచి పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది.



# కోనసీమ విధ్వ

కోనసీమ జిల్లా పేరు మార్పును నిరసిస్తూ మే 24న చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి తీవ్ర విధ్వంసానికి దారి తీసింది. ఇటీవల ప్రభుత్వం జిల్లాలను విభజించింది. అన్ని జిల్లాలను విడదీసింది. వాటికి జిల్లాతో సంబంధం ఉన్న కొందరి ప్రముఖుల పేర్లు పెట్టింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి కోనసీమ ప్రాంతాన్ని విడదీసి కొత్త జిల్లా ప్రకటించారు. దానికి కోనసీమ జిల్లాగా పేరుపెట్టారు. కాని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న అంబేడ్కర్ పేరును మాత్రం పెట్టలేదు. ఈ అంశంపై రాజకీయ పార్టీలు అభ్యంతరాలు తెలిపాయి. ఈ జిల్లాకు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం కొత్త జిల్లాల పేర్లు, సరిహద్దులపై అభ్యంతరాలు తెలుసుకునేందుకు నెల రోజుల గడువు విధించింది. అన్ని పార్టీల విజ్ఞప్తి మేరకు డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరు మార్చారు. కాని కొన్ని వర్గాల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోనికి తీసుకోలేదు. అసలు వాటిని వినేందుకు కూడా అవకాశం ఇవ్వలేదు. ఏకపక్ష నిర్ణయాల వల్ల హింసాత్మక పరిస్థితులు ఏర్పడ్డాయనేది వాస్తవం.

కోనసీమ పేరునే కొనసాగించాలని జేఏసీ చేపట్టిన ఆందోళన రణరంగంగా మారింది. కోనసీమ జిల్లాకు అంబేడ్కర్ కోనసీమగా పేరు మార్పు చేస్తూ రెవెన్యూ శాఖ ప్రాథమిక ఉత్తర్వులు జారీచేసింది. అభ్యంతరాలు, సూచనలు తెలియజేయాలని కలెక్టరు సూచించారు. దీంతో కొందరు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లాగానే పేరు ఉంచాలని ఆందోళనలు చేశారు. యువత, జేఏసీ నేతలు పలుమార్లు నిరసనలు చేపట్టారు. అమలాపురం పట్టణం ముట్టడికి జేఏసీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో అలజడి రేగింది. ఆందోళన నేపథ్యంలో అమలాపురంతో పాటు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ విధించారు. అమలాపురంలో 25 చోట్ల పోలీసులు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఒక్కసారిగా జేఏసీ నేతృత్వంలో ఆందోళనకారులు గడియారం స్తంభం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ దాడిలో ఎస్పీ సుబ్బారెడ్డితో పాటు పలువురు పోలీసులు గాయపడ్డారు. పోలీసులు లాఠీచార్జీ చేశారు. దొరికిన వారిని దొరికినట్టుగా చితకబాదారు. ఆందోళనకారులను అరెస్ట్ చేశారు. వీరిని తరలించేందుకు తీసుకు వచ్చిన వాహనాలను కూడా నిరసనకారులు ధ్వంసం చేశారు. 20 మంది పోలీసులకు గాయాలయ్యాయి. లాఠీఛార్జీలో కూడా పలువురు గాయపడ్డారు. కొందరు యువకులు ఒక ప్రైవేటు బస్సుకు నిప్పుపెట్టారు. కలెక్టరేట్ నుండి కొందరు



కొందరు యువకులు ఒక ప్రైవేటు బస్సుకు నిప్పుపెట్టారు. కలెక్టరేట్ నుండి కొందరు ఆందోళన కారులు ఎర్ర వంతెన సమీపంలోని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని ఇంటిపై రాళ్లతో దాడిచేసి నిప్పుపెట్టారు. ఎర్ర వంతెన హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉంటున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ ఇంట్లోకి కూడా ఆందోళనకారులు చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఇంటికి నిప్పు పెట్టారు. ఎర్ర వంతెన సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులను పూర్తిగా ధ్వంసం చేసి, నిప్పు పెట్టారు...



# ంసానికి కారకులెవరు?

ఆందోళనకారులు ఎర్ర వంతెన సమీపంలోని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకుని ఇంటిపై రాళ్లతో దాడిచేసి నిప్పుపెట్టారు. ఎర్ర వంతెన హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉంటున్న ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ ఇంట్లోకి కూడా ఆందోళనకారులు చొరబడి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఇంటికి నిప్పు పెట్టారు. ఎర్ర వంతెన సమీపంలో రెండు ఆర్‌టీసీ బస్సులను పూర్తిగా ధ్వంసం చేసి, నిప్పు పెట్టారు... ఇలా అమలాపురం అగ్నిగుండంగా మారింది. పరిస్థితులు అదుపు తప్పాయి. ప్రశాంతంగా ఉండే అమలాపురంలో ఇప్పుడు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేయడానికి పోలీసులు అమలాపురంతో పాటు జిల్లాలోని రావులపాలెం, అంబాజీపాలెం, రాజోలు, కొత్తపేట ఇతర పల్లె ప్రాంతాల్లో అప్రకటిత కర్ఫ్యూను విధించారు. అన్ని ప్రాంతాల్లో భారీగా పోలీసులు, ప్రత్యేక దళాల సిబ్బందిని మోహరించి గస్తీ నిర్వహించారు. అనుమానం వచ్చినవారిని అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం విడిచిపెట్టారు. సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్ట్‌ల కారణంగానే ఈ సమస్య వచ్చినట్లు గుర్తించిన పోలీసులు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను నాలుగైదు రోజుల పాటు నిలిపివేశారు. ఇంటర్నెట్ పనిచేయకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్ల నుంచి పనిచేస్తున్న పలు కంపెనీల సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**పోలీసుల వైఫల్యం!**

అమలాపురంలో భారీ విధ్వంసానికి పోలీసుల వైఫల్యమే ప్రధాన కారణమని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాగ్రహం, ఆందోళన తీవ్రరూపం దాల్చి సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి, అధికార పార్టీ ఎమ్మెల్యే నివాసాలకే నిప్పు అంటించటం, ప్రాణభయంతో ఉన్న వారిని అక్కడి నుంచి తరలించాల్సిన పరిస్థితులు తలెత్తటం, ఏకంగా జిల్లా ఎస్పీపైనే రాళ్లదాడి వంటి ఘటనలను చూస్తే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంతలా దిగజారిపోయాయో అర్థం చేసుకోవచ్చు. కుల సమీకరణల పరంగా అత్యంత సున్నిత ప్రాంతమైన కోనసీమలో చిన్న వివాదం కూడా పెద్ద పెద్ద ఘర్షణలకు దారితీసిన అనుభవాలు గతంలో చాలా ఉన్నాయి. అలాంటిచోట జిల్లా పేరు మార్పుపై అభ్యంతరం తెలుపుతూ గత నాలుగైదు రోజులుగా భారీ నిరసనలు చేపడుతూనే ఉన్నారు. అవి తీవ్రరూపం దాల్చక ముందే పరిస్థితి అంచనా వేసి జాగ్రత్త పడాల్సిన పోలీసులు ఈ విషయంలో ఘోరంగా విఫలమయ్యారు. నిరసనలు తెలుపుతున్న వారి అభ్యంతరాలేంటో చర్చల ద్వారా తెలుసుకోలేకపోయారు. వాటి ఫలితమే ఈ విధ్వంసమని స్థానిక ప్రజలు అంటున్నారు.



**తురగా నాగభూషణం**

**సీనియర్ జర్నలిస్ట్**


పేరు మార్పుపై అభ్యంతరాలను కలెక్టరేట్‌కే పరిమితం చేయకుండా, డివిజన్, మండల కేంద్రాల్లో కూడా తీసుకుంటే ఎక్కడి వారు అక్కడే ఉండేవారు. అందరూ అమలాపురం వచ్చే అవకాశం అంతగా ఉండేది కాదు. అభ్యంతరాలు ఇవ్వడానికే రోజూ వందలు, వేలల్లో అమలాపురం వచ్చేవారు. ఎక్కువమంది వస్తున్నారంటూ వారిపై ఆంక్షలు విధించారు. ప్రభుత్వం తమ అభ్యంతరాల్ని అసలు పట్టించుకోవట్లేదనే ఆందోళనే ఈ పరిస్థితికి కారణమైంది. నిరసనలు తెలిపేందుకు కూడా అవకాశం లేకపోవటం, పోలీసుల నుంచి ఎదురైన చర్యలతో నిరసనకారుల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆవేశం కట్టలు తెచ్చుకుని ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది.

**సమాజాన్ని చీల్చే కుట్ర**

వైకాపా అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమాజంలో కుల, మత రాజకీయాలు నడుస్తున్నాయి. ఓట్ల కోసం ప్రభుత్వం అన్యమతాలకు ప్రోత్సాహకంగా ఉంటూ.. తమను అణచివేస్తున్నట్లు హిందువులు ఆరోపిస్తున్నారు. తప్పు చేసినా కూడా ఓటు బ్యాంకు కోసం నిందితులపై కేసులు వేయకుండా వెనకేసుకు వచ్చిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు ఈ వివాదాలను అడ్డుపెట్టుకుని రాజకీయ లాభం పొందాలని చూస్తున్నట్లు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఏది ఏమైనా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పేరును వివాదాల్లోకి లాగడం శోచనీయం. భారతీయులందరికీ ఎంతో స్ఫూర్తినిచ్చిన అంబేద్కర్‌ను కొందరి వాడుగా ప్రచారం చేసుకోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది.

సమాజాన్ని చీల్చడమే లక్ష్యమైన కుట్ర రాజకీయాలను ప్రజలే తిప్పికొట్టాలి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ప్రజలు పూర్తి స్థాయిలో సంయమనం పాటించాలి. అదే కుట్రదారుల కపట వ్యూహాల నుంచి సమాజాన్ని కాపాడుతుంది. ★



❋ పౌరాణికం ❋

# రావణ గర్వ

*(గత సంచిక తరువాయి)*

కాలం గడిచి రాముడిప్పుడు ఇరవై అయిదేళ్ల వాడయ్యేడు. మంథర జోల పాట పాడుతూంటే నిద్రలోకి జారుకున్న ఒకప్పటి పాలబుగ్గల కుర్రాడిప్పుడు నల్లనివాడు, పద్మ నయనంబులవాడు, మహాశుగంబులున్ విల్లును దాల్చువాడు, గడు విప్పగు వక్షము వాడు, మేలు పై జల్లెడు వాడు, నిక్కిన భుజంబుల వాడు, యశంబు దిక్కులన్ జల్లెడు వాడు. రాముడెలా ఉన్నా, మంథర బతుకు మాత్రం ఇలా కొట్టుమిట్టాడుతూండగానే ఓ రోజు పిడుగు లాంటి వార్త. మహారాజు విశ్రాంతి కోరుకుంటూ రాముడిని రాజుగా అభిషేకించ బోతున్నాడు. ఓ విధంగా ధర్మమూర్తి అయిన రాముడు రాజైతే ప్రజలందరికీ మంచిదే. మరి ఇక్కడ రాముడికి శస్త్రవిద్యంతా పట్టుబడిందనీ, రాజౌతున్నాడనీ తెలిస్తే రావణాసురుడు యుద్ధం ప్రకటించడూ? కైకమ్మ చెప్పడం ప్రకారం అనరణ్యుడి తోటీ, మాంధాత తోటీ ఈ రావణుడు యుద్ధాలు చేయలేదా? వాళ్లని ఓడించలేదా? తమ రాజ్యంలాగే అయోధ్య, ఇక్ష్వాకు వంశం కూడా సర్వ నాశనం అవబోతున్నాయా? మరి రాముడు ఇక్కడ రాజ్యం ఏలుతూ కూర్చుంటే రావణుణిని చంపేదెప్పుడూ? పరధ్యానంగా నడుస్తూ కైక మందిరం లోకి వచ్చింది మంథర.

"మంథరా ఇది విన్నావుటే, రాముడు మహారాజు కాబోతున్నాడు!" సంతోషంగా అంటోంది కైక. చూడబోతే కైక కాళ్లు నేలమీద ఆనుతున్నట్టు లేవు. ఆవిడ సంతోషం ఆవిడది.

"విన్నానమ్మా, నాకూ సంతోషమే."

"అలా నీరసంగా అంటావేమే?"

"నా కుటుంబం గుర్తొచ్చి అలా అనిపించింది. ఏమనుకోకమ్మా."

"అవునా? పోనీలే, ఎందుకంతగా గుర్తు తెచ్చుకోవడం ఆ పాత విషయాలు?"

"ఓ సారి రాముడు రాజైతే మళ్లీ అకారణంగా రావణాసురుడొచ్చి యుద్ధం ప్రకటిస్తాడేమో, ఈ అయోధ్య కూడా మా రాజ్యం లాగానే సర్వనాశనం అవుతుందేమో అనే భయం నన్ను నిద్ర పోనీయ ట్లేదమ్మా."

కైక ఒక్కసారి ఆలోచనలో పడింది.

"నాదగర చిన్న ఉపాయం ఉంది మరి మీకు నచ్చుతుందో లేదో?"

"చెప్పు చూద్దాం?"

"ఇలా చెప్పినందుకు నా మీద కోపం తెచ్చుకోనని మాట ఇస్తేనే చెప్తాను."

"సరే"

"రాముడిని ఏదో విధంగా అడవుల్లోకి పంపించగలిగితే అక్కడ్నుంచి ఒక్కో రాక్షసుణ్ణీ చంపుకుంటూ చివరికి రావణున్ని కూడా చంపడం కుదురుతుందని విశ్వామిత్రులవారు అనడం విన్నాను."

"ఎన్ని రోజులు వెళ్లాలి అడవుల్లోకి?"

"ఏమో, రెండు మూడు రోజులు సరిపోవు కదా? జనస్థానం నుంచి దండకారణ్యం దాకా నేల ఈనినట్టు కాచుకుని ఉన్నారు రావణసేన. ఎన్ని







❋ తాత్వికత ❋

ఓ పెద్ద మనిషి తనకు తెలిసిన వాళ్లింటికి పుట్టినరోజు వేడుకకు వెళ్లాడు. అక్కడ ఒక షో కేసులో రకరకాల బొమ్మలు అతన్ని ఆకర్షించాయి. అన్నిటిని పరిశీలనగా చూస్తున్నాడు. తల ఆడిస్తూ ఉన్న ఓ బొమ్మ అతన్ని మరింత ఆకర్షించింది. తన మనవరాలికి ఇవ్వాలనే ఆశ కలిగింది. అటు ఇటు చూసి చప్పున తన జుబ్బా జేబులో వేసుకున్నాడు.

అప్పుడే ఆ చిన్నారి అతన్ని తడుతూ 'తాతయ్య ఆ బొమ్మ నీ కిష్టమా!' అని అడిగింది. 'అవును తల్లీ' అన్నాడు. 'అడిగితే నేనే ఇచ్చే దాన్నిగా మీరు అలా చేయటం..' అని ఆగింది. ఆ మాటకు సిగ్గుతో తలదించుకున్నాడు. చటుక్కున ఆ బిడ్డను ఎత్తుకొని 'ఆ బొమ్మ నాకిస్తావా, ఇంటి దగ్గర నీ చిట్టి చెల్లికి ఇస్తాను' అన్నాడు. 'ఓ! అలాగే తీసుకు వెళ్లు తాతా! మరి నా కేమిస్తావు?' అని అడిగింది ఆ పాప. 'నీ చిన్ని మనసుకు ఓ చిట్టి ముద్దు తల్లి' అని పాప నుదుటిపై ముద్దాడాడు. ★

## దోర్బల పూర్ణిమాస్వాతి

# భంగం-4

వేలమంది ఉన్నారో ఎవరికెరుక? మరో మాట కైకమ్మా! రాముడు ఒంటరిగా వెళ్తేనే మంచిది అడవుల్లోకి. మళ్లీ మందీ మార్బలంతో వెళ్తే, ఈ వార్త రావణుడికి చేరిందా! వాడే వచ్చి యుద్ధం ఆరంభించవచ్చు. అనవసరపు జనక్షయం. మనలో రాముడు తప్ప మహారాజు సహా మిగతావారంతా తోకముడిచే వీరులనే సంగతి మీకూ తెలుసు కదా?"

"ఒక్కడూనా?" కైక ఆశ్చర్యపోయింది.

"అవునమ్మా అలా వెళ్తేనే యుద్ధ ధర్మం ప్రకారం రావణుడు ఒక్కడూ వస్తాడు యుద్ధానికి. ప్రజలందర్నీ చావకుండా రక్షించవచ్చు. ఇంతకుముందు మా రాజ్యంలో జరిగిన మారణకాండ గుర్తు పెట్టుకుని చెప్తున్నాను. ఒక్కడి కోసం రాజ్యంలో ప్రజలనందర్నీ పణంగా పెట్టడం దేనికీ?"

''మరి రాముడు ఒక్కడూ రావణుణ్ణి ఎదుర్కోగలడా?"

"మీరే చెప్పారు కదా? ధనుర్విద్యలో రాము దంతటివాడు లేడనీ? ఇంకా సందేహిస్తున్నారేం? విశ్వామిత్రుడంతటి రుషి ఇచ్చిన అస్త్రాలు అత్యంత శక్తిమంతమైనవి కాదూ? రాముడు ధనుష్టంకారం చేసి యుద్ధంలో నిలబడితే ఎవరమ్మా ఎదురు నిలవగలిగేది?"

కాసేపు మౌనం తర్వాత సాలోచనగా అంది కైక "పద్నాలుగా రోజులు నేను రాముణ్ణి చూడకుండా ఉండగలను. పూర్వం విశ్వామిత్రుడికి దగ్గరకి పంపినట్టే ఈసారి కూడా రాముడిని అడవుల్లోకి పంపమని మహారాజునీ ఒప్పించగలననుకో. కౌసల్యా, సుమిత్రలను ఎలాగోలా ఒప్పించగలను కూడా. అంతవరకూ అయితే సరే. ఆ పైన నగుమోము కలవాని నా మనోహరుని, జగమేలు శూరుని, జానకీవరుని, సుజ్ఞాన నిధిని, సూర్య లోచనుని చూడకుండా కుదరదు మరి. ఏం చేద్దాం?"

"పద్నాలుగురోజుల్లో ఏమౌతుందో?" తన ఆలోచనను పైకే అంది మంథర.

"మంథరా, ఇంతకన్నా నేను నీకేమీ చేయలేను. కావాలిస్తే చెప్పు. పద్నాలుగు రోజులు. అంతే!"

మంథర ఆలోచించింది ఒక్క క్షణం. విశ్వామిత్రుడు తనకేసి చూసిన చూపులూ, తనచేత రావణ సంహారానికి బీజం వేయిస్తానని చెప్పడం అన్నీ గుర్తొచ్చాయి. ఇదే తనకి ఉన్న ఒకే ఒక అవకాశం. ముందు రాముడు అడవికి వెళ్తే అప్పుడు చూసుకుందాం. అసలు రాముడు ఎక్కడికీ వెళ్లకుండా అయోధ్యలో పిల్లా పాపల్తో సంసారం చేయడం కంటే పద్నాలుగు రోజులు వెళ్లడమే మంచిది. ఇక్కడ సంసారం చేస్తూ కూచుంటే ఎప్పుడో ఒకప్పుడు ఆ రావణుడొచ్చి అయోధ్యని తగలబెడతాడు. అప్పుడు మొత్తం రాజ్యం నాశనం అవడం ఖాయం, "సరే మీ ఇష్టం, కానీ అడవుల్లోకి పంపడానికి కారణం ఏం చెప్తారు?" అడిగింది కైకని.

"నువ్వే చెప్పు, ఎలా అడగాలో మహారాజుని."

''ఆ మధ్య మీకు మహారాజు రెండు వరాలిచ్చారని అన్నారు కదా? అవి ఇప్పుడు అడగండి. మొదటిది రాముడు పద్నాలుగు రోజులు అడవిలోకి, రెండోది ఈ పద్నాలుగు రోజులూ భరతుడు రాజు అయ్యేటట్టూ."

"భరతుడా? లక్ష్మణుడుండగా భరతుడేమిటే? నీకేమైనా పిచ్చెక్కలేదు కదా?"

"లేదమ్మా, భరతుడి కోసం కఠమైన సవితి తల్లి అవతారం ఎత్తండి ఈ ఒక్కరోజుకీ. ఓహో సొంత కొడుకు కోసం ఇలా అడిగింది అనుకుంటారు ప్రజలు. అయినా ఈ రెండు కోరికలు మహారాజు తీర్చినప్పుడు కదా? రేపు పట్టాభిషేకం అనగా ఇలాంటి కోరిక కోరితే ఈయన తట్టుకోగలడా?

"ఏమౌతుందేం?"


"ఏమో మహారాజుకేమైనా అయితే మీ ముగ్గురి రాణులకీ వైధవ్యం.ఎందుకు నాచేత అనిపిస్తారు? వద్దులెండి, చూద్దాం. రాజు ఒప్పుకోడనే నా అనుమానం. ఒప్పుకున్నా పద్నాలుగు రోజుల్లో ఏదో పెద్ద అద్భుతం జరిగితే తప్ప రాముడు రావణుణ్ణి ఎదుర్కోడానికి సమయం చాలవద్దూ? రాక్షసులు చూడబోతే లక్షల్లో ఉండొచ్చు. రాముడేమో ఒక్కడు."

"చూద్దాం. నేను అడగవల్సింది అడుగుతాను."

''భరతుడు ఇప్పుడిక్కడ ఎలాగూ లేడు. తాతగారింటికి వెళ్లాడు. మీరు ఎంత కాలమైనా భరతుడిని చూడకుండా ఉండగలరు కానీ రాముడిని చూడకుండా ఉండలేరు కదా? సరే మీ ఇష్టం, మీ మాటే కానివ్వండి."

కైక భవనం లోంచి మంథర తిన్నగా ఇంటి కొచ్చిందన్న మాటే గానీ రాత్రంతా ఉత్కంఠ. కైక అడుగుతుందా? రాజు ఏమంటాడో? మర్నాడు పొద్దున్నే వార్త దావానలంలా వ్యాపించింది. రామ పట్టాభిషేకం రద్దు చేశారు, కైక కోరిన వరాల వల్ల. ఆశ్చర్యం ఏమిటంటే పద్నాలుగు రోజులు మాత్రమే రాముడిని విడిచి ఉండగలను అని మంథరతో పట్టుపట్టిన కైక కోరిన మొదటి వరం రాముడిని పద్నాలుగు సంవత్సరాలు వనవాసానికి పంపమని అడగడం. మంథర తాను విన్నదాన్ని నమ్మలేక దాదాపు పరుగెట్టుకుంటూ వెళ్లి కైకని చూడ బోయింది. మొదలు నరికిన చెట్టులా కూలబడిపోయి ఉంది కైక. మహారాజు వంటిమీద తెలివి లేదు. పరిచర్యలు చేశాక కూడా ఏమీ తేరుకున్నట్టు లేదు. మంథర రావడం చూస్తూనే మిగిలిన పరిచారకులు పక్కకి తప్పుకున్నారు. ★

❄ 'మొక్క'బడి ❄



# ఉత్తమ సమిధలకు ఉత్తరేణి

అపామార్గ పత్రం అన్న సంస్కృత పదానికి ఉత్తరేణి అని వ్యవహార నామం. గణపతికి చేసే పత్రీ పూజలో ఉత్తరేణికి యెనలేని ప్రాముఖ్యం ఉంది. దీని కొమ్మలతో పళ్ళు తోముకుంటే దంతవ్యాధులు, ఆకులు నూరి పైపూతగా రాస్తే చర్మవ్యాధులు నివారణమవుతాయి. దీని పుల్లలు యజ్ఞయాగాదుల్లో, హోమాల్లో వినియోగించడం వలన హోమగుండం నుంచి వచ్చిన పొగను పీల్చడం చేత శ్వాసకోశ సంబంధిత వ్యాధులు తగ్గిపోతాయి.

స్థూలకాయానికి, వాంతులకు, పైల్స్‌కు, ఆమం(టాక్షిన్స్) వలన వచ్చే వ్యాధులకు మంచి ఔషధం ఉత్తరేణి. ఉత్తరేణి ఆకులను రుబ్బి గాయాలపై రాయడం వలన అవి త్వరగా మానిపోతాయి. నొప్పి తగ్గిపోతుంది. ఉత్తరేణి ఆకుల రసం గాయాల నుండి రక్తం కారడాన్ని అరికడుతుంది. దీని ఆకులతో తయారు చేసిన నూనె చెవుడుకు మందుగా పని చేస్తుంది. మూత్రసంబంధిత వ్యాధులకు పనిచేస్తుంది ఉత్తరేణి.

పిల్లలు చెడుమార్గంలో వెళ్తున్నారని, చెడ్డ అలవాట్లకు లోనవుతున్నారని బాధపడే తల్లిదండ్రులు ఉత్తరేణి మొక్కను పూజించి, దాని వేర్లను పిల్లల మెడలో కడితే బుద్ధిమంతులవు తారు. రోజు ఉత్తరేణి కొమ్మలతో పళ్ళు తోముకునే అలవాటు ఉన్నవారు ఎక్కడకు వెళ్ళినా, ఆహారానికి లోటు ఉండదు. ఆహారం దొరకని ఎడారిలో కూడా ఎవరో ఒకరు పిలిచి భోజనం పెడతారు. అది ఉత్తరేణి మొక్క మహిమ. ఇంకా ఉత్తరేణికి అనేక ఔషధ విలువలు ఉన్నాయి. ఇంత గొప్ప ఉత్తరేణి మన దేశంలో ఎక్కడపడితే అక్కడ పెరుగుతుంది. ★

నెగళ్లు మండుతున్నాయి. దూరంగా ఎక్కడో నక్క ఊళ. అది కూడా శ్రద్ధగా విన్నాడు రామన్న. రంప జమిందారీ వారసత్వం గాథలో మిగిలిన భాగం చెబుతున్నాడు రామన్న. ఏది జరగకూడదని మునసబులూ, కొండోళ్లూ కోరుకున్నారో అదే జరిగింది. ఒకసారి కాదు రెండు పర్యాయాలు కూడా, వద్దనుకున్నదే జరిగింది. కంపెనీ అధికారులు జగ్గా అమ్మనే తండ్రికి వారసురాలిగా మన్సబ్ దార్ని చేశారు. మింగలేక కక్కలేక ఉండిపోయారు మునసబులూ, ప్రజలూ. ఓ ఆడదానికి ఒంగి ఒంగి దణ్ణాలు పెట్టడం ఎలా? అదే ప్రశ్న. 'కొత్త మన్సబ్ దారుని కూర్చోపెట్టేటప్పుడు మమ్మల్ని అడిగే పని లేదా ! కంపెనీ నిర్ణయాన్ని అంగీకరించలేం' అంటూ మెలిక పెట్టారు, తమ అసమ్మతి ఆ పద్ధతిలో వ్యక్తం చేస్తూ. కానీ ఈ అసమ్మతిని గట్టిగా వినిపిస్తే, ఒత్తిడి చేస్తే ఆమె తమ్ముడుని మన్సబీదారుని చేస్తారని శంక. ఇంకో ఎత్తు కూడా వేశారు. పోనీ పెళ్లయినా చేసుకోమని జగ్గా అమ్మని అంతా కోరారు. అల్లుడిని రంగం మీదకు తేవచ్చుననీ, ఈమెను పరదా వెనక్కి నెట్టేయవచ్చు ననీ వారి ఆలోచన. ఈ ఒత్తిడి భరించలేక ఆమె తన తమ్ముడికి అనుకూలంగా మన్సబ్‌దారి పదవి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించింది. మహిళకు ఒంగి ఒంగి సలాములు చేసే పని తప్పిందనుకుంటే, ఇప్పుడు ఉంపుడుగత్తె కొడుకును సింహాసనం మీద కూర్చోబెట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తున్నది. ఒప్పుకోలేదు ప్రజలు. ఇంకో ఎత్తు వేశారు. శ్రీజగ్గా అవివాహిత. అదే వాళ్లకి గొప్ప ఆయుధంగా మారిపోయింది. ఆమె మంచిది కాదని ప్రచారం మొదలైంది. మునసబులంతా కలసి అక్కాతమ్ముళ్లని రంపదేశం నుంచి బహిష్కరించారు. రాంభూపతి కంపెనీ అధికారులకి ఫిర్యాదు చేశాడు. పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చినట్టు కంపెనీ జమిందారీని తమ చేతుల్లోకి తీసుకుని పిల్ల రాంభూపతి మైనార్టీ తీరే వరకు జాగ్రత్తగా కాపాడతానంది. ఈ నిర్ణయమే నాలుగేళ్ల తరువాత చినికిచినికి గాలివానై ఫితూరీ దాకా వెళ్లింది. రంపదేశంలో కలెక్టర్ దొర పెండర్‌ఘా పాలన మొదలయింది. ఇలాంటి పాలన గురించి మన్యం ఎప్పుడూ వినలేదు. చూడలేదు. తమని తెల్లోడు పాలించడం అసహ్యంగా అనిపించింది. ఎనిమిదేళ్లు రంప విభాగం అతలాకుతలమైపోయింది. ముఠా దారులే అల్లర్లు చేయించారు. మన్సబ్‌దారులు, మునసబులు వర్గాలుగా చీలిపోయారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న మన్సబ్‌దారుల ఇళ్ల మీద దాడులు జరిగాయి. ఈ దాడులకు నాయకత్వం వహించినవాడు పాలెపు పెద్దిరెడ్డి. ఇతడు బగత. ఇతడిదొక బృందం. ఎందుకో హఠాత్తుగా అల్లర్లు సద్దుమణిగాయి. ఈ నిశ్శబ్దాన్ని పిల్ల రాంభూపతి నియామకం గురించి తీసుకున్న నిర్ణయానికి ఆమోదమనే కంపెనీ పొరబడింది. చివరికి ఎవరి మాటనీ ఖాతరు చేయకుండా ఈస్టిండియా కంపెనీ పిల్ల రాంభూపతిదేవ్‌నే జమిందారుగా ప్రకటించింది. మళ్లీ భగ్గుమంది రంపదేశం. ఇంకొందరు మన్సబ్‌దారుల, మునసబులు తిరుగుబాటులో చేరారు. వీళ్లందరినీ కుంఫిణీ ప్రభుత్వం కొండల నుంచి బహిష్కరించింది. అయినా అల్లర్లు సాగుతూనే ఉన్నాయి. కొత్త జమిందారు కొండ కింద గ్రామాలలో ఉంటూ చుట్టం చూపుగా ఎప్పుడో ఒకసారి రంప వెళ్లేవాడు. విపరీతమైన డబ్బు ఆశ. ఏదో ఒక పేరుతో ప్రజలని డబ్బు కోసం వేధించడమే అతడి వ్యాపకం.

* * *

తన సహాయకుడు చెప్పిన మాటలు మరింత కలవర పెట్టాయి డాక్టర్ మూర్తిని. చిత్రాళ్ల గొప్పులో ఏం జరుగుతోందో చూసొచ్చాడతడు. పని జరుగుతున్న చోటు దరిదాపులకి వెళ్లడానికి కూడా భయం వేసిందట. గప్పీ దొర బంగ్లా దగ్గరకే కాదు, రోడ్డు పని దగ్గరకి వెళ్లడానికి కూడా ఎవరూ ఒప్పుకోరట. "మనల్ని డిప్యూటీ తాసీల్దారు దొర పని కాడికే రానీడు దొరా! ఇక పరీక్షలేం చేస్తాం? తమరు సర్కారోళ్లు పంపిన డాట్రుగారు కాబట్టి ఇక తప్పక రానిచ్చినా, ఒక్క కొండోడు కూడా మీతో మాట్లాడే సాహసం చెయ్యడు బాబు! అలాగుంది అక్కడ పరిస్థితి." అన్నాడతడు. "ఎందుకు ? భయమేనా?" అన్నారు డాక్టర్ మూర్తి. "భయమే కదా దొరా! అదికాక మరేం ఉంటది! తమరు ఇటు తిరుగుతారో లేదో, మీతో మాట్లాడిన ఆ కొండోళ్లని బాస్టీను దొర బతనిస్తాడా బాబయ్యా! ప్రాణాలు తీసీకుండా వదుల్తాడా !" అన్నాడు అతడు. "అదీ నిజమేలే!" అన్నారు డాక్టర్ మూర్తి. తమ డాక్టర్ దొర అక్కడికి వెళ్లే ఆలోచన





# లంబసింగి రోడ్డు

**8**

డా॥ గోపరాజు నారాయణరావు

నుంచి ఇప్పటికి వెనక్కి తగ్గినందుకు అతడు చాలా సంతోషించాడు. కర్తవ్యాన్ని విస్మరిస్తున్నానన్న న్యూనతా భావం డాక్టర్ మూర్తిలో మరింత పెరిగింది. ఈ నిస్సహాయతకు మూలమేమిటో అర్థం కావడం లేదు. తెల్లవాళ్లే కాదు, వాళ్ల కింద పని చేస్తున్న నల్లవాళ్లు కూడా ప్రజలని తెల్లవాళ్లలాగే హింస పెడుతున్నారు.

* * *

గూడెం కొత్తవీధి సంత.

"ఏరా మునసబు! ఈళ్ల పేర్లేంటి?" అడిగాడు బాస్టియన్.

అతడు చెప్పాడు, ఆ ముగ్గురి పేర్లు "ఈడి పేరు నేతి బోడేసు. ఆడెనకాల ఉన్నోళ్లు మంగడు, సోముడు దొరా!"

"ఎక్కణ్ణించి కొట్టుకొచ్చా నారింజపళ్లు? గత్తం (ఎరువు) ఏసినట్టు ఏపుగా ఉన్నాయి!" వ్యంగ్యంగా అడిగాడు బాస్టియన్.

కొండవాళ్లని భయపెట్టకపోతే లాభం లేదు. తుపాకీ గుండుకు దొరక్కుండా పారిపోతున్నారు. డౌనూరు సంతకి రావడం మానేశారు. పక్కనే రోడ్డు పని. రేపన్నరోజు పని మొదలుపెడితే ఎలా? అందుకే గూడెం కొత్తవీధి సంతకి వచ్చాడు బాస్టియన్. మన్య ప్రజలని బెదరగొట్టాలి. మాట వినేటట్టు చేయాలి. మునసబు ఇంటి ఎదురుగానే సంత. అరుగు మీద నులక మంచం వేయించుకుని కూర్చుని ఉన్నాడు. పక్కన పిళ్లై మస్తరు పట్టుకుని ఉన్నాడు. చిత్రాల్లగొప్పు రోడ్డు పని దగ్గర కిష్టయ్యని పెట్టి వచ్చారు. ఈ "ఏరా మునసబు! ఈ కొండోళ్లు మన్యం సొమ్ముని ఇలా అడ్డంగా మేసేస్తన్నారేంటి ? చట్టాలున్నాయి. మునసబులు కూడా సర్కారోళ్లే కదా! ఆ మాత్రం చెప్పలేరా?" "పళ్లు ఆళ్ల తోటలోయేనంట దొరా!" మునసబులని కూడా సర్కారులో భాగమని చెప్పినందుకు సంతోష పడుతూనే, నీళ్లు నములుతున్నట్టు చెప్పాడు భయం భయంగా మునసబు.


మూడు గంపల్లో నిగనిగలాడిపోతూ నోరు ఊరిస్తున్నాయి ముద్దబంతి రంగు నారింజపళ్లు. "నువ్వు నోరు మూస్తావా ? పోలీస్టేషన్కి నువ్వు కూడా వస్తావా ? "అన్నాడు బాస్టియన్. "మా తోటలోయే దొరా!" బోడేసు అన్నాడు భయం భయంగా. "తోళ్లు తీయించీగల్ను ఎదవా!" గట్టిగా అరిచాడు బాస్టియన్. 'ఏరా మునసబు ! ఈళ్లని పోలీసు స్టేషన్కి తీసుకుపోమ్మంటావా ? ఇక్కడే ఏదైనా మాట్లాడతావా?" అన్నాడు లౌక్యంగా. మునసబుకి అర్థమైంది. "పేదోళ్లం కనికరించాలి దొరలు." చేతులు నలుపుకుంటూ అన్నాడు మునసబు. "రెండ్రూపాయలు జరిమానా కట్టమను ఎదవల్ని!" అన్నాడు మునసబు. గుండె జారిపోయింది ఆ ఇద్దరికి. వాళ్ల బొడ్డున ఉన్న రూపాయి పావలా, తన రొంటిన ఉన్న ముప్పావలా తీసి బాస్టియన్ చేతిలో పెట్టాడు మునసబు. "మునసబు ! ఈ పళ్లు పోలీసు స్టేషన్లో అప్పగించాలి. ఏదైనా సంచిలో ఏసి అక్కడే ఉంది మన గుర్రం. దాని మీద ఎక్కించు!" ఆదేశించాడు బాస్టియన్.. పిళ్లై గుంభనంగా నవ్వుకున్నాడు.

* * *

"కారం తమ్మనదొర పేరు మన్నెం మర్చిపోకూడదు!" అంటూ మొదలుపెట్టాడు రామన్న.

మూడో రాత్రి కూడా రంప కథే చెప్పాడు కారం తమ్మనదొర పేరు వినగానే వాళ్ల నిద్రమత్తంతా తేలిపోయింది. పిల్ల జమిందారు తీరుకి గొడవలు మరింతగా పెరిగిపోయాయి. పెద్దిరెడ్డి తిరుగుబాటుకు తోడు మరో తిరుగుబాటు మొదలైంది. దీని నాయకుడే కారం తమ్మనదొర. తమ్మనదొర రంపదేశంలోనే బండపల్లి ముఠాదారు.

కోయ కులం. ముప్పయ్ మందితో దండుని కూడేసి తిరుగుబాటు లేవదీశాడు. రంపదేశంలో కుంఫిణీ కొమ్ము కాస్తున్న మన్సబ్దార్లని తరిమికొట్టడానికి తిరుగుబాట్లు చేస్తున్న పెద్దిరెడ్డి బృందం కూడా తమ్మనదొరతో కలిసిపోయింది. ఇద్దరూ సాహసులే. పోలీసుల మీద కలిసి దాడులు చేసేవారు. అప్పుడే తమ్మనదొర హఠాత్తుగా మొత్తం మన్యానికి వీరాధివీరునిగా అవతరించాడు. అల్లర్లను అణచడానికి రంప అడవులలోకి వచ్చిన పోలీసు బృందం మీద తమ్మనదొర బృందం చాటు నుంచి దాడి చేసి దిమ్మెరపోయేటట్టు చేసింది. మన్యప్రజలు



విస్తుపోయారు ఆ సాహసానికి. నట్టడవిలో జరిగిన ఈ దాడిలో ఏమైందో తెలుసా? ఎప్పుడూ ఎవరూ విన్లేదు మరి! పన్నెండు మంది పోలీసులు చచ్చి పోయారు. ఇంకో ఇరవై మందికి దెబ్బలు తగిలాయి. వాళ్ల హాహాకారాలు ఆ కొండలలో ప్రతిధ్వనించాయి. ఐదేళ్లు... పోలీసులని దాడులతో ఉక్కిరిబిక్కిరి చేసేశాడు తమ్మనదొర.

కానీ ఒక్కసారిగా ఎదురుదెబ్బ తగిలింది. పెద్దిరెడ్డిని ఎవరో మోసం చేశారు. దొరికిపోయేటట్టు చేశారు. పాపం, కోర్టు పంచాయితీకి వెళ్లకుండానే రాజమండ్రి జైల్లో చనిపోయాడు. తరువాత తమ్మనదొరను పట్టించిన వారికి బహుమానం ప్రకటించింది కంపెనీ ప్రభుత్వం. దీనితో ఇతడు జడ్డంగి పారిపోయాడు. ఇది రంపకీ, గూడానికీ మధ్య గ్రామం. బండపల్లి ముఠాని పోలీసులు జప్తు చేశారు. పెద్దిరెడ్డి చనిపోయాడు. అయినా అల్లర్లు ఆగలేదు. ఎవరు చేస్తున్నట్టు? తండ్రిని మోసగించిన వాళ్ల అంతు తేలుస్తామంటూ పెద్దిరెడ్డి ముగ్గురు కొడుకులు, మరో ముప్పయ్ మందిని కూడగట్టి అల్లర్లు మొదలు పెట్టారు. అదీ సంగతి. జప్తుచేసిన బండపల్లి ముఠాకి నలభయ్ ఏళ్ల తరువాత మళ్లీ కారం తమ్మనదొర కొడుకునే వృద్ధాప్యంలో తీసుకొచ్చి ముఠాదారుని చేశారు తెల్లోళ్లు. నలభయ్ ఏళ్లకి తమ్మనదొర కొడుకు ఎందుకు గుర్తుకొచ్చాడు? గుర్తొచ్చేటట్టు చేసినవాళ్లు ఇద్దరు. వాళ్లే కారం తమ్మనదొర. ఇంకొకరు ద్వారబంధాల చంద్రయ్య లేదా చంద్రారెడ్డి.

ఆ ఇద్దరు తమ్మనదొర కొడుకు ముఠాదారు కావడానికి ఒక్క సంవత్సరం ముందే రంప కొండలలో పోలీసుల మీద దండెత్తారు.

ఈ తమ్మనదొర కూడా కోయ నాయకుడే. ఈయన ఇంకో తమ్మనదొర. పాత తమ్మనదొరది బండపల్లి ముఠా. ఈ తమ్మనదొరది చోడవరం దగ్గర ఉన్న భూపతిపాలెం. ఇతడు రంగంలోకి దిగాక తెల్ల ప్రభుత్వానికి తలొగ్గి ఏం సాయం చేసినా సరే, ఆ గ్రామం బూడిద చేసేవాడు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న ప్రతి మునసబు చేతులు కట్టేసి లాక్కుపోయారు. పట్టుకోవడానికి పోలీసులు వస్తుంటే ఆ సమాచారం అంతా తిరుగుబాటుదార్లకు ఎప్పటికప్పుడు చేరిపోయేది.

నిన్నటి దాకా వేసిన రోడ్డుని రోలర్‌తో చదును చేస్తున్నాడు విలియం. అలికిన నేల ఆరినట్టే ఉంది రోలర్ చదును చేశాక. అక్కడ రోలర్ తిరుగుతూ ఉంటే, కొంచెం ముందు రోడ్డు వెయ్యవలసిన ఎగుడు దిగుడు నేలని కొందరి చేత చదును చేయిస్తున్నాడు బాస్టియన్. చదును చేసిన నేల మీద ఆడవాళ్లు గంపల్లో తెచ్చిన ఎర్రకంకర పోస్తున్నారు. తరువాత ఎర్రకంకర మీద నీళ్లు చల్లుతున్నారు. ఇంకొక చోట దిమ్మెసా జరుగుతోంది. కూలీలు వాళ్ల పని వాళ్లు చేస్తున్నారు. ఆ చెట్టు కింద నిలబడ్డ బాస్టియన్ మాత్రం విలియంని కొరికి చంపేయాలన్నంత కోపంగా చూస్తున్నాడు. దాని పొగ గొట్టంలాగే అతడి గుండె కూడా భుగభుగ లాడిపోతోంది. అప్పుడే వచ్చాడు సంతానం పిళ్లై 'వణక్కం' అంటూ. "మస్తరు చూశావా పిళ్లై?" అడిగాడు బాస్టియన్. "ఆమ... పొద్దున్నే చూసి పూడ్చినాను దొర." అన్నాడు ఎక్కడ లేని వినయం ప్రదర్శిస్తూ. "జనం తగ్గినట్టు లేదా?" మళ్లీ అడిగాడు బాస్టియన్, కొంచెం కటువుగా.

"ఇల్లే సారూ, ఎవరూ పోలేదు." నమ్మకంగా చెప్పాడు పిళ్లై. "అంతా ఉన్నారా?.. లేకపోతే ఎవడైనా..." మళ్లీ ఆరా తీశాడు బాస్టియన్. "ఒక్కడు కూడా పోలేదు. ఎక్కడకి పోతారు దొరా?! అంతా ఉన్నారు" అన్నాడు కిష్టయ్య అందుకుని. అలాంటి అనుమానం అక్కర్లేదన్న భరోసాతో పాటు, పని వదిలిపోయేటంత ధైర్యం ఇంకా మిగిలి ఉందా వీళ్లలో అన్నట్టు ఎంతో ధీమాగా ఉంది అతడి మాట. అయినా రాన్రాను చాలినంత మంది దొరకడం కష్టమవుతోంది. ఇన్ని జరుగుతున్నా బాస్టియన్ హింస ఆపడు. కిష్టయ్య జులుం ఆగదు. "పది ముషమ్‌ల (మూరలు) దూరం... రొంబ నిమ్మిదిగా పని చేస్తుంటిరి" పెదవి విరుపుగా అన్నాడు పిళ్లై. అది బాస్టియన్ మెప్పుకోసం అన్నమాట. ఇలా పిళ్లై చాడీలు ఆపడు. "జాలీ దయా చూపించకండయ్యా! తోళ్లు తీసి పని చేయించండి. ఏం ఊరికే చేస్తున్నారా, నా కొడుకులు! కూలి దొబ్బడం లేదూ!" గట్టిగా అరిచాడు బాస్టియన్.

* * *

రూళ్లకర్రని కొద్దికొద్దిగా దొర్లిస్తూ పెన్సిల్‌తో గీతలు గీస్తున్నాడు పిళ్లై కూలీల మస్తర్‌లో. గప్పిదొర బంగ్లా హాలు గుమ్మం పక్కన నిలబడి ఉన్నారు ఆ ఇద్దరు. తలపాగ చుట్టుకున్న మనిషి బట్టిపనుకుల మునసబు. పేరు గాం గంతన్నదొర. ముప్పయ్ ఏళ్లుంటాయి. బగత కులం. అందుకు తగ్గట్టే కాసెకోక గోచి పోసి పంచె కట్టాడు. అతడి పక్కనే కొంచెం నిర్లక్ష్యంగా నిలబడి ఎటో చూస్తున్న ఆ పొట్టి యువకుడు అతడి తమ్ముడు గాం మల్లుదొర. బలంగా ఉంటాడు మల్లు. ఎవరినీ లెక్క చేయడు.

కోపం ఎక్కువ. ఇరవై ఏళ్లుంటాయి. వాళ్ల అసలు ఊరు నడింపాలెం. బాస్టియన్‌ని కలుసుకోవడానికే వచ్చారు. ఆ రూళ్లకర్ర వైపే చూస్తున్నాడు గంతన్న. అక్కడ ఎవరూ లేనట్టే తన పని చేసుకుంటున్నాడు పిళ్లై. అరగంట గడిచిన తరువాత గుర్రం బంగ్లా ముందుకొచ్చి ఆగింది. గుర్రం దిగి, దాన్ని అక్కడే చిన్న చెట్టు కొమ్మకి కట్టేసి మెట్లెక్కుతూ పైకి చూశాడు బాస్టియన్. అతడు పళ్లనూరడం స్పష్టంగా వినిపించింది. ఆ ఇద్దరు కనిపించగానే కళ్లు ఎర్రబడి పోయాయి. ముఖం కందగడ్డ అయిపోయింది. వడివడిగా మెట్లెక్కి గంతన్న ముందు నిలబడి అడిగాడు, పరుషంగా "ఎందుకొచ్చార్రా?". ఆ మాట విని పిళ్లై లేచి వచ్చి 'వణక్కం!' అన్నాడు. అదేమీ పట్టించుకోకుండా మళ్లీ పెద్ద గొంతుతో అడిగాడు బాస్టియన్, "నిన్నే, ఎందుకొచ్చార్రా?!" కొంత ధైర్యాన్ని కూడగట్టుకుని నెమ్మదిగా చెప్పాడు గంతన్న, "భూముల గురించి ఓ మాట, అదే మా మాట చెప్పాలి కదా దొర!" "ఏం చెబుతావో చెప్పు!" అన్నాడు, పళ్లు నూరుతూ. ఇవాల్టితో నీ అంతు తేల్చేస్తానన్న హెచ్చరిక కూడా అందులో ఉంది. "దొర! తమరు దయ చూపించాలి. బట్టిపనుకులలో నేను తాకట్టు పెట్టిన భూములు మావే దొర! ఆ భూములు సర్కారువని తమరు అనుకోవద్దు. ఎవరో ఏదో చెప్పినా, తమరు దొరలు. నాయం చేయాలి!

నా మీద దయుంచి నా భూములు నాకు ఇప్పించండి! ఎలాగూ పోలీసు దొరవారి ఆజ్ఞ కూడా అయింది!" అన్నాడు గంతన్న. బట్టిపనుకులలో తన కుటుంబం భూములే తాకట్టు పెట్టాడు గంతన్న. ఇవి ప్రభుత్వ భూములంటూ బాస్టియన్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్‌కి ఫిర్యాదు చేశాడు. ఈ మధ్యనే ఆ భూములు ప్రభుత్వ భూములు కావని తేల్చాడు అసిస్టెంట్ కమిషనర్. పైగా తిరిగి గంతన్నకి అప్పగించాలని కూడా ఆదేశించాడు. మళ్లీ తనే అన్నాడు గంతన్న "దొరా! ఆ భూములు మా బంధువు సుమర్ల పెద్దబ్బి కొడుకు వాసాలయ్యకి ఇచ్చారు. నా మునసబీ చాలిం చేశారు. నేను అన్నేయం అయిపోతాను దొరా!" అన్నాడు దీనంగా. అన్నగారి ధోరణికి మల్లు రగిలిపోతున్నాడు. నిజమే, ఆ భూములు తిరిగి గంతన్నకి అప్పగించమని ప్రభుత్వం ఆదేశించింది.

(ఇంకా ఉంది)

నిన్నటి దాకా వేసిన రోడ్డుని రోలర్‌తో చదును చేస్తున్నాడు విలియం. అలికిన నేల ఆరినట్టే ఉంది రోలర్ చదును చేశాక. అక్కడ రోలర్ తిరుగుతూ ఉంటే, కొంచెం ముందు రోడ్డు వెయ్యవలసిన ఎగుడు దిగుడు నేలని కొందరి చేత చదును చేయిస్తున్నాడు బాస్టియన్. చదును చేసిన నేల మీద ఆడవాళ్లు గంపల్లో తెచ్చిన ఎర్రకంకర పోస్తున్నారు. తరువాత ఎర్రకంకర మీద నీళ్లు చల్లుతున్నారు. ఇంకొక చోట దిమ్మెసా జరుగుతోంది. కూలీలు వాళ్ల పని వాళ్లు చేస్తున్నారు. ఆ చెట్టు కింద నిలబడ్డ బాస్టియన్ మాత్రం విలియంని కొరికి చంపేయాలన్నంత కోపంగా చూస్తున్నాడు. దాని పొగ గొట్టంలాగే అతడి గుండె కూడా భుగభుగ లాడిపోతోంది.

మనకు విశేష ప్రేరణ ఇచ్చేదిగా హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని పరిగణిస్తాం. ఒకానొకప్పుడు ఈ పవిత్రదేశంలో పరాయి వ్యక్తులు తమ రాజ్యాలను స్థాపించి, ఈ భూమి సంతానాన్ని దాస్యంలోకి నెట్టివేశారు. ఆనాటి నుంచి నిరంతర పరాజయాల మధ్యనే, అప్పుడప్పుడు మన పౌరుషం తలెత్తి, పరాక్రమాన్ని ప్రదర్శించి విజయాలనూ సాధించాం కూడా. కానీ ఆ విజయాలకు సుస్థిర రూపం కల్పించి ప్రజానీకంలో ఆత్మవిశ్వాసాన్ని నిర్మించలేకపోయాం. జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి మన చరిత్రలో అత్యంత పవిత్రదినం. హిందూరాష్ట్ర పునరుత్థాన సూచకమైన ఒక భవ్య ప్రయత్నం మొన్న మొన్న సాఫల్యాన్ని సాధించింది. ఈ మూడువందల సంవత్సరాలలో ఆ మహోత్సవపు స్మృతి దినదినమూ మరింత శోభాయమానమౌతూ వచ్చిందంటే ఆ ఖ్యాతి ఈ పుణ్యదినానిదేనని నా అభిప్రాయం. కాబట్టి ఆ విశిష్టమైన రోజుకు ఉన్న ఘనతను గురించి సరిగ్గా అవగాహన చేసుకోవడం మనకు ప్రయోజనకరం.

# చరిత్ర పురుషుల నుంచి ఏం నేర్చుకోవాలి?



మన జాతీయ జీవనధార గురించిన పరిచయం, అవగాహన కొన్ని మాటలతో కలిగించడం సాధ్యంకాదు. దానిని సుసాధ్యం చేసుకోవడానికి ఈ సాంస్కృతిక పుణ్యధారలో ప్రభవించిన మహాపురుషుల జీవితాలను అధ్యయనం చేయాలి. ఆ మహాపురుషుల వల్లనే ఈ పావనస్రవంతి అఖండంగా ప్రవహిస్తోంది. వారి సద్గుణాలను మనం అనుసరించి, సమాజ ఉజ్జ్వల ఆకాంక్షలకు మనమే రూపమై నిలవాలి. అందుకే ఈ ఉత్సవాల నిర్వహణను ప్రవేశపెట్టారు.

**అకర్మణ్యత**

స్వభావరీత్యా హిందూ సమాజం భక్తితత్పరమైనది. మహాత్ములలో ఈశ్వరాంశ ఉంటుంది కనుక వాళ్లు లోకాతీతులని మన సాధారణ సమాజం భావిస్తుంది. ఇలా అనుకోవడం వరకు ఈ భావనలో ఏ తప్పూలేదు. కానీ, ఇక్కడితో ఆగకుండా ఆ మహాపురుషులందరినీ మానవలోక పరిధికి అతీతమైన వారుగా భావించి, ఏకంగా దేవుడి సరసన జేర్చి కూర్చుండబెట్టే భ్రమా మయాప్రవృత్తి మన సమాజంలో విస్తృతంగా కనబడుతుంది. ఇలా గొప్పవాళ్లను పరమేశ్వరుని సరసకు నెట్టి ఒకరకంగా మనం చేతులు దులిపేసుకుంటున్నాం.

మన సమాజంలో సామాన్యుడు తనను తాను దీనునిగా, హీనునిగా, దుర్బలునిగా భావించుకొంటూ పరమేశ్వరుడు అవతారమెత్తి వచ్చి తనను కష్టాల నుంచి ఉద్ధరించాలని ఎదురు చూస్తూ ఉంటాడు. అంతేతప్ప ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఆత్మరక్షణ చేసుకొనే బాధ్యతను తన భుజాల మీద వేసుకోడు. మన సమాజంలోని ఇంచుమించు అన్ని జీవనరంగాలలోను ఈ వైఖరి కనిపిస్తుంది. అవసరమైన కష్టానికి ఓర్చి, తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, సుఖదుఃఖాలకు చలించకుండా విపత్తులను ఎదుర్కొందామన్న పురుషార్థయుక్త భావన చాలా తక్కువ. సమస్యలను వాయిదా వేస్తూ నిశ్చింతగా కాలం వెళ్లబుచ్చేద్దామనే మనస్తత్త్వమే ఎక్కువ. సమాజంలో ప్రతి వ్యక్తిలోను పేరుకుపోయి ఉన్న ఈ లోపభూయిష్ట మనస్తత్వానికి లోకమాన్య బాలగంగాధర తిలక్ జీవితం ఆధారంగా విశ్లేషించుకోవచ్చు. ఆధునిక భారత చరిత్రలో తిలక్ ఒక అత్యుత్తమ కర్మయోగి, మహాపురుషుడు, జాతీయ నాయకుడు. కాని ఆయన చనిపోయిన తరువాత అనుయాయులు, ప్రజలు తిలక్ ఆదర్శాలనూ, సుగుణాలనూ అనుసరించి ఆయన రాజకీయ పరంపరను

కొనసాగించడానికి బదులుగా ఆయన విగ్రహాలు స్థాపించడం, చందాలు వసూలు చెయ్యడం, జయంతి ఉత్సవాలు నిర్వహించడానికి పరిమితమయ్యారు. చివరకు తిలక్ మహారాజ్ చతుర్భుజ రూపాన్ని చిత్రాలుగా ముద్రించి, దానికి పూజలు చేయడం, తిలక్‌ను దేవుని అవతారమని చెప్పుకోవడం వరకూ వెళ్లింది.

ఉత్తములను మనుషుల కోవనుంచి బయటకు పంపెయ్యడం ఒక దుర్బల మనస్తత్వం. తన మామూలు వ్యవహారాలకు కూడా సహాయం చెయ్యాలని దేవుడిని పిలిచి, తాను మాత్రం ఏ పనీ చెయ్యకుండా చేతులు కట్టుకుని కూర్చొనే హక్కు మనిషికి ఎక్కడిది? మనం పిలిచిన వెంటనే పరుగెత్తుకుంటూ రావడం తప్ప భగవంతుడికి వేరే పనేమీ లేదా?

సమాజపు ఈ మనోవృత్తిలో మార్పు తెచ్చి మనం పౌరుషాన్ని, ప్రయత్నశీలతను నిర్మాణం చెయ్యవలసి ఉంది. 'ప్రయత్నమే పరమేశ్వరుడు' అన్నాడు సమర్థ రామదాసు. ఇది మన కర్తవ్యభూమి అని భావించి ప్రయత్న పూర్వకంగా కర్తవ్యపుబాటలో ముందుకు సాగాలి. ఇక్కడ మహాత్ములను ఆరాధించాలి, గౌరవించాలి. కాని పరమేశ్వరునిగా కాదు– మహనీయ మానవులుగా మాత్రమే.

**విపత్తుల పరిణామాలు**

ఏ సమాజం మీదనయినా వరుసగా ఆపదలు వచ్చిపడినట్లయితే, సర్వత్రా నిరాశ తప్ప వేరేమీ గోచరించకపోతే – ఆ సమయంలో భిన్నభిన్న మనోవృత్తులు ఆ సమాజంలో తలెత్తుతాయి. కొందరు విపత్తులకు భయపడి ఈశ్వరుడిని శరణువేడతారు. కొందరు చేతులు ముడుచుకొని కూర్చోవడానికి ఇష్టపడరు. వారు తమ ఉజ్జ్వల ప్రవృత్తిలోని మెరుపును ప్రదర్శించి నశించి పోవడానికే ఎక్కువ ఇష్టపడతారు. క్రోధావేశంతో ప్రాణార్పణ చేసేవారిని ప్రజలు 'హుతాత్ములు', 'అమరవీరులు' అని ప్రశంసించి, శ్రద్ధాంజలులు సమర్పిస్తారు.

మన భారతీయ సంప్రదాయాన్ని తప్పిస్తే ప్రపంచంలో మిగిలిన అన్ని సమాజాలు ఇటువంటి అమరవీరులను ఆరాధిస్తాయి; వారిని ఆదర్శంగా స్వీకరిస్తాయి. కాని భారతీయ సంస్కృతిలో ఇటువంటి ఆత్మబలిదానం కొంతమేరకు దౌర్బల్య చిహ్నంగా భావించడం కనిపిస్తుంది. అట్టి దౌర్బల్యం గల మనస్తత్వానికి శాంతచిత్తంతో బుద్ధిని ఉపయోగించి క్లిష్టపరిస్థితిని అధిగమించే శక్తి ఉండదు.

పైన చెప్పిన విధంగా క్షణికావేశంతో ప్రాణాలు బలిపెట్టేవారు వీర పురుషులనడంలో ఏ సందేహము లేదు. కానీ పరిస్థితిని మార్చడంలో వారు విఫలమవుతారు. తాము పరిస్థితులను అదుపులో పెట్టుకోవడానికి బదులు ఆ పరిస్థితుల ప్రభావానికి లొంగిపోయి అవి ఏమి చేయిస్తే అది చేస్తారు. ఆ కారణంగా వారు మనకు ఆదర్శం కాలేరు.

అయితే అట్టి అమరవీరుల వల్ల ఏమీ ఉపయోగం లేదని ఎవరూ అనరు. జాతి ఉన్నత పథంలో వారు అత్యవసరమైన సోపానాలు. వారి సంఖ్య మన సమాజంలో తక్కువ కాదు. రాజపుత్రుల చరిత్ర ఇటువంటి రోమాంచిత ఘట్టాలతోనే నిండి ఉంది. ఇటువంటి వీర పురుషులు పారలౌకిక జీవితానికి పాత్రులౌతారు. విదురనీతిలో ఇట్టి హుతాత్ముల గురించి ఇలా చెప్పారు.

**ద్వావిమౌ పురుషౌలోకే సూర్యమండల భేదినౌ**
**పరివ్రాక్యోగయుక్తశ్చరణే చాభిముఖోహతః**

(సూర్యమండలాన్ని భేదించి వెళ్లి స్వర్గాన్ని అందుకునే వారు ఇద్దరే. యోగమార్గంలో ప్రాణాలు త్యజించిన పరివ్రాజకుడు, యుద్ధంలో వెన్ను చూపకుండా హతుడైన వీరుడు). నిరాశతో చేతులు ముడుచుకొని ఊరికే కూర్చునే వారి కన్నా, భయపడి ఏడ్చే వారికన్నా, స్వార్థపరుల కన్నా, పిరికివారి కన్నా ఈ వీరపురుషులు ఉన్నతస్థాయికి చెందినవారని చెప్పక తప్పదు. కాని ఔన్నత్యానికి ఇది చివరి హద్దు మాత్రం కాదు. జీవితంలో పూర్తి సాఫల్యం పొందడమే మహనీయత.

అన్ని విధాల విషమంగా ఉన్న దశలో పరిస్థితిని మార్చివేసి అసాధారణ శక్తిని, యోగ్యతను ప్రదర్శించిన వారినే మన సంస్కృతి ఆరాధిస్తుంది, పూజిస్తుంది. మన అవతార పురుషులందరి జీవితాలలోను కనబడేది ఇదే. అటువంటి మహానుభావులకు ధర్మసంస్థాపకుల, యుగపురుషుల శ్రేణిలో స్థానం లభిస్తుంది.



క్షాత్రధర్మం విషయంలో కొన్ని అపోహలు తలెత్తడం వల్ల క్షత్రియులైనవారు ప్రాణాలను బలిచేసుకోవడమే జీవన సాఫల్యంగా భావించడం ఆరంభించారు. కాని బుద్ధిశాలియైన మనిషి తన హృదయంలో సర్వదా విజయకాంక్షనే నిలుపు కుంటాడు. శ్రీరామచంద్రుడు తన జీవితంలో ఈ నీతినే అనుసరించి విజయం సాధించాడు. స్త్రీవధ క్షాత్రధర్మ విరుద్ధమన్న ప్రతీతి ఉన్నప్పటికీ శ్రీరాముడు తాటకను హతమార్చాడు. చెట్టు చాటున దాగి వాలిని వధించాడు. ఎందుకంటే ప్రజాపీడకులను వారు స్త్రీలైనా, పురుషులైనా సరే, వధించి ధర్మస్థాపన చేయడమే ధర్మం.

**చరిత్ర దుర్వినియోగం**

ప్రస్తుతం మన చరిత్రకు పురాణ కథలని పేరుపెట్టి వాటిని అభూత కల్పనలుగా జమకడు తున్నారు. చారిత్రక పరిశోధన ఇప్పుడొక మోజయింది. దానిని ఆధారం చేసుకొని శ్రీరాముని శ్రీకృష్ణుని అస్తిత్వాలనే ప్రశ్నార్థకం చేస్తున్నారు. కానీ మన సమీప గతంలోనే ఒక మహాపురుషుడు జన్మించాడు. ఆ ఛత్రపతి శివాజీ మహారాజు చారిత్రక అస్తిత్వం ఏ సందేహానికీ ఆస్కారం లేనిది. ఆయన అసాధారణ యోగ్యత నిస్సందిగ్ధమైనది. అయినప్పటికీ కొందరు మహానుభావులు రకరకాల భ్రమలను ప్రచారం చేసి ఆ మహాపురుషుడిని ఉపేక్ష పాలు చేయడానికి విఫల ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఎందుకంటే దురాక్రమణదారులను ఆలింగనం చేసుకుంటూ, హిందూ – ముస్లిం ఐకమత్యం గురించి పగటికలలు కంటున్నవారికి, విజయ శీలతకు ప్రతీక అయిన శివాజీ మహారాజు ప్రసక్తి చాలా అసౌకర్యం కలిగిస్తుంది. అందుకనే చరిత్ర పాఠ్యపుస్తకాలలో దోపిడీ దొంగ, బందిపోటు, కొండఎలుక మొదలైన పేర్లు పెట్టి ఆయన ఘనతను కించపరచి, ఆయన జీవితకార్యాన్ని దాచిపెట్టే ప్రయత్నం జరుగుతోంది.


ప్రజానీకపు హృదయ సింహాసనం మీద శివాజీ స్థానం సుస్థిరమైనదని గ్రహించలేని దుష్ప్రచారకులు అపోహలను, భ్రమలను కల్పించి ప్రచారం చేయడం మొదలుపెట్టారు. ఇరవయ్యవ శతాబ్దంలో తలెత్తిన అభిప్రాయాలను శివాజీకి అంటగట్టి ఆయన హిందూ–ముస్లిం ఐక్యత గురించి పాటుపడ్డాడని చెప్పడం ఆరంభించారు. ఈ వాదనకు సమర్థింపుగా ఆయన సైన్యంలో మహమ్మదీయులు కూడా ఉన్నారని, ఆయన తన శత్రువులైన మహమ్మదీయులకు గోరీలు కట్టించాడని, ఆయన ఎన్నడూ ముస్లింల మసీదులను కూలగొట్టించలేదని– ఇటువంటి వివరాలు ఏకరువు పెట్టసాగారు. కాని,

వీటిలో హిందూ-ముస్లిం ఏకత ప్రసక్తి ఎక్కడుంది? ఆయన సైన్యంలో ముస్లింలు కొందరుండిన మాట నిజమే. అయితే ఆ ముస్లిం సైనికులతో ముస్లిం ప్రభువుల పైనే యుద్ధం చేయించే శక్తి ఆయనలో ఉంది. దురాక్రమణకారులు, ప్రజాకంటకులు మొగలుల పరిపాలనను నిర్మూలించేందుకే ఆయన సర్వ ప్రయత్నాలు చేశాడన్న విషయం మరిచిపోకూడదు.

ఇంగ్లిష్ వారు హిందువులను, ముస్లింలను తమ సైన్యంలో చేర్చుకుని వారిచేత హిందూ దేశస్థులను చంపించి, ఈ దేశానికి ప్రభువులయ్యారు. ఇంగ్లిష్ వారి సైన్యంలో హిందువులున్నారు కనుక హిందూ-ఆంగ్లేయ ఏకత్వం ఏర్పడిందని చెప్పగలమా? 1857 స్వాతంత్ర్య సంగ్రామం తరువాత పీష్వా నానా సాహెబు నేపాల్ రాజును శరణు కోరగా ఆ రాజు ఇంగ్లిష్ వారికి వ్యతిరేకంగా పీష్వాకు సహాయ పడడానికి తిరస్కరించాడు. దీనిని బట్టి ఇంగ్లండ్-నేపాల్ ఏకత నెలకొన్నదని గాని, ఆ రెండుదేశాలు ఒకే దేశంగా ఏర్పడ్డాయని గాని చెప్పగలమా? శత్రువులకు సమాధులు కట్టించడం కూడా ఏకతా చిహ్నమేనా? ఇది అవిస్మరణీయమైన శివాజీ పేరును ఉపయోగించుకొని లాభపడదామన్న దురాలోచన.

ఇదేవిధంగా కమ్యూనిస్టులు ఆయనను తమ పార్టీలో చేర్చేసుకుని 'శివాజీ సామ్యవాది, విప్లవకారుడు' అని భాష్యాలు చెబుతున్నారు. శివాజీ వర్గపోరాటానికి అనుకూలుడని, అందువల్లనే జమీందారుల పట్టునుంచి రైతులను విడిపించాడని వాళ్ల వ్యాఖ్యానం. శివాజీ రైతులను (మావళేలను) సంఘటిత పరచిన మాట నిజమే. అయితే 19వ శతాబ్దంలోని కారల్‌మార్క్సు వ్రాసిన పుస్తకాలను చదివి 17వ శతాబ్దంలోని శివాజీ వర్గపోరాటానికి పూనుకొన్నాడనడం హాస్యాస్పదం. వాస్తవమేమిటంటే శివాజీ మహారాజు ఒక గొప్ప చారిత్రక సత్యం కనుక ఏ రాజకీయ పక్షమూ ఆయనను ఉపేక్షించలేక పోతోంది. ఆ మహాపురుషుని ఉజ్వల తేజస్సును మసకపరచడానికే ఇటువంటి అభూత కల్పనలు ప్రచారమవుతున్నాయి. అయితే ఇలాంటి కుటిల చేష్టలు చేసేవారు తమ కళ్లు తాము పొడుచుకున్నట్లే.

శివాజీని దారితప్పినవాడని ఒకప్పుడు వాఖ్యానించిన పెద్దమనిషి కూడా తరువాత గద్గద కంఠంతో 'శివాజీ మహారాజును స్మరించుకోకుండా జాతీయౌన్నత్య సాధన సంభవం కాదు' అనవలసి వచ్చింది. శివాజీ గతించి 300 సంవత్సరాలు గడచినా, ఇప్పటికీ ఆయన పేరు చెబితే గగుర్పాటు కలుగుతుంది. అంతటి తేజశ్శాలి, విజయశీలి ఇక్కడ జన్మించడం మన సమాజపు అదృష్టం. నిరాశా మయమైన, అంధకారమయమైన తన వర్తమాన స్థితిలో శివాజీ విజయ వైభవాన్విత జీవితం గొప్ప స్ఫూర్తిమంతం కాగలదు. అందువల్ల ఆ మహా



శ్రీ గురూజీ

పురుషుని జీవననీతి సూత్రాలను స్మరించుకోవడం, మననం చేసుకోవడం మళ్లీ మళ్లీ అవసరమౌ తూంటుంది.

కొందరు 'ఆయన మన వంటి మామూలు మనిషి కాదు. సంపన్న కుటుంబంలో జన్మించాడు. పుట్టుకతోనే అన్నీ అందుబాటులో ఉన్నాయి. మనకు అవెక్కడున్నాయి?' అనేస్తారు. ఇది సరికాదు. ఆయన జన్మించినపుడు దేశం భయంకర పరిస్థితులలో ఉంది. ఏ విధమైన అనుకూలతా లేదు. ఎవ్వరూ తోడు నిలిచేవారు లేరు. ఉత్సాహం చచ్చినవారు, అభ్యంతరాలు చూపించేవారు-వీరే ఎక్కువ. చివరికి బంధువులు, స్వజనులు కూడా ఆయనకు తోడు కాలేదు.

సామాన్య హిందువు జీవితానికి ఏ రక్షణా లేదు. ఇక మానమర్యాదల సంగతి చాలా దూరపువిషయం. సమర్థ రామదాసు వంటి సాధు పురుషుని నోటకూడా నిరాశే వెలువడుతూ ఉండేది. అటువంటి తమో మయావస్థలో ఆశాకిరణం గాని, తప్పించుకొనే మార్గంగాని అగుపడని పరిస్థితులలో గొప్ప గొప్పవారు కూడా శత్రువు లకు లొంగిపోయి శరణా గతులవడం జరిగింది. అటువంటి సమయంలో శివాజీ తన పరాక్రమాన్ని, బుద్ధి కుశలతను ప్రదర్శించి విజయాన్ని సాధించాడు.

## వర్తమాన పరిస్థితి

నేడు సమాజాన్ని, జాతీయ జీవనాన్ని విధ్వంసం చేయగోరే శక్తులు దేశంలో మరింత బలపడు తున్నాయి. తమ సహకారం లేనిదే ఎవరూ ఢిల్లీలో గద్దెనెక్కలేరని నిస్సంకోచంగా, పొగరు మోతుతనంతో ప్రకటించుకొనే స్థాయికి వారి దుస్సాహసం చేరుకొంది. రకరకాల పరాయి సంప్రదాయాలు, సిద్ధాంతాలు దేశంలో క్రియాశీలంగా ఉన్నాయి. ఇప్పటికీ ఖండితమై ఉన్న ఈ దేశాన్ని మరిన్ని ముక్కలుగా చేసి తమతమ సొంత రాజ్యాలను ఏర్పరచుకోవడానికి అవి ప్రయత్నిస్తున్నాయి. ఆ దుష్ప్రయత్నాల కారణంగా మన దేశ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతోంది.

ఇవికాక పరస్పర వివాదాలు, విచ్ఛిన్నకర ప్రవృత్తులు, నిర్లక్ష్య వైఖరి, విధర్మీయుల బకాసుర చేష్టలు ఇవన్నీ కలిసి హిందూ సమాజాన్ని, ధర్మ సంస్కృతులను తుడిచి పెట్టే మార్గంలో ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్నాయి. ఎటు చూసినా నిరాశామయ వాతావరణమే కనిపిస్తోంది. ఈ దుస్థితిని దాటి బయటపడాలంటే మనం శివాజీ పుణ్యస్మరణ చేసుకొని, అద్భుత ప్రతిభ, నీతి, కుశలత విలసిల్లే ఆయన జీవిత ఘట్టాల నుండి ప్రేరణ పొందాలి. అప్పుడే దేశాన్ని తీర్చిదిద్దే సామర్థ్యాన్ని ఆర్జించుకుంటాం.

**'శ్రీ గురూజీ సమగ్ర గ్రంథావళి - దిశానిర్దేశనము' నుంచి**



జూన్ 11 కూర్మ జయంతి


ప్రతి ఘట్టం వెనుక పరమార్థం, సందేశం ఉంటాయనేందుకు క్షీర సాగర మథనాన్ని ఉదాహరణగా చెబుతారు. అమృతం కోసం క్షీర సాగర మథనం అంతసులువు కాదని, దానవుల చేతిలో పరాజితులైన తమకు అంతపెద్ద కార్యసాధన సాధ్యమా? అని దేవతలు అశక్తత వ్యక్తం చేశారు. అయితే ప్రయత్నమంటూ మొదలుపెడితే అవసరమైనప్పుడు పైవాడు సహకరిస్తాడు. తదేక ధ్యానం, పట్టుద లతో ఆరంభిస్తే సత్ఫలితాలు ఉండవచ్చు. ఒకవేళ మధ్యలో ఒడిదొడు కులు ఎదురైతే పరమాత్ముని సహకారం ఉండక పోదన్నది ఈ అవ తార సారాంశం. సూక్ష్మంగా పరిశీలిస్తే, పాలసంద్ర మథన ఘట్టంలో ఆధ్యాత్మిక, వేదాంత అంశాలు అవగతమవుతాయి. మనస్సును క్షీరసాగరం అనుకుంటే మందరగిరి ధ్యానం. ధ్యానంతో మనసును మథించాలి. అప్పుడే అమృతమనే ఏకాగ్రత, మోక్షం సిద్ధిస్తాయి. నిలకడలేని ధ్యానంతో ప్రయోజనం ఉండదనేందుకు ఆ పర్వతం నీటిలోకి ఒరిగిపోబోవడాన్ని ఉదాహరణగా ఆధ్యాత్మికవేత్తలు చెబుతారు.



# నమో కూర్మరూపా.. జయ జగదీశ హరే..!

శ్రీమహావిష్ణువు ప్రసిద్ధ అవతారాలలోని అ'ద్వితీయం' కూర్మావతారం. దేవదానవులు క్షీరసాగరంలో అమృత మథనానికి యత్నించినప్పుడు కవ్వంగా నిర్దేశించిన మందర పర్వతం సాగరజలాల పాలుకాకుండా దానిని కాపాడేందుకు హరి కూర్మ రూపుడిగా అవతరించాడు. మందరగిరిని వీపున మోస్తూ సముద్ర మథనానికి చేయూతనిచ్చాడు. కృతయుగంలో 28వ మహాయుగంలో ఏడవ మనువైన వైవస్వతుని కాలంలో కూర్మావతార ఘట్టం చోటుచేసుకుందని ఐతిహ్యం.

పాండవ వంశజుడు పరీక్షిత్ మహారాజు వినతిపై శ్రీశుకమహర్షి భాగవత విశేషాలను వివరించగా, పోతనామాత్యుడు కూర్మావతార ఘట్టాన్ని శ్రీమద్భాగవతం అష్టమ స్కంధంలో కమనీయంగా, రమణీయంగా ఆవిష్కరించారు.



డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి
సీనియర్ జర్నలిస్ట్

రాక్షసుల చేతిలో పరాజితులైన దేవతలు విజయ సిద్ధి, మృత్యుభయ నివారణకు ఉపాయం కోసం విధాతను శరణువేడి ఆయన నేతృత్వంలో శ్రీహరిని ఆశ్రయించారు. అమృతం కోసం క్షీరసాగరాన్ని మథించాలని హితవు చెప్పాడు దేవదేవుడు. 'అయితే అది అత్యంత క్లిష్ట ప్రక్రియ. అందుకు కవ్వం, తాడులాంటి సాధనాలు కావాలి. కడలిని చిలికేందుకు తాడుకు ఇరువైపుల బలగం కావాలి. అది కేవలం తమ వల్ల సాధ్యం కాదు' అనే ఆలోచనలో పడ్డారు సురలు. వారి మనోగతాన్ని ఎరిగిన మహావిష్ణువు, అసురలతో సఖ్యత కుదుర్చుకుని కార్యం ప్రారంభించాలని ఉపాయం చెప్పాడు జగన్మోహనుడు. ఆ దిశలో చేసిన ప్రయత్నాలు ఫలించగా, సముద్రాన్ని చిలికేందుకు శ్రీహరి ఆజ్ఞపై గరుడుడు కవ్వంగా మందర పర్వతాన్ని సాగరతీరానికి చేర్చాడు. వాసుకు కవ్వపు తాడుగా నియుక్తులయ్యాడు. దానవులు వాసుకి శిరోభాగం వైపు, దేవతలు తోకభాగంవైపు పట్టుకుని సాగర మథనం ప్రారంభించారు. అంతలో అదుపు తప్పిన మందరం బుడబుడమని నీట మునిగి పోతుండడంతో దేవదానవుల ప్రార్థనతో విష్ణువు కూర్మరూపుడై గిరిని వీపున ధరించాడు.

'కమఠంబై జలరాశి జొచ్చి లఘుముక్తాశుక్తి/ చందంబునన్ నమదద్రీంద్రము నెత్తె వాసుకి/ మహానాగంబుతో లీలతో...కమలాక్షా! /శరణంబు భూదిశలు నాకాశంబునన్ మ్రోయగనన్ (తాబేలుగా మారిన శ్రీహరి తేలికైన ముత్తెపు చిప్పలాగ ప్రవేశించాడు. అడుగున ఉన్న పర్వతాన్ని అవలీలగా పైకెత్తాడు.)

'సవరనై లక్ష యోజనముల వెడలుపై కడు గఠోరమైన.... సుందరంబుగ విష్ణుండు సురల తోడి, కూర్మి చెలువొంద నొక కూర్మమయ్యె' (ఆ కూర్మం లక్ష యోజనాల వెడల్పు, మిక్కిలి కఠినమైన డిప్ప కలిగింది. సమయం వస్తే బ్రహ్మాండాన్నీ మింగ గలిగే పెద్ద గుహలాంటి నోరు... సకల జీవరాశులను తనలో దాచుకోగలిగిన పెద్ద పొట్ట. ఒక ప్రపంచం వేరే ప్రపం చంపై పడితే చలించనంతటి బలమైన కాళ్లున్నాయి. లోనికి, బయటికి వచ్చే పెద్ద మూతి, తామరల్లాంటి కన్నులున్నాయి. ఇలా శ్రీకూర్మావతార వర్ణన మనో హరంగా చేశారు పోతనామాత్యుడు.

కచ్ఛప రూపుడైన కమలనాథుడు మందరం అటుఇటు ఊగకుండా గిరి శిఖరాన్ని వేయి చేతులతో పట్టుకున్నాడు. తాడుగా మారిన వాసుకి శరీరం చిలుకుతున్నప్పటి రాపిడికి తెగిపోకుండా శక్తిని, దేవదానవులలో ఆవేశించి బలాన్ని ప్రసాదించడంతో సురాసురులు పాలకడలిని తరచడం పునః ప్రారంభించారు. అలా కడలి అనే మజ్జిగ కడవకు కుదురు, కవ్వమూ, రాట కట్టే తాడూ తానే అయ్యాడు. 'జలధి గడవ సేయు శైలంబు గవ్వంబు..సిరియు, సుధయు

బడయు శ్రీవల్లభుడు దక్క నొరుడు శక్తి మంతుడొకడు గలడె? (సముద్రాన్ని కడవగా, పర్వతాన్ని కవ్వంగా చేసి చిలకడానికి, లక్ష్మిని, అమృతాన్ని సంపాదించ డానికి శ్రీహరియే శక్తిమంతుడు)అన్నారు పోతన.

యావత్ భారత దేశంలోనే ఏకైక కూర్మనాథా లయం ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి నదుల మధ్య వెలసి ఉంది. అదే శ్రీకూర్మ క్షేత్రం. ఆదికూర్మక్షేత్రం నెలవై ఉన్న శాలిహుండం కొండను 'కూర్మాద్రి' అనీ వ్యవహరిస్తారు. పద్మ, బ్రహ్మ పురాణాలలో ఈ క్షేత్రం విపులంగా వర్ణితమైంది.



**ఆది శ్రీకూర్మం క్షేత్రం**

యావత్ భారతదేశంలోనే ఏకైక కూర్మనాథా లయం ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లాలో వంశధార, నాగావళి నదుల మధ్య వెలసి ఉంది. అదే శ్రీకూర్మ క్షేత్రం. ఆదికూర్మక్షేత్రం నెలవై ఉన్న శాలిహుండం కొండను 'కూర్మాద్రి' అనీ వ్యవహరిస్తారు. పద్మ, బ్రహ్మ పురాణాలలో ఈ క్షేత్రం విపులంగా వర్ణితమైంది. బ్రహ్మదేవుడు స్వామిని ప్రతిష్ఠించాడని, శ్వేతచక్రవర్తి తపోఫలితంగా కూర్మనాథుడు వెలిశాడని పురాణాలు చెబుతున్నాయి. బ్రహ్మ పరమేశ్వరుడిని (పాతాళ సిద్ధేశ్వరుడు) క్షేత్రపాలకుడిగా నియమించారు. విజయనగరం పూసపాటి వంశీయుల సంస్థానంలోని శతాధిక ఆలయాలలో అగ్రగామిగా నిలిచిన వాటిలో ఇది ఒకటి.

ఈ క్షేత్రం వైష్ణవ, శైవ సంప్రదాయాల సమైక్యతకు ఆలవాలమై, అరుదైన విశేషాలతో విరాజిల్లుతోంది. ఇది వైష్ణవ ఆలయమైనా దాని చుట్టూ ఐదు శివాలయాలు (సుందరేశ్వర, కర్పూరేశ్వర, కోటేశ్వర, హాటకేశ్వర, పాతాళసిద్ధేశ్వర) ఉన్నందున ఈ ప్రదేశాన్ని పంచలింగాత్మక క్షేత్రమనీ వ్యవహరిస్తారు. ఈ ఆలయంలోని శంఖనిధి, పద్మనిధులకు బలరామ కృష్ణులు పాలకులుగా ఉంటారు. ఆలయ గోపురానికి శ్రీకూర్మ విమానమని పేరు. శ్వేతాచలంగా వ్యవహరించే ఈ ప్రాంతాన్ని ఏలిన శ్వేత చక్రవర్తి చేసిన తపస్సుకు మెచ్చి జ్యేష్ఠ శుక్ల ద్వాదశి నాడు శ్రీ మహావిష్ణువు శ్రీ కూర్మ రూపంలో సాక్షాత్కరించి, ఈ రూపంలోనే తనను అర్చించాలని చెప్పినట్లు స్థల పురాణం. అంతేకాదు చక్రధారి హరి మహారాజుతో ఒక వటవృక్షం వద్దకు వచ్చి చక్రాయుధ ప్రయోగంతో చక్కని తీర్థం (సరస్సు) నిర్మించాడట. అప్పటి నుంచి అది చక్రతీర్థం, కూర్మగుండం, శ్వేతగుండం అనే పేర్లతో ప్రసిద్ధికెక్కింది. మహాలక్ష్మి ఇందులోనే అవతరించి 'శ్రీకూర్మ నాయిక'గా పూజలందుకుంటున్నారు. ఈ పుష్కరిణిని 'మోక్షస్థానం'గా వ్యవహరిస్తారు. కాశీ, పూరీ క్షేత్రాలలో మాదిరిగా ఇక్కడ పిండప్రదానాలు చేస్తారు. నదీ తీరాలలో మాదిరిగా పుష్కరిణిలో అస్థి నిమజ్జనం చేస్తారు. అవి సాలగ్రామాలవుతాయని ప్రతీతి. ఈ పుష్కరిణిలో మాఘ శుక్ల చవితి నాడు గంగా గమన యాత్ర జరుగుతుంది. అందరి పాపాలను కడిగేసే గంగాదేవి వాటి పరిహారార్థం స్వామి సూచన మేరకు కూర్మ గుండంలో ఆనాడు పుణ్యస్నానమాచరిస్తుందని పురాణ ప్రసిద్ధం. కూర్మనాథుడు శనీశ్వరునికి అధిదేవత కనుక ఈ ఆలయం దర్శనంతో శని దోష నివారణ అవుతుందని చెబుతారు.


**జంట ధ్వజస్తంభాలు**

*'భాష్యకార ప్రసన్నాయ పరమానంద రూపిణే!*
*శ్వేతచల నివాసాయ కూర్మనాథాయ మంగళమ్!!'*

ఏ వైష్ణవ క్షేత్రంలో లేని విధంగా జంట ధ్వజ స్తంభాలు ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. విశిష్టాద్వైత మత ప్రవక్తమ్ రామానుజాచార్యులు ఆరాధనతో స్వామి వారు దిశమార్చి చూడడం వల్ల ఈ జంట ధ్వజస్తంభాలు ఏర్పడినట్లు తెలుస్తోంది. ఆలయ తూర్పు దిక్కున ధ్వజ స్తంభం ఉండడం సర్వ సాధారణం. ఈ క్షేత్రంలో స్వామి పడమర వైపు చూస్తున్నాడు కనుక అటువైపున రెండవ ధ్వజస్తంభం ఏర్పాటైంది. భగవద్రామానుజులు పూరీ జగన్నాథ స్వామి దర్శనానంతరం ఈ ఆలయాన్ని పునః ప్రతిష్ఠించారని 1281 నాటి శాసనం బట్టి తెలుస్తోంది. దివ్యక్షేత్ర సంస్కరణల జైత్రయాత్రలో భాగంగా ఆయన పూరీ క్షేత్రంలో ఆరాధన విధానాన్ని సవరించేందుకు యత్నించగా, పాత విధానమే కొనసాగాలని అక్కడి అర్చకవర్గాలు స్వామిని వేడుకున్నాయట. దాంతో రామానుజులకు స్వప్న సాక్షాత్కారం చేసిన జగన్నాథుడు, నూతన ఆరాధన విధానాన్ని శ్రీకూర్మంలో ప్రవేశపెట్టవలసిందిగా అనుజ్ఞ ఇచ్చారట. వైష్ణవం ప్రకారం అర్చనాదులు సాగే క్షేత్రంలో వీరశైవం ప్రబలిన కాలంలో శైవారాధన జరుగుతుండగా, అక్కడి మూలవిరాట్‌ను కూర్మ రూపంగా ప్రకటించాలని స్వామి ఆదేశించారట. అందుకు అనుగుణంగా రామానుజులు స్థానిక ఏలికలు, ఆధ్యాత్మికవాదులతో వాదించి ఒప్పించారని 'ప్రసన్నామృతం' అనే గ్రంథంలో ఉందని ఆలయ స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు పేర్కొన్నారు. రామానుజులు మూలవిరాట్‌కు వెనుకవైపు కూర్చుని ప్రార్థించగా, స్వామి పశ్చిమ దిక్కుకు తిరిగాడట. ఆ కారణంతోనే ఈ క్షేత్రంలో తూర్పు, పడమరలుగా రెండు ధ్వజ స్తంభాలు దర్శనమిస్తాయి. ఈ విశేషాలను అక్కడి శిలాఫలకాలు తేటతెల్లం చేస్తాయి. త్రేత, ద్వాపర యుగాలకు చెందిన లవకుశులు, బలరాముడు, ఈ యుగంలో శంకరభగవత్పాదులు సహా ఎందరో మహనీయులు ఈ క్షేత్రాన్ని సందర్శించారని పురాణేతిహాసాలు పేర్కొంటున్నాయి.

ఆదిశంకరులు తమ ఆరాధనలో నుంచి ప్రసాదించిన సుదర్శన సాలగ్రామమూర్తిని మూల వరుల వాల భాగంలో నేటికీ దర్శించుకోవచ్చని శ్రీభాష్యం వారు తెలిపారు. ఆలయ సందర్శనంలో తాబేళ్ల ప్రదర్శన శాల ప్రత్యేక ఆకర్షణ.

*'బ్రహ్మాండకోటి పరిపూర్ణ మహోదరాయ*
*క్షీరాబ్ధి నిర్మథన మందర ధారకాయ*
*విశ్వాత్మనే సకల లోకసముద్ధరాయ*
*కూర్మావతార సతతం భజేతే నమోస్తు'* ★



జూన్ 8 ఆలిండియా రేడియో ఆవిర్భావ దినోత్సవం

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

# 'ఆజాద్ హింద్'తో నేతాజీ మన్ కీ బాత్

సమాచార విప్లవం తొలితరం ప్రక్రియలలో ముందున్న రేడియో కేవలం వినోద, విజ్ఞాన, సమాచార సాధనంగానే కాకుండా జాతి చైతన్యానికి, ప్రజాసంక్షేమ కార్యక్రమాల వ్యాప్తికి ఆలంబనగా ఉంటోంది. ప్రజలలో స్వరాజ్య కాంక్షను రగుల్కొల్పిన నాటి నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్, తమ ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న సంక్షేమ పథకాలు, వివిధ అంశాలను విశ్లేషిస్తూ నేటి ప్రధాని నరేంద్రమోదీ దీనిని వేదికగా చేసుకున్నారు. ఇద్దరి శీర్షిక ఒక్కటే... అదే 'మన్ కీ బాత్' (మనసులోని మాట).



దేశీయులలో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చేందుకు దశాబ్దాల క్రితమే నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ మన్ కీ బాత్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్వరాజ్య సాధనలో భాగంగా, తమ రేడియో ప్రసంగాల ద్వారా 'వేయిసార్లు అపజయాన్ని చవిచూసినప్పుడు మరోసారి ప్రయత్నించాలన్న ఆశయాన్ని పదేపదే గుర్తుంచుకోండి' లాంటి సందేశాలను ఇచ్చారు. 'దేశం కోసం చావడానికి సాహసం చేయకపోతే దేశంలో బ్రతికే హక్కు ఎక్కడిది?' అని ప్రశ్నించారు.

రేడియో తరంగాలను వైర్లెస్ కమ్యూనికేషన్ సిస్టంగా మార్చడానికి కావలసిన మొదటి ఉపకరణాన్ని గుగ్లెల్మో మార్కొని తయారు చేశారు. రెజినాల్డ్, ఎపిస్పెండన్ వైర్లెస్ టెలిఫోన్ పంపిన మొదటి వ్యక్తి కాగా, క్రిస్మస్ ఈవ్ 1906లో పబ్లిక్ వైర్లెస్ ప్రసారాన్ని చేసిన మొదటి వ్యక్తి అయ్యాడు. ఇలా 1910 నాటికి వివిధ వైర్లెస్ సిస్టంలు రేడియోగా వ్యవహారంలోకి వచ్చాయి. భారత జాతీయ ఉద్యమంతో పాటు, అంతర్జాతీయ యుద్ధాల విశేషాలు తెలుసుకునేందుకు రేడియో ప్రధాన సాధనంగా నిలిచింది. చరిత్రకారిణి దియా గుప్తా వ్యాఖ్యానించినట్లు ('రాజ్ ఇన్ రేడియో వార్స్') రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో రేడియో ప్రసారం అంతర్జాతీయ ప్రచారానికి ఒక సాధనంగా మారింది.

భారతీయులను స్వరాజ్య దిశగా ప్రోత్సహించడానికి నాజీ జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ నేతృత్వంలో 1942 జనవరి 7న రేడియో సేవలను నేతాజీ ప్రారంభించారు. దాని ప్రధాన కార్యాలయాన్ని జపాన్ ఆక్రమిత సింగపూర్‌కు, ఆగ్నేయ ఆసియాలో యుద్ధం తరువాత ఒక రహస్య ప్రదేశానికి మార్చారు. నేతాజీ ఆగ్నేయ ఆసియాకు బయలుదేరిన తరువాత జర్మనీ కార్యకలాపాలు ఏసీఎన్ ద్వారా కొనసాగాయి. జర్మనీలోని ఇండియన్ లెజియన్, ఆగ్నేయ ఆసియాలోని ఇండియన్ నేషనల్ ఆర్మీ కోసం పంజాబీ, పెర్షియన్, ఇంగ్లీష్, హిందీ, తమిళ, బెంగాలీ, మరాఠా భాషలలో వార్తలు ప్రసారం అయ్యేవి.

బెర్లిన్ నుండి చేసిన ప్రసారాలలో బ్రిటిష్ భూభాగాలపై జపాన్ విజయాలను, మన దేశంలో



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ (మనసులోని మాట) ఆకాశవాణిలో ప్రతి నెల చివరి ఆదివారం హిందీలోనూ, వివిధ ప్రాంతీయ భాషల్లో ప్రసారమవుతున్న ప్రత్యేక కార్యక్రమం. ఆయన ప్రధాన మంత్రిగా మొదటిసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం కింద తొలిభాగం (ఎపిసోడ్) 2014 అక్టోబర్ 3వ తేదీన ప్రసారమైంది. వారం వారం నిరాటంకంగా సాగుతూ వస్తున్న ఈ కార్యక్రమం కింద ఆయన అనేక అంశాలను ప్రస్తావిస్తూ, వాటిపై ప్రజలలో మరింత అవగాహన పెంచడంతో పాటు జనచైతన్యానికి చేయూతనిస్తున్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా టాంజానియా తోబుట్టువులు 'కిలీపాల్, నిమా' భారత జాతీయ గీతాన్ని ఆలపించినందుకు మోదీ వారిని అభినందించడం అందులో ఒక భాగం.

క్విట్ ఇండియా ఉద్యమం గురించి బోస్ ఉద్వేగ భరితంగా ప్రసంగించారు. ఆయన నేతృత్వంలోని ఇండియన్ నేషనల్ ఆర్మీ బ్రిటిష్ వారి చేతిలో ఓడిపోయాక (1944)కూడా ఏడాది పాటు జర్మనీ, ఆగ్నేయాసియా ప్రసారాలను కొనసాగించారు.

ఆజాద్ హింద్ రేడియో, మిత్ర రాజ్యాల రేడియో స్టేషన్ల ప్రసారాలను ఎదుర్కోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఆజాద్ హింద్ రేడియోను బోస్ బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్‌గా, బ్లఫ్ అండ్ బ్లస్టర్ కార్పొరేషన్‌గా, అల్ ఇండియా రేడియోను యాంటీ ఇండియన్ రేడియోగా పేర్కొన్నారు.

నేతాజీ 1942 ఫిబ్రవరి 28వ తేదీన ఆజాద్ హింద్ రేడియోలో ప్రసంగిస్తూ 'భారతదేశం స్వాతంత్ర్యం పొందే వరకూ బ్రిటిష్ సామ్రాజ్య వాదంతో పోరాడుతూనే ఉంటాం. ప్రపంచ చరిత్రలోని ఒక కూడలిలో నిలబడి భారతదేశం లోనూ, విదేశాలలోని స్వాతంత్ర్య ప్రియుల తరపున ఇలా గంభీరంగా ప్రకటిస్తున్నాను' అని చెప్పారు.

తెల్లదొరల కబంధ హస్తాల నుండి భారత మాతకు విముక్తి కలిగించేందుకు ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన మహానేత నేతాజీ 'పిరికి మాటలు మాట్లాడకండి. అవి మీ జీవిత గమనానికి ఆటంకాలవుతాయి. ఎదుటి వారికి పిరికితనం నూరిపోస్తే మీరు పిరికివారవుతారు' అని ఉద్బోధించారు. 'మీరు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్రాన్ని ఇస్తాను. స్వేచ్ఛను ఎవరు ఇవ్వరని, మనకు మనమే తీసుకోవాలని కర్తవ్య బోధ చేశారు.

'స్వేచ్ఛలోని ఆనందాన్ని, స్వాతంత్ర్యపు ప్రశాంతతను అభిలషిస్తున్నావా? అయితే నీవు వాటి ఖరీదు (బాధ, త్యాగం) చెల్లించవలసిందే. స్వేచ్ఛ కోసం నీవు చెల్లించవలసిన మూల్యం ఇవే' అన్నారు.

'సిద్ధాంతం కోసం ఒక మనిషి తన ప్రాణాన్ని కోల్పోవచ్చు. అయితే ఆ సిద్ధాంతం అతడి మరణం తరువాత వేలాది మందిలో స్ఫూర్తిని నింపుతుంది. కోట్లాదిమంది ప్రజానీకానికి మేలు చేస్తుంది' అనేవారు వారు నేతాజీ.

అహింసావాదంతోనే స్వరాజ్యం సిద్ధిస్తుందన్న నమ్మకంతో గాంధీజీ మొదలయిన నాయకులు పోరాటం సాగించగా, సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుండి తరిమి కొట్టవచ్చని ప్రగాఢంగా విశ్వసించిన బోస్ తమ వ్యూహాన్ని ఆచరణలో పెట్టారు. రెండుసార్లు భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నికైన ఆయన, గాంధీజీతో సిద్ధాంత పరమైన విభేదాల కారణంగా ఆ పదవికి రాజీనామా చేశారు. 1939లో మొదలైన రెండవ ప్రపంచ యుద్ధాన్ని ఆంగ్లేయులను దెబ్బ తీయడానికి సువర్ణావకాశంగా భావించారు. వారిని ఎదిరించేందుకు కూటమిని ఏర్పాటు చేసేందుకు రష్యా, జర్మనీ, జపాన్ దేశాలు పర్యటించారు. జపాన్ సహాయంతో భారతీయ యుద్ధ ఖైదీలు, రబ్బరు తోట కూలీలు, ఔత్సాహికులతో భారత జాతీయ సైన్యాన్ని ఏర్పాటు చేశారు

జపాన్ ప్రభుత్వం అందించిన సైనిక ఆర్థిక, దౌత్య సహకారంతో సింగపూర్‌లో ఆజాద్ హింద్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. బోస్ రాజకీయ అభిప్రాయాలను, జర్మనీ, జపాన్‌తో ఆయన అనుసరించిన మిత్రత్వంపై చరిత్రకారుల్లో భిన్నాభి ప్రాయాలున్నాయి. కొందరు వీటిని విమర్శిస్తే మరికొందరు వాస్తవిక దృష్టితో చేసిన ప్రయత్నాలుగా బోస్‌ను అభిమానిస్తారు.

కటక్‌లో 1897 జనవరి 23న జన్మించిన నేతాజీ మరణం వివాదాస్పదమైంది. 1945 ఆగస్టు 18లో తైవాన్‌లో జరిగిన విమాన ప్రమాదంలో ఆయన మరణించారని బ్రిటిష్‌వారు ప్రకటించి నప్పటికీ ప్రమాదం నుంచి బయటపడి అజ్ఞాతంలోకి వెళ్లారని అనేకులు నేటికీ నమ్ముతారు. ఆ తారీఖున తైవాన్‌లో విమాన ప్రమాదం జరగలేదని తైవాన్ ప్రభుత్వం ప్రకటించింది.


కటక్‌లోని ఆయన పూర్వీకుల ఇంటిని 'నేతాజీ సుభాష్ చంద్ర బోస్ మ్యూజియం'గా మార్చారు. అందులో బోస్ రేడియో పునర్నిర్మితమైంది. దాని కార్యక్రమాలు, ఆయన చేసిన ప్రసంగాలు ప్రసార మవుతున్నాయి. ఈ ప్రదర్శన శాల పునః సృష్టి మంచి ప్రయత్నమని రంగూన్ మ్యూజియం క్యూరేటర్‌గా చేసిన జేపీ దాస్ అభివర్ణించారు.

నేతాజీ చివరి రోజులను కుట్ర సిద్ధాంతాలు కప్పివేసినా ఆయనకు ఒకే ఒక కల ఉండేది, అదే "ఆజాదీ".


★

**ఆధారం:**


1. "రాజ్ ఇన్ రేడియో వార్స్" పేపర్ ప్రజంటేషన్ బై దియా గుప్తా


**కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు

నేటి బాలలే రేపటి పౌరులు.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఈ నినాదం వినపడుతూనే ఉంది. దీనిని సాకారం చేయడానికి ప్రభుత్వాలు, పాలకులు, స్వచ్ఛంద సంస్థలు, కొన్ని ప్రైవేట్ సంస్థలు, సమాజంపై అనురక్తి గల కొంతమంది పౌరులు పాటుపడుతూనే ఉన్నారు. అయితే ఈ ప్రయత్నాలు నేటికీ పరిపూర్ణం కాలేదు. ఫలితంగా బాధ్యతాయుతమైన రేపటి పౌరులు కావాల్సిన బాలలు బాలకార్మికులుగా మిగిలిపోతున్నారు. అక్షరాస్యతకు దూరమవుతున్నారు. తల్లితండ్రుల ఆలనపాలనకు నోచుకోలేకపోతున్నారు. పోషకాహారానికి దూరమవుతున్నారు. పలకా బలపం పట్టాల్సిన చేతులు పలుగులు, పారలు పడుతున్నాయి. అందమైన బాల్యం వారికి అందనంత దూరంలో ఉంటోంది. కొన్ని సందర్భాల్లో అవాంఛనీయశక్తులుగా వక్రమార్గం పడుతున్నారు. కొంతమంది సంఘ విద్రోహశక్తులుగా మారుతున్నారు. దీనివల్ల వారి జీవితాలు దారితప్పుతున్నాయి. కొంతమంది జీవితాలు మధ్యలోనే ముగిసిపోతున్నాయి. నేటి బాలలే రేపటి పౌరులన్న నినాదం సాకారమైతే వారు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి సమాజ ప్రగతికి దోహదపడతారు. తద్వారా సమాజానికి తమ వంతు మేలు చేసినవారవుతారు. అందువల్ల నేటి బాలలను రేపటితరం బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ తమవంతు పాటుపడాలి. ఇది ప్రభుత్వాలు, పాలకులకు సంబంధించిన విషయం అని, తమకు సంబంధం లేదని ఎవరైనా భావిస్తే పొరపాటవుతుంది.



# పలుగూ పార కాదు, పలకా బలపం చేతికివ్వాలి

ఈ విషయాన్ని ఐక్యరాజ్య సమితి గుర్తించింది. ఈ పరిస్థితిని నివారించేందుకు తన వంతుగా కొన్ని చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఐరాస అనుబంధ సంస్థ అయిన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.ఎల్.ఒ-ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్) 2002లో ఒక అడుగు ముందుకేసింది. అప్పటి నుంచి ఏటా జూన్ 12వ తేదీని అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినంగా గుర్తించింది. ఈ సందర్భంగా ఏటా ఒక ప్రత్యేక నినాదాన్ని తీసుకుని అనేక కార్యక్రమాలను చేపడుతోంది. ఈ కార్యక్రమంలో అనేకమందిని భాగస్వామ్యం చేస్తోంది. సదస్సులు, సమావేశాలు, సభలను ఏర్పాటు చేస్తోంది. 2010లో ది హేగ్‌లో, 2013లో బ్రెసిలియాలో, 2017లో బ్యూనస్ ఎయిర్స్‌లో సదస్సులు నిర్వహించింది. 2021లో సదస్సు దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో జరిగింది. ఇందులో పెద్ద సంఖ్యలో ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ దేశాలు, ఐక్యరాజ్య సమితి, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం ప్రతి నిధులు పాల్గొన్నారు. సదస్సును ఉద్దేశించి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా ప్రసంగించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అన్నది ఏ ఒక్క దేశానికో, సంస్థకో సంబంధించిన విషయం కాదని, దీనిని సమూలంగా నిర్మూలించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామి కావాలని కోరారు. తమ వంతుగా దక్షిణాఫ్రికా పాటుపడుతుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 'డర్బన్ కాల్ టు యాక్షన్' అనే పిలుపిచ్చారు. పిల్లలు పొలాల్లో పని చేయకూడదు, కలల మీద పని చేయాలని డర్బన్ సదస్సు పిలుపిచ్చింది. ఈ సందర్భంగా 'యాక్ట్ నౌ...ఎండ్ ది చైల్డ్ లేబర్ ' అనే నినాదం కూడా ఇచ్చారు. ఈ ఏడాది జూన్ 12న జరిగే బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం థీమ్ కూడా ఇదే. ఈ పిలుపును సాకారం చేసేందుకు, బాలకార్మిక వ్యవస్థను అంతం చేసేందుకు అందరూ తమవంతుగా పాటుపడుతున్నారు.

బాల కార్మికులు ఏ ఒక్క దేశానికో పరిమితం కాలేదు. వారి సంఖ్యలోనే తేడా తప్ప ప్రతి దేశమూ ఈ సమస్య ఎదుర్కొంటోంది. అభివృద్ధి చెందిన, చెందుతున్న, వెనుకబడిన దేశాల్లోనూ బాలకార్మికులు ఉన్నారు. అగ్రరాజ్యమైన అమెరికా నుంచి చీకటి ఖండంగా పేరుగాంచిన ఆఫ్రికాలోనూ బాల కార్మికులు అనేక కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. స్థూలంగా చూస్తే ప్రతి పదిమంది బాలల్లో ఒకరు బాలకార్మికుడిగా మిగిలిపోతున్నారు. వెనుకబడిన ఆఫ్రికా ఖండంలో అత్యధికంగా ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గల బాలకార్మికుల్లో అయిదో వంతు ఇక్కడే ఉండటం గమనార్హం. ఆఫ్రికా తరవాత ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2022 నాటికి 218 మిలియన్ల మంది బాలకార్మికులు ఉన్నట్లు అంచనా. వీరిలో 72 మిలియన్ల మంది ఆఫ్రికా ఖండంలోనే ఉన్నట్లు గణాంకాలు ఘోషిస్తున్నాయి. 62 శాతం మంది ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో ఉన్నట్లు అంచనా. ఆగ్నేయాసియా దేశమైన ఇండోనేసియాలో ప్లాంటేషన్ కంపెనీల్లో ఎక్కువ మంది బాలకార్మికులు పని చేస్తున్నారు. ఆ దేశంలో 1.7 మిలియన్ల మంది బాలకార్మికులు ఉన్నట్లు అంచనా. బాలలను పనిలో పెట్టుకుంటే నాలుగేళ్ల జైలుశిక్ష, 28 వేల డాలర్ల

## గోపరాజు విశ్వేశ్వరప్రసాద్

జరిమానా విధించవచ్చని అక్కడి చట్టాలు చెబుతున్నాయి.

మనదేశంలో బాలకార్మికుల్లో 5 నుంచి 11 సంవత్సరాల మధ్య గల వయసు వారే ఎక్కువ. వీరిలో అత్యధికంగా వ్యవసాయ రంగంలో ఉన్నారు. దేశంలోని మెజార్టీ ప్రజలకు వ్యవసాయమే జీవనాధారం. దీంతో సహజంగానే ఈ రంగంలోనే ఎక్కువ మంది బాలకార్మికులు ఉన్నారు. పలకా బలపం పట్టి పాఠశాలల వైపు అడుగేయాల్సిన బాల్యం పొలాల వైపు నడుస్తోంది. రోజూవారీ పొలం పనుల్లో పసిబిడ్డలు భాగస్వాములవుతూ పాఠశాలలకు దూరమవుతున్నారు. తద్వారా తమ కుటుంబ పోషణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వ్యవసాయం తరువాత కర్మాగారాలు, మైనింగ్, చిన్నతరహా కుటీర, భారీ పరిశ్రమల్లో బాలలు పని చేస్తున్నారు. పట్టణాలు, నగరాల్లోని మురికివాడల్లో నివసిస్తున్న బాలకార్మికులు పరిశ్రమలు, కర్మాగారాల్లో పని చేయడం ద్వారా తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అందరిలాగా తామూ పాఠశాలలకు వెళ్లాలని, వారికున్నా కుటుంబ పరిస్థితులు వారిని దూరంచేస్తున్నాయి. తల్లితండ్రులు సంపాదన పరులు కాకపోవడం, వారు అనారోగ్యం పాలవడం, తల్లితండ్రుల్లో ఎవరో ఒకరు లేకపోవడం, ఉన్నా అనారోగ్యానికి గురవడం, వయసుమీద పడిన వారు కావడం.. తదితర కారణాల వల్ల రేపటి పౌరులు బలవంతంగా బాలకార్మికులుగా మారుతున్నారు. గత రెండేళ్లుగా కొవిడ్ వీరిపై తీవ్రంగా ప్రభావం చూపింది. అసలే అంతంత మాత్రంగా ఉండే పేదల జీవితాలను కరోనా కాటేసింది. కరోనా మహమ్మారి వల్ల పెద్దయెత్తున ఉపాధి కోల్పోయారు. కరోనా ప్రభావం అన్ని రంగాలపై పడింది. పరిశ్రమలు, కర్మాగారాల మూత అనివార్యంగా ఉపాధిపై ప్రభావం చూపింది. దీని ప్రభావం వల్ల బాలకార్మికుల సంఖ్య మరింతగా పెరిగింది. 2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను అంతం చేయాలని 2015లో ఐక్యరాజ్య సమితి తన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో (ఎస్‌డీజీ- సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గ్రోత్) భాగంగా నిర్ణయించుకుంది. అయితే ఈ దిశగా చేపడుతున్న కార్యక్రమాల్లో మందగమనం నెలకొందన్న అభిప్రాయం ఉంది.

ఏ ఒక్క వ్యక్తి, సంస్థ, ప్రభుత్వం, పాలకుడూ బాలకార్మిక వ్యవస్థను మార్చలేరు. రాత్రికి రాత్రి ఈ సమస్యను పరిష్కరించడం అసాధ్యం. దీనికి కలిసి కట్టుగా ప్రయత్నం చేయడం అవసరం. సామాజిక, రాజకీయ సంస్కరణలు తప్పనిసరి. అయితే ప్రభుత్వాల పాత్ర అన్నింటికన్నా కీలకం. ప్రభుత్వాలు ఉచిత విద్యా సౌకర్యం, మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ ఈ కార్యక్రమాల అమలులో లోటుపాట్ల వల్ల పూర్తిస్థాయిలో ఫలితాలు సమకూరడం లేదు. ఒక పేదవాడు తన పిల్లలను పాఠశాలకు పంపడం కన్నా పొలం పనికి పంపితేనే మేలన్న భావనను దూరం చేయనంత కాలం బాలకార్మిక వ్యవస్థ కొనసాగుతూనే ఉంటుంది. ఈ పరిస్థితి మారాలంటే మంచి విద్య, పౌష్టికాహారం, నాణ్యమైన వైద్యం అందజేయాలి. ఇవన్నీ పూర్తిగా ప్రభుత్వాల బాధ్యతే.

ఇతర దేశాలతో పోలిస్తే బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనకు భారత్ మెరుగైన పోరాటమే చేస్తోంది. భారత రాజ్యాంగమే బాలకార్మికులు ఉండరాదని పేర్కొంటోంది. 14 ఏళ్లలోపు బాలబాలికలకు నిర్బంధ ప్రాథమిక విద్య కల్పించాలని నిర్దేశిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. అనేక చట్టాలు చేశాయి. అదే సమయంలో పిల్లలను పాఠశాలకు రప్పించేందుకు చర్యలు చేపడుతున్నాయి. ముందుగా బాలలను పనుల్లో పెట్టుకునే ప్రక్రియను అడ్డుకునేందుకు చట్టాలు చేశాయి. ఫ్యాక్టరీల చట్టం- 1948, చైల్డ్ లేబర్ యాక్టు- 1986, జువైనల్ జస్టిస్ ఆఫ్ చిల్డ్రన్ యాక్టు, విద్యాహక్కు చట్టం- 2009 రూపొందించాయి. చట్ట ప్రకారం 14 ఏళ్లలోపు పిల్లలను ఎలాంటి పనుల్లో పెట్టుకోరాదు. 18 ఏళ్ల లోపు పిల్లలను కొన్ని మినహాయింపులకు లోబడి పెట్టుకోవచ్చు. 2009 నాటి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థలు సైతం ఫీజులు చెల్లించలేని పేద విద్యార్థులకు కొన్ని సీట్లను కేటాయించాలి. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ‘డ్రాపౌట్స్’ ఉంటారు. డ్రాపౌట్స్ అంటే మధ్యలో బడి మానేయడం. కుటుంబ అవసరాల కోసం, జరుగుబాటు కోసం కొంతమంది తల్లితండ్రులు చదువుకుంటున్న పిల్లలను మధ్యలో మాన్పించి పనులకు పంపిస్తుంటారు. దీనిని నివారించేందుకు, పిల్లలు బడి మానేయకుండా మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రవేశపెట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని సంయుక్తంగా అమలు చేస్తున్నాయి. పథకానికి ఎక్కువగా నిధులు సమకూర్చేది కేంద్ర ప్రభుత్వమే కావడం గమనార్హం. కార్మిక మంత్రిత్వ శాఖ అధికారులు పరిశ్రమలు, కర్మాగారాలపై అకస్మాత్తుగా సోదాలు జరుపుతూ బాల కార్మికులను గుర్తిస్తున్నారు. వారు తిరిగి పాఠశాలలకు వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో బాల కార్మికులతో పని చేయిస్తున్న ఆయా సంస్థలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కూడా తక్కువేమీ కాదు. అవి ప్రజల నుంచి, వివిధ సంస్థల నుంచి విరాళాలు సేకరించి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి వీటి ప్రయత్నాన్ని వివిధ సందర్భాల్లో అభినందించారు. 2021 నాటి లెక్కల ప్రకారం భారత్‌లో బాలకార్మికులు 9 మిలియన్లు ఉన్నట్లు అంచనా. పెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్‌లో అత్యధికంగా ఉన్నారు. దేశంలోని మొత్తం బాలకార్మికుల్లో 20 శాతం మంది ఇక్కడే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ రాష్ట్రంలో ఎక్కువ మంది సిల్క్ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. మన పొరుగున గల బంగ్లాదేశ్‌లో అయిదు మిలియన్లు, పాకిస్తాన్‌లో 3.4 మిలియన్లు, నేపాల్లో రెండు మిలియన్ల మంది బాలకార్మికులు ఉన్నట్లు అంచనా. సోమాలియా, ఎరిట్రియా, ఉత్తర కొరియా, దక్షిణ సూడాన్, చాద్, సిరియా, వెనిజులా తదితర దేశాల్లో బాల కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ దేశాల్లో బాల కార్మికులు అధిక సంఖ్యలో ఉండటానికి ప్రధాన కారణం పేదరికం. అయా దేశాల్లో నెలకొన్న రాజకీయ అస్థిరత, అంతర్యుద్ధాలు, సంక్షోభాలు కూడా కారణమని చెప్పవచ్చు. కేవలం సదస్సులు, సమావేశాలు, సభలు జరుపుకోవడం, తీర్మానాల ద్వారా మాత్రమే సమస్య పరిష్కారం కాదు. ప్రతి ఒక్కరూ తమ వంతు చిత్తశుద్ధితో పనిచేసినప్పుడే బాలకార్మికులు లేకుండా చేయగలమన్నది సత్యం. ఆ దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.




**వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్**

## కథ

అతని చెంప పైనుండి కన్నీళ్లు జారీ అతని సెల్ స్క్రీన్‌పై పడ్డాయి. జాన్ వాళ్ల నాన్న వలన ఏడవడం అదేమీ మొదటి సారి కాదు. కానీ ఈ సందర్భం వేరు. ఒక్కసారి కన్నీళ్లు తుడుచుకుని, సెల్ స్క్రీన్‌ను తుడిచి ఆ వీడియో మళ్లీ చూశాడు. ఏదో తెలియని సిగ్గు, తప్పు చేసిన భావన అతనిలో. ఎన్నో ఏళ్లుగా జాన్ లో గూడు కట్టుకున్న అపోహలు, అవాస్తవాలు పగిలిపోతున్న భావన.

మొదటిసారి మా నాన్న అప్పారావుకి నేను ఏకైక కొడుకుని అని అరవాలనిపించింది. టైం చూశాడు. ఇంకా గంట సమయం ఉంది ఆఫీస్ నుండి వెళ్లిపోవడానికి. తన టేబుల్ మీద ఉన్న బెల్ నొక్కి సర్వెంట్‌కి వేడివేడి కాఫీ తీసుకురమ్మని చెప్పాడు. సర్వెంట్ కూడా జాన్ ముఖంలో తేడాని గమనించాడు.

లేచి కాఫీ తాగుతూ తన ఆఫీస్ క్యాబిన్ నుంచి వ్యూ చూస్తూ పాత జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయాడు.

జాన్ వాళ్లది రామవరం అనే పల్లెటూరు. ఆ ఊరి చివరి పేటలో వీళ్ల ఇల్లు. ఇప్పుడంటే జాన్ కానీ ఆ పేటలో చిన్నప్పుడు అతనిని జానయ్య అని పిలిచేవారు. జాన్ వాళ్ల నాన్న పేరు అప్పారావు పారిశుద్ధ్య కార్మికుడు, అమ్మ పేరు లక్ష్మి గృహిణి. ఏకైక కొడుకు కావడంతో జాన్‌ని వాళ్లు ఉన్నంతలో ప్రేమగా,గారాబంగా చూసుకునేవారు.

ఆ ప్రేమ, గారాబం జాన్‌కి హాయిగా ఉన్న, అతనికి ఇబ్బంది కలిగించిందల్లా వాళ్ల నాన్న వృత్తి. ఊరిని శుభ్రంగా ఉంచే ఆ పారిశుద్ధ్యం జాన్‌కి మాత్రం ఎందుకు చెత్తగా, చిత్తుగా తగులుకుందో చూద్దాం.

చిన్నప్పుడు జాన్‌ని వాళ్ల నాన్న బడి దగ్గర దించేసి తన పనికి వెళ్లేవాడు. వాళ్ల నాన్న సైకిల్ ఎదుట ఊస మీద కూర్చుని బడికి వెళ్లడం జాన్‌కి గుర్రపు బండి ఎక్కి సవారీకి వెళ్ళినట్టు ఉండేది.

కొంచెం పెద్దయ్యాక తెలిసింది ఆ సైకిల్ సవారీ తనని తక్కువ వాడిని చేసిందని. దానికి కారణం... ఎదుట సైకిల్‌పై జాన్ కూర్చుంటే, వెనుక వాళ్ల నాన్న పాకీ చీపురుని సైకిల్ క్యారేజ్‌కి కట్టుకునే వాడు. ఆ చీపురిని చూసిన జాన్ స్నేహితులు బడిలో తనని హేళన చేసేవారు. జాన్ దగ్గరికి వస్తుంటే ముక్కు మూసుకుని ఆటపట్టించేవారు. అలా చేస్తుంటే జాన్‌కు ఏడుపు తన్నుకు వచ్చేది. అలా ఎన్ని కన్నీళ్ళు తుడుచుకున్నాడో తన చొక్కా కాలర్‌కే తెలుసు.

జాన్ ఇది కాదని కోపగించుకుని వాళ్ల నాన్నను బడికి రావద్దన్నాడు. తనే రోజు బడికి నడిచి వచ్చేవాడు.

ఒక రోజు అర్ధరాత్రి నిద్దట్లో ఉన్న జాన్‌కి బయట అలికిడికి మెలుకువ వచ్చింది. ఏమిటా అని కిటికీ నుంచి చూశాడు. బయట నిలబడిన వాళ్ల నాన్న ఒళ్లంతా రొచ్చుతో నిండిపోయింది. అతని ఒంటి మీద నుంచి దుర్గంధ భరితమైన వాసన ఇంట్లోకి కూడా వస్తుంది.

జాన్‌కి అర్థమైంది, వాళ్ల నాన్న ఎక్కడో బాత్రూమ్ ట్యాంకు నీరు ఎత్తి శుభ్రం చేసి వచ్చాడని. వాళ్ల అమ్మ నాన్నకి ఒక కొత్త సబ్బు, నాలుగు షాంపులు ఇచ్చింది స్నానం చేయడానికి. తలస్నానం చేసి వచ్చి వేళకాని వేళ భోజనం చేశాడు వాళ్ల నాన్న. కానీ ఆ కష్టం జాన్ మనసులో వేరే విధంగా రూపుదిద్దుకుంది. ఎందుకు మా నాన్నే ఇలాంటి పనులు చేయాలి? అనే ప్రశ్న మొదలైంది. దానితోపాటు నాన్న మీద చిరాకు కలిగింది.




కొన్ని రోజులు ఇలా సాగాయి. ఒకరోజు తరగతిలోని పిల్లలని సోషల్ బోధించే ఉపాధ్యాయుడు వారి తండ్రుల గురించి, వారి వృత్తుల గురించి చెప్పమన్నారు.

అందరూ మా నాన్న రైతు, కిరాణా కొట్టు షావుకారు, దినసరి కూలీ, వడ్డీ వ్యాపారి...ఇలా చెబుతున్నారు. జాన్ వంతు వచ్చింది. ఏమని చెప్పాలి? అప్పటికే జాన్‌కి చెమటలు పట్టాయి. బిడియంగా లేచి నిల్చున్నాడు. మా నాన్న పేరు అప్పారావు. నేను ఆయనకు ఒకే ఒక కొడుకుని. మా నాన్న పాకీ పని చేస్తారు. అనగానే క్లాస్ అంతా

గొల్లున నవ్వింది. జాన్ సిగ్గుతో చచ్చిపోయాడు. ఉపాధ్యాయుడు వెంటనే సైలెన్స్ అని గట్టిగా అరిచాడు. క్లాస్ అంతా నిశ్శబ్దం అయిపోయింది. ఒక్క జాన్ ఏడుపు తప్ప ఏమి వినపడటం లేదు. అప్పటికే అతని కన్నీళ్లు తన ఎదుట ఉన్న సోషల్ టెక్స్ట్ బుక్ పుటలని తడిపేస్తున్నాయి.

ఆ సంఘటన తరువాత నేరుగా జాన్ వెళ్లి వాళ్ల నాన్నని,'నాన్న ఈ పాకీపని మనకెందుకు? వేరే పని ఏదైనా చెయ్యొచ్చుగా' అని అడిగాడు. దానికి వాళ్ల నాన్న సమాధానం ఒక నవ్వు నవ్వేసి లేచి తీగ మీద ఉన్న రుమాలు భుజం మీద వేసుకుని బయటకు వెళ్లిపోయాడు. ఏమీ అర్థం కాని జాన్ అప్పటి నుంచి తన తండ్రి వృత్తినే కాదు, తన తండ్రిని కూడా ద్వేషించడం మొదలు పెట్టాడు. అతనికి దూరంగా ఉండేవాడు. ఎక్కువగా ఇంటికి వచ్చేవాడు కాదు.

వీళ్లకి ఇంకా దూరంగా ఉండాలంటే బాగా

# అప్పారావు కొడుకుని

## చిక్కాల జానకిరామ్



చదవాలి అని గ్రహించాడుజాన్ . అలాగే చదివాడు కూడా. పైచదువులకు పట్నంలోని కళాశాలలో సీటు వచ్చింది. అక్కడే వసతిగృహం సదుపాయం కూడా కలిగింది.

అలా జాన్ కళాశాలకు చేరుకున్నాడు. పట్నం పైగా వసతి గృహంలో ఉండడంతో అరుదుగా ఇంటికి వచ్చేవాడు. ఒకసారి తనతో పదో తరగతి చదివిన మిత్రుని పెళ్లి కావడంతో ఊరికి వచ్చాడు కానీ ఇంటికి వెళ్లలేదు. పెళ్లిలో కొందరు మిత్రులను కలుసుకున్నాడు. వారితో తన మార్కుల గురించి, పట్నం గురించి చెప్పాడు. వాళ్లు కూడా ఆనందించారు. పెళ్లి కుమారుడికి శుభాకాంక్షలు తెలిపి తెచ్చిన బహుమతిని అందజేశారు.

మిత్రులతో కలిసి జాన్ భోజనపంక్తిలో కూర్చున్నాడు. భోజనం చేస్తూ వారితో కబుర్లలో పడ్డారు. ఇంతలో ఎదురుగా ఉన్న వరుస వారు భోజనం ముగించి లేచారు. అక్కడ ఆకుల తీస్తూ జాన్ వాళ్ల నాన్న. జాన్ చూసీచూడనట్లు మొహం కిందకి దింపాడు. కానీ అప్పారావు కొడుకుని చూశాడు.'ఏరా ఎప్పుడొచ్చావ్? ఇంటికి రాలేదే? భోజనాలయ్యాక ఓసారి రారా అమ్మ చూస్తా అంటుంది' అనేసి జాన్ వాళ్ల మిత్రులను కూడా పలకరించి ఆకులు పట్టుకుని చెత్త బండి దగ్గరికి వెళ్లి పోయాడు.

మిత్రులు ఏమీ అనలేదు. కానీ జాన్‌కే ఎందుకో చాలా అవమానంగా అనిపించింది. తన తండ్రి ఆకులు ఎత్తడం, అందరి ముందు తనని పలకరించడం ఏదోలా అనిపించింది. తనకి తెలియకుండానే రెండు కన్నీటి బొట్లు జారీ ఎదుట ఉన్న విస్తరిలో పడ్డాయి. పక్కనున్న మిత్రుడు సాంబార్ వేడిగా ఉంది, ఊదుకుని తినరా మూతి కాలినట్టు ఉంది అన్నాడు.

కానీ కాలింది మూతి కాదు జాన్ మనస్సు. జాన్ అప్పటి నుండి ఇంటికే వెళ్లలేదు. కసిగా చదివాడు. వీళ్లకి అందనంత దూరం ఎగిరిపోవాలనే కోరికతో చదివాడు. మార్కులను, ర్యాంకులను దాటుకుంటూ వచ్చి ఒక మంచి ఉద్యోగంలో పడ్డాడు.

ఉద్యోగరీత్యా హైదరాబాద్ సిటీకి చేరుకున్నాడు. అక్కడ తన పేరు, తన పని తప్ప తన ఊరు కాని, తన కుటుంబం గురించి కానీ, తన వ్యక్తిగత విషయాలు కానీ ప్రస్తావించేవాడు కాదు. పనిలో పైకి ఎదగడం మీదే అతని ధ్యాసంతా. అందరూ జాన్‌ని పనిరాక్షసుడు అనుకునేవారు.

అయితే ఆఫీసులో అతని కష్టాన్ని మరిపించి, తనకి ఎవరూ లేరు అనే భావన నుంచి గట్టెక్కించే అద్భుతం జరిగింది. ఆ అద్భుతమే లావణ్య. ఆమె జాన్ సహోద్యోగి. వారి మధ్య ప్రేమ చిగురించింది. కుటుంబానికి దూరంగా ఉండే జాన్ తనకు అన్నీ లావణ్యనే అనుకున్నాడు.

తనని విపరీతంగా ప్రేమించాడు. వారిద్దరూ పెళ్లి గురించి ప్రస్తావించుకున్నారు. లావణ్య తండ్రి జాన్‌ని కలిసాడు. తనకు ఎవరూ లేరు అని చెప్పాడు జాన్. అతనికి చక్కటి ఉద్యోగం ఉండడంతో మతం కూడా పెళ్లికి అడ్డుగా కనిపించలేదు. అయితే పిల్లనిచ్చేవారి భయాలు లావణ్య తండ్రిలోనూ లేకపోలేదు. దానితో జాన్ గురించి మొత్తం కూపీ లాగాడు. జాన్ తల్లిదండ్రుల గురించి, అతని ఊరి గురించి తెలిసింది. తనకు ఎవరూ లేరు అని జాన్ చెప్పిన అబద్ధం బట్టబయలైంది.

అది చాలు ఆ ప్రేమకు, పెళ్లికి స్వస్తి పలకడానికి. జాన్ లావణ్య తండ్రిని చాలా బతిమాలాడు. తనకు మంచి ఉద్యోగం ఉంది అన్నాడు. 'నా కూతురికీ ఉద్యోగం ఉంది' అని సమాధానం వచ్చింది. మరి మీకేం కావాలి అని అడిగాడు. 'నీ తండ్రి చేసేది పాకీపని లేదా పారిశుద్ధ్యం అది చెప్పుకోవడానికి నీకే సిగ్గుగా ఉంది..! నీకు ఎవరూ లేరు అన్నావు. మరి అటువంటిది నువ్వే తక్కువగా చూసే ఆ ఇంటికి నా కూతుర్ని ఎలా కోడలిగా పంపిస్తాను

**వాకాటి పాండురంగరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

అనుకున్నావు. ఇక్కడితో ఈ విషయాన్ని, నా కూతుర్ని మర్చిపో' అని పంపేశాడు.

తర్వాత కొన్ని రోజులకే లావణ్య ట్రాన్స్ఫర్‌పై వెళ్ళిపోయింది. ఇది జాన్‌ని మరింత కుంగదీసింది. ఏడిపించింది. ఎన్ని కన్నీళ్లు పెట్టుకున్నాడో అతని దిండులనే అడగాలి. జాన్‌లో ఇంకా కసి పెరిగింది! ఈ ప్రభుత్వ ఉద్యోగం కాక ఇంకా ఏదో కావాలి అనిపించింది. ఈ కింది స్థాయి ప్రజల నుండి దూరంగా ఉండాలనిపించింది.

అప్పుడే సాఫ్ట్వేర్ బూమ్ వచ్చింది. బాధను దిగమింగుకుని ఆ వైపు దృష్టి పెట్టాడు జాన్. ఉద్యోగం చేస్తూనే ఇంజనీరింగ్ చదివాడు.

ఎన్నో కష్టాలు అధిగమించి ముంబైలోని ఖరీదైన సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగం పొందాడు. ఆ కంపెనీ లోనే అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం అదే కంపెనీ సీఈవో అయ్యాడు.

ప్రభుత్వ ఉద్యోగం చేసినప్పుడు కొడుకు ఇంటికి రాకపోయినా, కనీసం ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో అప్పారావు దంపతులకు తెలుసు. కానీ జాన్ ముంబై వెళ్లిపోయాక అసలు కొడుకు ఎక్కడ ఉన్నాడో? ఏం చేస్తున్నాడో? అసలు బ్రతికే ఉన్నాడో? లేదో? తెలియని పరిస్థితి ఆ దంపతులది. పై చదువులకో, ఉద్యోగానికో పోయి ఉంటాడులే. మనని గుర్తుపెట్టుకుని తిరిగి రాక పోతాడా అని వెయ్యి కళ్ళతో, అమితమైన ప్రేమతో ఎదురుచూస్తున్నారా తల్లిదండ్రులు. కానీ అతను రాలేదు.

ప్రభుత్వ ఉద్యోగం చేసినప్పుడు కొడుకు ఇంటికి రాకపోయినా, కనీసం ఎక్కడున్నాడో ఏం చేస్తున్నాడో అప్పారావు దంపతులకు తెలుసు. కానీ జాన్ ముంబై వెళ్లిపోయాక అసలు కొడుకు ఎక్కడ ఉన్నాడో? ఏం చేస్తున్నాడో? అసలు బ్రతికే ఉన్నాడో? లేదో? తెలియని పరిస్థితి ఆ దంపతులది. పై చదువులకో, ఉద్యోగానికో పోయి ఉంటాడులే. మనని గుర్తుపెట్టుకుని తిరిగి రాక పోతాడా అని వెయ్యి కళ్లతో, అమితమైన ప్రేమతో ఎదురుచూస్తున్నారా తల్లిదండ్రులు. కానీ అతను రాలేదు.

కాలం ముందుకు సాగిపోయింది. కరోనా అనే ప్రమాదకర వ్యాధి ప్రపంచాన్ని జడిపిస్తూ, భారత్‌కు కూడా వచ్చింది. ఆ సమయంలో సరిహద్దుల దగ్గర సైనికుల్లా ప్రాణాలకు తెగించి సేవలందించారు ఫ్రంట్లైన్ వారియర్స్. ఇందులో ఎవరికి వారే సాటి.

ఫ్రంట్ లైన్ వారియర్‌గా తన సేవలను ఉన్నతస్థాయిలో అందించాడు అప్పారావు. ఉదయం వీధులు ఊడ్చి బ్లీచింగ్ చల్లడం దగ్గర నుండి, రక్తసంబంధీకులు కూడా దగ్గరకు రాని కరోనా పార్థివదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడం వరకు అన్ని పనులు చేసేవాడు. మెల్లగా కరోనా ఉధృతి తగ్గి మామూలు రోజులు రాసాగాయి.

ఫ్రంట్లైన్ వారియర్స్ సేవలను గుర్తించింది కేంద్ర ప్రభుత్వం. అత్యుత్తమ ఫ్రంట్లైన్ వారియర్స్‌ని ప్రధానమంత్రి చేతుల మీదగా సత్కరించాలనుకుంది. దానికి అనుగుణంగా జాబితా తయారు చేయించింది. అందులో అప్పారావు పేరు చోటు చేసుకుంది.




కారణం అప్పారావు రిటైర్మెంట్‌కి దగ్గరయ్యాడు, కానీ ఇన్నేళ్లలో ఒక్క రోజు కూడా సెలవు పెట్టలేదు. ఆదివారాలు కూడా పనిలోనే గడిపాడు. రామవరం వెళ్లి వీధులను పరిశీలిస్తే తెలుస్తుంది అప్పారావు పనితనం. కరోనా సమయంలో పరిశుభ్రత గురించి టీవీలలో చూసి రాత్రి పగలు ఊరిని శుభ్రంగా ఉంచడం కోసం పాటు పడ్డాడు.

సన్మానం జరిగే రోజు రానే వచ్చింది. రామవరం సర్పంచ్ మనిషిని తోడిచ్చి అప్పారావుని ఢిల్లీ పంపాడు. సభకు చేరుకున్నారు. వేదికపై ఫ్రంట్లైన్ వారియర్స్ ఒక్కొక్కరికి ప్రధానమంత్రి చేతుల మీదుగా సన్మానం జరుగుతుంది. కొందరు చిన్నపాటి స్పీచ్ కూడా ఇస్తున్నారు. అనువాదకులు దానిని హిందీలోకి అనువదిస్తున్నారు. అప్పారావు వంతు వచ్చింది. ప్రధానమంత్రి శాలువా కప్పి, సన్మానపత్రం, రివార్డు నగదు చేతిలో పెట్టి సన్మానించారు. అప్పారావుని కూడా మాట్లాడమన్నారు.

అప్పారావు బిడియంగానే మైక్ అందుకొని అందరికీ నమస్కరించి మాట్లాడడం మొదలు పెట్టాడు.

'అయ్యా మాది రామవరం అనే పల్లెటూరు. మా తాతలు,తండ్రులు ఇదే పారిశుద్ధ్య వృత్తిని చేశారు. నేను అదే చేస్తున్నాను. ఈ పనికి కులం అంటగట్టి మమ్మల్ని దూరం పెట్టినవారున్నారు, దూషించినవారున్నారు. కానీ మేము ఎవరిని వదులుకోలేదు. ఊరంతా మాదనుకున్నాం. మా బాధ్యతగా దానిని శుభ్రంగా ఉంచాము.

ఒకసారి మా అబ్బాయి నన్ను అడిగాడు. నాన్న ఈ వృత్తి ఎందుకు ఇంకొకటి చేయొచ్చు కదా అని. అప్పులపాలవుతానని రైతు, ప్రాణాలు పోతాయని సైనికుడు తమ వృత్తులను విరమిస్తే ఎవరైనా బ్రతకగలరా. అలాగే ఏ వృత్తైనా జనం కోసమే. జనంలో కొందరు సౌకర్యంగానూ, మరికొందరు సుఖంగానూ బ్రతకాలంటే, కొందరు కొంత కష్టపడాలి. అలాగని కష్టపడేవారు ఏమీ తక్కువ కాదు, కింది వారు కాదు. ఎందుకంటే వారు లేనిదే పైస్థాయి వారికి సౌకర్యం ఉండదు కనుక.

ఉదయం లేస్తే పాలవాడు, మీ డ్రైవర్ ఇలా ఎవరో ఒకరి మీద మీరు ఆధారపడల్సిందే. అందుకే వారిని పురుగుల్లా చూడొద్దు, మీ పురోగతిలో ఒక భాగంగా చూడండి. అదేదో డిగ్నిటీ ఆఫ్ లేబర్ అంటారు అది నాకు తెలియదు కానీ చేసేవారి శ్రమకు తగ్గ గుర్తింపివ్వండి. మీ డ్రైవర్‌ని పలకరించండి, మీ పనివాళ్ల కష్టసుఖాలు తెలుసుకోండి. అవేమి మిమ్మల్ని తక్కువ చెయ్యవు, మంచోడిని చేస్తాయి.

నా వృత్తిని నేను దైవంగా భావిస్తాను. ఇదే

నాకు,నా కుటుంబానికి నాలుగు మెతుకులు పెట్టింది. నా కొడుకుని చదివించి ఉన్నత స్థాయికి చేరుకునేందుకు మార్గం వేసింది. దేశానికే పెద్దలైన ప్రధాని గారు ముందు నన్ను నిలబెట్టింది. అందుకే ఒక పారిశుద్ధ్య కార్మికుడిగా గర్వపడతాను' అని ముగించాడు.

సభ అంతా చప్పట్లతో మారుమోగింది. ప్రధానమంత్రి దగ్గరకు వచ్చి నా మిత్రుడు దేశ ప్రజలు నేర్చుకోవలసిన జీవన సత్యాన్ని బోధించాడు అని చెప్పి అప్పారావు భుజం తట్టారు.

అప్పారావు మాట్లాడిన ఆ వీడియో దేశమంతా వైరల్ అయ్యింది. తమ దగ్గర పనిచేసే వాళ్లతో ఫోటోలు దిగి సామాజిక మాధ్యమాలలో పెట్టడం మొదలుపెట్టారు. ఆ వీడియో అలా ఎవరో జాన్‌కి షేర్ చేశారు.

తన తండ్రి గొప్పతనాన్ని జాన్ తెలుసుకున్నాడు. తండ్రి ఆ ప్రసంగాన్ని ఎవరికో కాదు తనలాంటి వారికోసమే చేశాడని అర్థమయింది. తల్లిదండ్రులను వదిలేసి చేసిన పొరపాటుకు వీడియో చూస్తూ మనసులోని క్షమాపణలు చెప్పుకున్నాడు. దేశం గుర్తించి గౌరవిస్తున్న తన తల్లిదండ్రులను కలుసుకోవడం తన తక్షణ కర్తవ్యంగా గ్రహించాడు. అప్పుడే ఆఫీస్ గడియారం ఐదు కొట్టింది. కోటు



తీసుకుని క్యాబిన్ నుంచి బయలుదేరాడు.

క్యాబిన్ నుంచి బయటకు రాగానే స్వీపింగ్ చేస్తున్న ముక్తినాథ్ కనిపించాడు జాన్‌కు. అప్పుడు జాన్‌కు నాలుగు రోజుల క్రితం జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది. ముక్తినాథ్ క్యాంటీన్ దగ్గర ఎవరితోనో మాట్లాడుతూ తన కూతురికి త్వరలో పెళ్లి అని, ఖర్చులకి డబ్బులు తక్కువ అయ్యాయని, అప్పు చేయాల్సి రావచ్చు అని బాధ పడుతున్నాడు. అది విన్న జాన్ ఛీ ఛీ ఎందుకు కంటారో పిల్లల్ని పేదరికంలో ఉండి అని ఛీదరించుకున్నాడు. అది గుర్తుకు వచ్చి సిగ్గుపడ్డాడు. ముక్తినాథ్‌ని ఒకసారి క్యాబిన్‌లోకి రమ్మని మళ్లీ క్యాబిన్‌కి వెళ్ళాడు. చెక్కు మీద రెండు లక్షల రూపాయలు రాసి సంతకం చేశాడు. 'ముక్తినాథ్ నాకు తెలిసినప్పటి నుండి ఆఫీస్‌లో పని చేస్తున్నావు. నీ కూతురు పెళ్లి నా చెల్లిదిగా భావించి నేను ఇస్తున్నాను కాదనకుండా తీసుకో'అని చెక్కు అందజేశాడు.ముక్తినాథ్ జాన్ కాళ్లు పట్టుకున్నంత పని చేశాడు, జాన్ అతనిని పైకి లేపాడు.

ఆఫీసులో ప్రతి ఒక్కరిని మొదటిసారి విష్ చేస్తూ, చిరునవ్వుతో పలకరిస్తూ తన కారు వద్దకు చేరుకున్నాడు. అందరూ తిరిగి ఆనందంగా తనని విష్ చేస్తుంటే ఎంత హాయిగా ఉంది. ఇక నా తల్లిదండ్రులను రేపటికల్లా కలుసుకుని తనకు దూరమైన ప్రేమని,నవ్వుని సంతోషాన్ని, గౌరవాన్ని, మనశ్శాంతిని కలకాలం నిలుపుకోవాలి అనుకుని బయల్దేరాడు. సీఈవో జాన్‌గా కాదు... అప్పారావు కొడుకు జానయ్యగా ★


## జాగృతి/స్వర్గీయ ఎం.డి.వై. రామమూర్తి స్మారక నవలల పోటీ



**జాగృతి ఆధ్వర్యంలో ఎం.డి.వై. రామమూర్తి స్మారక 'నవలల పోటీ- 2022'కి రచనలను ఆహ్వానిస్తున్నాం.**

ప్రథమ బహుమతి రూ. 25,000

ద్వితీయ బహుమతి రూ. 20,000

సూచనలు :

- ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు.
- నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు.
- సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు.
- నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి.
- ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- నవలలు పంపవలసిన చిరునామా : **3-4-228/4/1**, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- **500027.**

రచయితల విన్నపం మేరకు గడువు పొడిగించామని చెప్పడానికి సంతోషిస్తున్నాం.

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 10 జూన్, 2022**



సారస్వత రంగంలో బుకర్ ప్రైజ్ గురించి తెలియనివారుండరు.  ఎందుకంటే, అది అంతర్జాతీయ స్థాయి పురస్కృతి. రచయితల/ రచయిత్రుల లోకంలో ఇప్పుడు గీతాంజలిశ్రీ వివరాలు తెలుసుకోవాలని అనుకోనివారుండరు. కారణం ఏమిటంటే, అంతటి బహూకృతి సంపాదించిన మొట్టమొదటి భారతీయ మహిళామణి ఆమే. ఆంగ్ల సాహిత్యానికి సంబంధించి ఏటా ఉత్తమ నవలా రచనకు మాన్ బుకర్ పేరిట లక్షలాది రూపాయల నగదు బహుమతి ప్రకటిస్తారని అందరికీ తెలుసు. ప్రత్యేకించి కామన్వెల్త్ సహా సంబంధిత ఇతర దేశాలవారికి ఆ పురస్కారాన్ని  ఉద్దేశించారన్నదీ తెలిసిన అంశమే. అందరూ తెలుసుకుని తీరాల్సిన అసలు విషయం - యునైటెడ్ కింగ్‌డమ్‌లో ప్రచురించిన ఆంగ్ల రచనలకిచ్చే ఆ ప్రైజ్‌ను కొంతకాలం కిందట అనువాదాలకు విస్తరించారు. బహుమానం మొత్తం (అంతా కలిపి దరిదాపు రూ.అరకోటికి చేరుకుంటున్నది) మూలకర్త, అనువాదకునికి సరిసమానంగా అందజేస్తారు. వనితా విజేత (స్వ రాష్ట్రం ఉత్తరప్రదేశ్) హిందీలో రాసినది ప్రపంచ స్థాయిని ఆకట్టుకొందంటే, భాషల ఎల్లలన్నింటినీ అలవోకగా దాటి పరమోన్నతిని అందుకుందంటే, ఘనాఘన చరిత్ర సృజన సమస్తం గీతాంజలి శ్రీదే! ఇప్పుడామె మన దేశ రాజధాని ఢిల్లీలో ఉంటున్నా, పేరు ప్రఖ్యాతులన్నీ ప్రపంచ దేశాలకు వ్యాపించాయి. తన కీర్తినాదం ఇంగ్లండ్ అంతటా (ప్రైజ్ కేంద్ర స్థలి) ఇవాళ ప్రతిధ్వనిస్తోంది. ఎప్పుడో ఐదున్నర దశాబ్దాల క్రితం రూపొందిన బహుకృత సంస్థ కాంతికిరణాలు భారత్‌పైన ప్రసరించి నేడు సకల సాహితీ ప్రపంచాన్నీ ధగధగాయమానం చేస్తూనే ఉన్నాయంటే... కర్త కర్మ క్రియ అన్నీ గీతాంజలిశ్రీ!

# 'ఇసుక సమాధి' కింద ఇంకిపోని 'విభజన' విషాదం

**కా**ల పరిణామక్రమంలో మనకు సంబంధించి ఇద్దరికి (సల్మాన్ రష్డీ, అరవింద అడిగా) మొదలూ తుదిగా బుకర్ పురస్కారాలు లభించాయి. ఒకరు భారతీయ సంతతికి చెందిన బ్రిటిష్ రచయిత; మరొకరు భారత్, ఆస్ట్రేలియా దేశాల ఉభయ పౌరసత్వమున్నవారు). ఆ ఇద్దరికీ బహూకరించి చాలా సంవత్సరాలైంది. చివరగా బహూకరణ జరిగి ఒకటిన్నర దశాబ్దం కావస్తోంది. తిరిగి ఇప్పుడు అదే విశ్వవిఖ్యాత పురస్కారం గీతాంజలిశ్రీని వరించడం కచ్చితంగా చరిత్రాత్మకం. బహూకృతి- నవలలతో పాటు కథా సంకలనాలకీ విస్తరించిన దశలో, ప్రతిష్ఠాత్మక రీతిన ఎందరెందరో ఎన్నెన్ని దేశాల నుంచో పోటీపడుతున్న స్థితిలో విజేతగా ఆమె నారీ భేరీ మోగించారు. హిందీ నవలకు ఆంగ్ల పురస్కృతి సాధించిన ప్రథమ భారతీయురాలిగా రికార్డు సృష్టించారు. రచయిత్రులనేకమంది 'నువ్వా నేనా' అన్నట్లు ముందుకొచ్చిన తరుణంలో 'నేనే' అంటూ విజయనాదం చేశారు. ఇంతకీ విజేత పుస్తకం పేరేమిటో తెలుసా? 'ఇసుక సమాధి, ఎనిమిది పదుల వయసున్న వృద్ధ వనిత ధీరోదాత్త గాథ. ఈ ఏడాది పురస్కృతంతో పాటు, భారతీయ భాషల నుంచి అవార్డు సముపార్జించిన ప్రత్యేక పుస్తకమూ ఇదే. ఇంతింత విలక్షణ బహుమతి ప్రాయోజిత సంస్థ పేరు మీద ఆనాడు ప్రకటితమైంది. అప్పట్లో బుకర్ - మెక్‌నో నెల్ ప్రైజ్‌గా ప్రఖ్యాతమైంది. అటు తర్వాత నిర్వహణ ప్రక్రియ బుకర్ ఫౌండేషన్‌కు మారింది. ఇప్పుడైతే స్పాన్సర్ చేసిన వ్యవస్థ (మాన్ గ్రూప్) పేరుతో అధికారకంగా ఇది మాన్ బుకర్ బహుమతి. ఆ మొత్తం ఒక్కసారిగా అనూహ్య రీతిన పెరిగి సర్వత్రా సుప్రసిద్ధత సంతరించుకుంది. యుకే జతగా ట్రినిడాడ్, దక్షిణాఫ్రికా, జర్మనీ, ఐర్లండ్, న్యూజిలాండ్, నైజారియా, కెనడా... ఇలా పలు దేశాల విజేతలున్నారు. ఇన్ని దశాబ్దాల వ్యవధిలో భారతీయులుగా అరుంధతి రాయ్, కిరణ్ దేశాయ్‌ల పేర్లూ ఉన్నాయి. ఈ అందరిలోనూ ప్రస్తుతం విశేషమంతా గీతాంజలిదే! హిందీ రచనకు శిఖరాగ్ర బహుమతి పొందడమే. తనదైన, తనకు మాత్రమే సాధ్యమైన ప్రత్యేకత!!




**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్


### చరిత్రే ప్రధాన ఆధారం


భారతీయ హిందీ నవలను ప్రతిష్ఠాత్మక బుకర్ స్థాయికి చేర్చిన ప్రథమ, ప్రధాన రచయిత్రిగా ఈ అతివ ధ్రువతార. నాలుగేళ్ల నాడు రచించిన 'రేత్ సమాధి' అనంతరం ఆంగ్లంలో 'టూంబ్ ఆఫ్ శాండ్'

అయింది. మూల రచయిత్రిగా గీతాంజలి అనువాద కుర్రాలైన డైసీ రాక్ వెల్‌తో కలిసి బహుమతి మొత్తాన్ని పంచుకుంటారన్న మాట.

ఇదేకాక మరికొన్ని నవలలు, పిల్లల కథలనీ వెలువరించిన గీతాంజలి తాను విజేత అయిన సమాచారం వినగానే 'కలలోనైనా అనుకోలేదు' అంటూ స్పందించారు. ఇదెంతో ఘన సత్కారమంటూనే, వర్ణించడానికి మాటలు చాలడం లేదని వ్యాఖ్యానించారు. ఇవే మాటలు రచయిత్రిగా ఆమెకే కాక, దేశవిదేశాలలోని భారతీయ భాషల ప్రేమికులందరికీ వర్తిస్తాయి. పదాల్లో పొదగలేని, ఇదీ అని వివరించలేని భావోద్వేగ భరిత హృదయపూర్వక స్పందనే అందరిదీ. వృద్ధ వనిత జీవన అవలోకనానికి అక్షర రూపమిచ్చిన ఆమె స్ఫురద్రూపి. విశాలమైన, చురుకైన గీతాంజలి నేత్రాలు ఎదుటి వ్యక్తుల్ని చదువుతున్నట్లు ఉంటాయి. మాటలు సూటిగా, ధాటిగా, ఘాటుగా ఉండి ప్రస్ఫుటమైన వ్యక్తిత్వాన్ని వ్యక్తపరుస్తుంటాయి. ఆమె రాతలు ఆలోచనాత్మకంగా మళ్ళీ మళ్లీ చదవాలనిపించేలా ఆకట్టుకుంటాయి. అనుబంధాల్ని అక్షరబద్ధం చేసే తాను తన మాతృమూర్తి కుమారి పేరులోని 'శ్రీ'ని చెంత చేర్చుకున్నారు. అందుకే గీతాంజలిశ్రీగా పిలిపించుకోవడానికే ఎంతగానో ఇష్టపడుతుంటారు. రచనా వ్యాసంగాన్ని అభిమానించే తండ్రి ఇష్టతను పుణికి పుచ్చుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఆయనకు బదిలీలు సహజం కావడంతో, వెళ్లిన ప్రతిచోటా జనజీవన రీతులను గమనించే వారామె. భారతీయ ఇతిహాసాలన్నింటినీ ఇంటాబయటా చదుకున్న నేపథ్యం. మన సంస్కృతిని మనమే మహోన్నతంగా గౌరవించి, ప్రపంచమంతటికీ చాటి చెప్పాలన్న అభిమతం. అన్నింటికన్నా మిన్నగా చరిత్రను ప్రేమించారు. తాను ఉంటున్న ఢిల్లీలోని విశ్వ విద్యాలయం నుంచే చరిత్రాంశంలో పట్టభద్రులయ్యారు. అంతటితో ఆగలేదు. బరోడా యూనివర్సిటీ ద్వారా హిందీలో డాక్టరేట్ చేశారు. హిస్టరీ పైనే ఎందుకింత మక్కువ అని అడిగితే...'ఏ భాష పూర్వాపరాలు తెలియాలన్నా చరిత్రే మూలాధారం కాబట్టి' అంటూ బదులిచ్చారు. అదీ ఆమె పరిపూర్ణత, పరిణత తత్వం.

**అతివ మనోగత సూచిక**


ఆంగ్ల మాధ్యమంలో చదివినందున, హిందీని ఎంచుకునే అవకాశం ఆమెకి లేదు. అందుకే ఢిల్లీ, బరోడా వర్సిటీలతో విద్యానుబంధం సాగించారు. చరిత్ర సంపూర్తి అవగాహన, హిందీ సాహిత్యానురక్తి జోడై తన కలాన్ని కదం తొక్కించాయి. పదుల సంఖ్యలో కథలు, అనేక నవలలు ఒకటొకటిగా వెలువడ్డాయి. చాలామటుకు ఆంగ్లంతో పాటు జర్మన్, ఫ్రెంచి, కొరియన్ తదితర విదేశీ భాషల్లోకి అనువాదమయ్యాయి. 'ఇసుక సమాధి' నవల రాసి దరిదాపు నాలుగేళ్లు. ఆంగ్లానువాదం గత ఏడాదిలో అయింది. అదే రచనకు మునుపు మరెన్నో అవార్డులు లభించినా, ఈసారి అందుకుంది శిఖరాగ్ర పురస్కారాన్ని. లండన్ ప్రత్యేక సదస్సులో స్వీకరించిన గీతాంజలిశ్రీ అందరి కరతాళ ధ్వనుల మధ్య 'కలమే నా బలం' అని ప్రకటించారు. అనువాదకురాలిని చూసి మాట్లాడటం ఇదే ప్రథమమంటూ వినమ్ర సహిత కృతజ్ఞతలందించారు. పురస్కృత రచన ముందు వెనుకలను విశదీకరిస్తూ–'స్త్రీగా సాటివారిని బాగా అర్థం చేసుకున్నా. వారి మనోగతాన్ని నాదిగా చేసుకున్నా. దీన్ని ఏ వాదమంటారో నాకైతే తెలియదు. మానవతను మించిన వాదం, విధానం ఇంకేముంటాయి చెప్పండి? నా నవలలో నాయిక బాల్యమంతా భారత్–పాకిస్థాన్ విభజన సమయం భావాలతో నడుస్తుంది. దేశ విభజనసమస్యల తీవ్రత, పలురకాల పరిణామాల పరంపర, సంప్రదాయాల వైరుధ్యం, అంతర్గత–బాహ్య సంఘర్షణల వెల్లువ.. వీటన్నింటి నడుమ భిన్న భావనలు, విభిన్న అనుభవాలు




ఎదురవుతాయి. అలా అని ఆ ప్రభావంతో తీవ్రతర పదజాలం వాడకుండా, వాతావరణ వేడిని మరింత పెంచకుండా, సమరస స్ఫూర్తిని జతపరుస్తూ బతుకు చిత్రాన్ని చదువరుల ముందుంచాను' అని వివరించారు. పాక్ వెళతానని ఇంట్లో వాళ్ళకు తెగేసి చెప్పిన స్త్రీ మూర్తి తదనంతర కాలంలో తనయ, భార్య, తల్లిగా తన స్థితిగతుల్ని విశ్లేషించుకుంటుంది. అనూహ్య రీతిలో భర్త దూరమవడంతో మానసిక ఆందోళనల మధ్య నలగిపోతుంది. తనూ తిరిగిరాని తీరాలకు తరలి వెళ్లాలని నిర్ణయించుకుంటుంది. ఒక్కుమ్మడిగా విరుచుకుపడిన స్థితిగతుల తాకిడి నుంచి తనకు తాను ఏ విధంగా బటపడిందన్నదే నవలాంశం. 'కొత్త జీవితాన్ని ఎలా ఆరంభించిందో విపులీకరిస్తూ రాశానీ పుస్తకాన్ని. మీరు ఎప్పుడైనా గమనించారా? వృద్ధుల్లో కొందరు గోడవైపు మొహం పెట్టి పడుకుంటారు. అంటే, వెన్ను చూపుతుంటారు. జీవితానికి కూడానా అనిపిస్తుంది నాకు. అటువంటి ఆలోచనల, ఫలితాల, ప్రభావాల విపులీకరణతో రసస్ఫూర్తివంతంగా రాసినందుకే ఈ పురస్కారం వచ్చిందనిపిస్తుంది!'అన్న రచయిత్రి మాటలే ఆమె అంతరంగ తరంగాల్ని మనముందు ఉంచుతాయి. 'అవార్డు కోసం రాయను, రాసినందుకు వస్తే సంతోషించకుండా ఎలా ఉండనూ?' అంటున్న ఆమెలో ఆచరణవాది కనిపిస్తారు. ఎనభై సంవత్సరాల వృద్ధురాలిలోని బాల్య యౌవన కౌమార దశలను విశ్లేషించడంతో చారిత్రక సదవగాహన ప్రతిబింబిస్తుంది. చరిత్రనీ, వర్తమానాన్నీ భవితను తేరిపార చూడగల తన దృక్పథం అసమానంగా తోస్తుంది. 'ఇసుక సమాధి' అని పేరు పెట్టడంలో ఎన్నెన్ని జీవితానుభవాలు ఇమిడి ఉన్నాయో చూసిన మనసు ఒక అలౌకిక అనుభూతికి లోనవుతుంది.

**ప్రతి రోజూ జేజేలు**

అన్నట్లు, జూన్ 12నే గీతాంజలిశ్రీ పుట్టినరోజు. ఇప్పుడామెకు 65 ఏళ్ళు. ఐదో నవలకు వచ్చిన ఖండాంతర ఖ్యాతి అపూర్వం, అపురూపం. ఏది రాసినా చారిత్రక దృక్పథం ఉండాలి. వర్తమానం ప్రతిఫలించాలి. భవిష్యత్తును చూడగలగాలి. సమస్యల జాబితా కాక వాటిని పరిష్కరించుకునే దిశను పరితలకు చూపగలగాలన్నదే ఈ మహారచయిత్రి కలం చెబుతున్న పాఠం. ఇటువంటి సాహితీవేత్తలకే ఎక్కడైనా, ఎప్పుడైనా జన నీరాజనాలు. ఇదే నిత్యసత్యం. చరిత్రాత్మక వాస్తవం. ★



**సాక్షి తాంబూలం**

ఆరె కులం వారి వివాహ పద్ధతులు వివరిస్తూ డా॥ బిట్టు వెంకటేశ్వర్లు "తోలు బొమ్మలాటల ప్రదర్శనం" అనే గ్రంథంలో సాక్షి తాంబూలం గురించి కొన్ని వివరాలు రాశారు: "ఏ తెగవారు ఆ తెగలోనే పెండిండ్లు చేసుకుంటారు. నిశ్చయమైన సమయానికి వరుడు లేకపోతే పిల్లవాడి వస్తువేదయినా పెండ్లిపీటల మీద పెట్టి తలంబ్రాలు పోస్తారు. ముఖ్యంగా కత్తికి పోస్తారు. శివాజీకి వారసులం అని, అందువల్ల అట్లా పోయడం ఆచారం అని చెప్పుకుంటారు. ముందుగా సాక్షి(నిశ్చయ) తాంబూలం పెట్టుకుంటారు. కులం వారందరిని పిలిచి భోజనం పెట్టి కంచు పళ్లెం మీద గాని, గంటమీద గాని మోగిస్తే ఫలానా వాళ్ల పిల్లను, ఫలానా వాళ్ల పిల్లవాడు చేసుకుంటున్నాడని అర్థం. ఒక పీటమీద దుప్పటి పరచి, దాన్ని ఆ ప్రదేశం మధ్యలో పెట్టి దానిమీద తాంబూలం పెట్టి, దాని చుట్టూ అంతా కూర్చున్న తర్వాత ఇట్లా కొడతారు, దానికి అంతా అంగీకారం తెలుపవలసి ఉంటుంది. అంతేకాదు, మేనరికం వారున్నట్లైతే అభ్యంతరం అప్పుడే చెప్పాలి.. తర్వాత తాంబూలం అందరికీ పంచుతారు". ఇక్కడ తాంబూలాన్ని ఈ వివాహ ఒప్పందానికి సాక్షిగా పరిగణిస్తారు.

వరంగల్లు దగ్గర కొండపర్తి అనే ఊళ్లో చెరువు దగ్గర ఒక శాసనం దొరికింది. అందులో "తాంబుల ద్రవంబు చేసిన" అనే పదం ఉంది. ఒక పనికి ఇరుపక్షాల వారు తాంబూలం తీసుకొని ఒప్పుకొని ఒక కట్టడి చేసుకోవడం అని దీనికి అర్థం. తాంబూల ద్రవం చేయడం అంటే నోరంతా తాంబూల రసం నిండేలా తాంబూలాన్ని నమలడమే! తాంబూలాన్ని సాక్షిగా పెట్టుకోవటం అంటే ఆషామాషీ కాదు. అగ్నిసాక్షి ఎంత బలమైనదో తాంబూల సాక్ష్యమూ అంతే.

**వీర తాంబూలం**

ఆరుద్ర రాసిన కాటమరాజు నాటకంలో ఒక సన్నివేశం ఉంది. మనుమసిద్ధితో రణతిక్కన తనకు వీరతాంబూలం ఇప్పిస్తే కాటమరాజును బంధించి పుల్లరితో సహా తెస్తానన్నప్పుడు కన్నమనీడు "కరణాలదేవూరు–కయ్యమేవూరు. మీలాంటి వాళ్లకి చదవడం, వ్రాయడం సంప్రదించడం లెక్కించడం సరైన కార్యాలు, కదనమన్న ఊసే మదిలోనికి రానీయకండి" అని ఈసడిస్తాడు. అప్పుడు రణ తిక్కన తండ్రి సిద్ధన్నమంత్రి గతంలో తమ విజయాలను ఏకరవుపెట్టి, "...అంతటి సేవణ దండయాత్రనే అరచేత నాపిన వంశం మాది, ఈ కాటమరా జొకలెక్కా! తబుకుతో తాంబూలమిప్పించండి" అని, తన కొడుకుని యుద్ధానికి పంపి తనకు గల రాజభక్తి ప్రదర్శిస్తాడాయన.

దానికి స్పందించిన మనుమసిద్ధి ''వీర తాంబూలం స్వీకరించండి. జగజంపు గొడుగుల నీడలో వెల్ల చామరాలు విసిరించుకుంటూ వెళ్లండి. చాగలకొండ– అదే మనకు అండదండ" అంటూ వీరతాంబూలం ఇస్తాడు. వీరతాంబూలం అంటే బాధ్యతను అప్పగించటం. వీరతాంబూలం పుచ్చుకోవటం అంటే బాధ్యతను నెరవేర్చుకొస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు.

**నాన్ వెజ్ తాంబూలం**

తాంబూలం శుద్ధ శాకాహార ద్రవ్యాలతో కూడినదని మనం నమ్ముతాం. కానీ మనకు తెలీకుండానే మాంసాహారానికి సంబంధించిన ఒక ద్రవ్యం తాంబూలంలో చేరిపోతోంది. దాని గురించి ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్ర చరిత్రలో రాశారు "బెంగాలీయులంతా తాంబూలంలోకి గుల్లసున్నం వేసుకొంటారు. యీ విషయాన్ని గురించి ఒక దినము బంగాళీవాడు మీ దేశములో బ్రాహ్మణులు మత్స్య భక్షణ చేయడము లేదంటిరే, గుల్లసున్నము తాంబూల చర్వణముతో తిన డములేదా" అని అడిగాడు. గుల్లసున్నం అంటే నత్తగుల్లలను పుటం బెట్టి చేసిన భస్మం. నత్తగుల్లలు నత్తల శరీర భాగమే కదా! ఇన్నాళ్లూ తాను గుల్ల సున్నం వేసుకోవటం ద్వారా పరోక్షంగా మాంసాహార భక్షణం చేసినట్టే అయ్యింది కదా...అని వ్యాకుల పడ్డారాయన!

**రాత్రి తాంబూలం**

*"తాంబూలరాగాల ప్రేమామృతం తమకించి సేవించు తరుణం*

*శృంగారశ్రీరామచంద్రోదయం ప్రతిరేయి వైదేహి హృదయం"*

ప్రతీ రోజూ రాత్రి అమ్మవారు తాంబూలంలో ప్రేమామృతం కలిపి అందిస్తుంటే రేయిలో "శ్రీరామ చంద్రుడు" ఉదయిస్తున్నాడట. సినీకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు రాసిన గొప్ప గేయం ఇది. తాంబూలంలో ప్రేమామృతం రంగరించి ఇస్తే ప్రతి స్త్రీకీ పతి శృంగార రూపం రామచంద్రుడిలా గోచరిస్తుందనేది అంతరార్థం. ఆమె హృదయంలో అతను, అతని హృదయంలో ఆమె రూపాలను ఉదయింప చేయటమే రాత్రి తాంబూల లక్ష్యం. "శ్రీరాముడు రసవేదం, శ్రీజానకి అనువాదం. ఏనాడు వీడిపోని బంధం'' అనేవి ఆయన అమృతవాక్కులు.

సుమతీ శతకకారుడు తాంబూలం ఇచ్చే సమర్థత గురించి ఒక పద్యం చెప్పాడు:

**"పలుదోమి సేయు విడియము/తలగడిగిననాటి నిద్ర తరుణులయెడలం బొలయలుక నాఁటి కూటమి/వెలయింతత్ని చెప్పరాదు వినురా సుమతీ"** పళ్లు తోముకుని వేసుకున్న తాంబూలం,

తలంటుకున్న రోజున పగటినిద్ర, ప్రణయకోపం వచ్చిన నాటి సంభోగం చాలా సుఖంగా ఉంటాయి.



**ఆడ తాంబూలం-మగ తాంబూలం**

ప్రవరుణ్ణి వరూధినినీ కలిపింది తాంబూలమే! దారితప్పి పోతున్న ప్రవరుడికి ఓ సువాసన సోకింది. దాన్ని బట్టి దూరంగా ఎక్కడో ఒక స్త్రీ ఉన్నదని గ్రహించాడతను. ఆడమనిషి పొలువు తెలిపే గాలి అతనికి సోకిందట. ఆ పరిమళం ఎక్కడిదో వెదుకుతూ వెడితే వరూధిని అతని కంటపడింది. ఆ తరువాత అతన్ని ఆమె వలచి వెంటపడటం, అతను తప్పించుకోవటం , ఓ గంధర్వుడు డూప్లికేట్ ప్రవరుడిగా రావటం ఈ కథంతా అందరికీ తెలిసిందే! వరూధిని పరిమళభరిత తాంబూలం వేసుకోకపోతే హిమాలయాల్లో దారి తెలీక దిక్కుతోచక తిరిగే ప్రవరుడికి వరూధిని ఎక్కడుందో తెలిసేది కాదు. తాంబూలం ఆ ఇద్దరి కథనే మలుపు తిప్పింది.

***"మృగమద సౌరభ విభవ/ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీ గంధ/స్థగితేతర పరిమళమై/మగువ పొలుపు దెలుప నొక్క మారుత మొలసెన్"*** 'స్త్రీవీటి' అంటే స్త్రీలు వేసుకునే తాంబూలంలో "మృగమద

సౌరభ విభవ ద్విగుణిత ఘనసారం” ఉంటుంది. అంటే, కస్తూరి రెండు పాళ్లయితే పచ్చకర్పూరం ఒక పాలన్న మాట. మగవాళ్ళు వేసుకొనే తాంబూలంలో కస్తూరి ఒక పాలు కర్పూరం రెండుపాళ్లు ఉంటాయి. కస్తూరి లైంగికవాంఛని రెచ్చగొట్టేదిగాను, కర్పూరం పునస్సమాగమానికి పురికొల్పేదిగాను ఉంటాయి. అందుకని స్త్రీలు కస్తూరి ఎక్కువగా, పురుషులు పచ్చకర్పూరం ఎక్కువగా ఉండేలా తాంబూల సేవన చేస్తారు. అంతేకాదు ఎక్కువ కస్తూరితో తాంబూలం వేసుకుంటే పురుషుల్లో శీఘ్ర స్ఖలనం ఏర్పడుతుందనే నమ్మకం కూడా ఉంది. అది స్త్రీలకు వర్తించదు. అందుకని స్త్రీ తాంబూలం కస్తూరి సువాసన వెదజల్లేదిగా ఉంటుంది. దాన్ని నమిలేది ఆడదో మగాడో చెప్పగలిగాడంటే ఆడతాంబూలం, మగతాంబూలం పరిమళాలు వేర్వేరని, ఆడ తాంబూలం వాసన భిన్నంగా ఉంటుందనీ, ఈ భేదం ఆ కాలంనాటి రసికులకు మాత్రమే తెలుసు! ప్రవరుడు ఏకపత్నీవ్రతుడే గానీ అరసికుడని పెద్దనగారు చెప్పలేదు. ప్రవరుడి భార్య గుంగెడు అన్నాన్ని వొంటి చేత్తో వండి వార్చగల దిట్టే అయినా భర్తను మురిపించగల నాయికే! ప్రవరుడు ఏకపత్నీవ్రతుడు కాగలగటమే అందుకు సాక్ష్యం.

***“అతడావాత పరంపరా పరిమళ వ్యాపారలీలన్ జనాన్వితి మిచ్చోటని చేరఁబోయి కనియెన్ విద్యుల్లతా విగ్రహన్***
***శతపత్రేక్షణఁ జంకరీకచికురన్ జంద్రాస్యఁ జక్రస్తనిన్ నతనాభిన్ నవలా నొకనొక మరున్నారీ శిరోరత్నమున్.”***

అతడు చల్లటి పిల్లతెమ్మెరల మీదుగా అలలు అలలుగా వస్తూన్న ఆ తాంబూల పరిమళాన్ని బట్టి వెదుకుతూ ముందుకు కదలగా, ఎదురుగా ‘మెఱుపుతీగ లాంటి యువతి, విరబూసిన పువ్వుల్లాంటి కళ్లతో, తుమ్మెదలు దండు తీరాయా అన్నట్టున్న పొడవైన నల్లటి కురులతో, అందంగా వెలిగిపోతున్న మోముతో, గర్వంగా వంపుదిరిగిన వక్షోజాలతో వళులు తిరిగిన లోతైన నాభి కలిగి మరోలోకం నుంచి దిగివచ్చిందా అనిపించే ఆ వనితామణి వరూధినిని చూశాడు. అలా తాంబూలం ప్రవరుణ్ణి, వరూధిని కలిపింది.

యయాతి కథలో కూడా శర్మిష్ఠ తన భర్తకు తాంబూలం చేసి ఇమ్మని దేవయానిని ఆదేశిస్తుంది. ఆమె చేసిచ్చిన తాంబూలం యయాతికి బాగా నచ్చింది. తాంబూలం చుట్టిన వారి ప్రేమ ఎంత ఎక్కువగా ఉంటే దాన్ని తినేవారి నోరు అంత ఎర్రగా పండుతుందంటాడు యయాతి. శర్మిష్ఠ చేతి తాంబూలం కోసం యయాతి మహారాజు వెంపర్లాడి పోతాడు. ఇలా తాంబూలం ఆ ఇద్దరినీ దగ్గర చేసింది.


**సఖీతాంబూలం**

తాంబూలాన్ని ‘సఖి’ అన్నవాడు వరాహ మిహిరుడు. బృహత్సంహితలో “తాంబూలస్య సఖే త్రయోదశగుణా స్స్వర్గేపి తే దుర్లభాః” అంటే తాంబూల సఖికి 13 గుణాలున్నాయని, స్వర్గంలో కూడా అది దొరకదనీ తాంబూల ప్రశస్తిని వివరిస్తాడు.

**ఏ రుతువుకా తాంబూలం**

చలికాలం: శీతకాలంలో చలిని తట్టుకోవటానికి శొంఠి తాంబూలం, అగరు ధూపము, గొంగళ్ళు, మందపాటి దొడ్డుబట్టలు వాడేవారని వేంకటనాథుని పంచతంత్రం చెప్తోంది. అరికకూడు, పుచ్చవరుగు, ఆవులవెన్న, మజ్జిగసద్ది తిని పొలాలు దున్నటానికి పోయేవారట!

వేసవితాంబూలం: రుతుసంహారం (5-5) కాళిదాస మహాకవి ఏసీలు తెలీని ఆ కాలంలో గ్రీష్మ రుతువులో స్త్రీలు తాపాన్ని తట్టుకోవటానికి ఏం చేశారో ఇలా వర్ణిస్తున్నాడు: **“గృహీత తాంబూల విలేపన స్రజః సుఖాసవామోదిత వక్త్రపంకజాః ప్రకామకాలాగురు ధూపవాసితం విశ న్తి శయ్యాగృహముత్సుకాః స్త్రీయః”**: కర్పూర తాంబూలం వేసుకుని గంధ మాల్యాదులతో లేపనం చేసుకుని






**కళారత్న డా॥ జి.వి. పూర్ణచందు**
**9440172642**

ఒంటికి పూసుకుని, పుష్పమాలలు ధరించి, ఆసవం అంటే కల్లు లేదా ద్రాక్షసారాయి (వైన్ లేదా బీరు) తాగితే తాంబూల పరిమళంతో ఈ ఆసవం వాసన కూడా మిళితం అయి, కాలాగురు ధూపం వేసిన శయ్యా గృహం (పడగ్గది)లోకి తొందర తొందరగా ప్రవేశిస్తున్నారట. వేసవి తాపం తట్టుకోవటానికి స్త్రీలు వేసవి తాంబూలం సేవించారంటాడు కాళిదాసు.

**సార్వకాలిక తాంబూలం:** వీటికా సేవనం అంటే తాంబూలం వేసుకోవటం అనేది శ్రీనాథ యుగం లోనూ రాయల యుగంలోనూ చాలా గౌరవప్రదమైన అలవాటు. ప్రవరుడంతటి నిష్ఠాగరిష్ఠుడు కూడా “మృగమదసౌరభవిభవ ద్విగుణిత ఘనసార సాంద్రవీటీ” ఏ రకం

తాంబూలానికి ఏ రకమైన పరిమళం ఉంటుందో. ఏ ద్రవ్యాన్ని ఏ తాంబూలంలో ఎంత వేస్తే ఎలాంటి పరిమళం వస్తుందో బాగా తెలిసినవాడే!

మహాశివభక్తులైన “జంగములు” సార్వకాలిక తాంబూలాన్ని సేవించేవారట. “సార్వకాలిక తాంబూల చర్వణార్ద్రరాగ సౌభాగ్యమున పద్మ రామణుల దృణముగా జూచు దంతపంక్తులతో పొరాడుతున్నట్టు కవి ప్రయోగాలున్నాయి. సార్వకాలిక తాంబూలం అనేది ఎలాంటి పరిమళ ద్రవ్యాలు చేరకుండా ఆకు, వక్క, సున్నం కలిసిన సాదా తాంబూలం కావచ్చు. దేవుడికి సమర్పించే పండు తాంబూలం లాంటిదే ఇది. దేవుడికి కప్పురవిడెములు నివేదన పెట్టరు కదా! సార్వకాలీన తాంబూలం ఆర్ద్రరాగసౌభాగ్యప్రదం. సర్వకాల సర్వావస్థల్లోనూ అందరూ వేసుకోదగినది.

ఉత్తరాదివారు పితృకార్యాలప్పుడు కూడా తాంబూల సేవన చేస్తారని ఏనుగుల వీరాస్వామిగారు తన కాశీయాత్ర చరిత్రలో ఆక్షేపించారు. కానీ, అది సార్వకాలీన తాంబూలం అయితే ఉత్తరాదివారికి అభ్యంతరం ఉండకపోవచ్చు. మనకు తాంబూలం భోంచేశాక మాత్రమే వేసుకునే అలవాటు. తాంబూలం వేసుకున్నారంటే భోంచేసేశారని అర్థం. ఉత్తరాదివారికి సార్వకాలీన తాంబూలం విషయంలో అలాంటి పట్టింపు లేదేమో!

**(సమాప్తం)**

# క్వాడ్‌లో భారత్ అద్భుత

జపాన్, యూఎస్, ఇండియా, ఆస్ట్రేలియాలతో కూడిన క్వాడ్ (క్వాడ్రిలేట్రల్ సెక్యూరిటీ డైలాగ్) అధినేతలు గత రెండేళ్ల కాలంలో సమావేశం కావడం ఇది నాలుగోసారి. గత కొన్నేళ్లుగా క్వాడ్ దేశాలతో చైనా ద్వైపాక్షిక సంబంధాలు గణనీయంగా తగ్గుముఖం పట్టడం గమనార్హం. తాజా క్వాడ్ సమావేశానికి ప్రధాని నరేంద్రమోదీ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్‌బెనీస్, జపాన్ ప్రధాని ఫ్యుమివొ కిషిదా హాజరయ్యారు. ఈసారి క్వాడ్ సమావేశం ఉమ్మడి ప్రకటనలో భారత్ దౌత్య పటిమ మరోసారి రుజువైంది. ముఖ్యంగా రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మనదేశ వైఖరిని స్పష్టం చేయాలని అమెరికా సహా భాగస్వామ్య దేశాలు పట్టుపడతాయని, ఇది ఒకరకంగా ఇరకాట పరిస్థితేనని భావించిన వారికి ఉమ్మడి ప్రకటన ఆశ్చర్యం కలిగించి ఉండవచ్చు. సీమాంతర ఉగ్రవాదం, 26/11 దాడులు, పఠాన్‌కోట్ ఉగ్రదాడి అంశాలు ఉమ్మడి ప్రకటనలో చోటుచేసుకోవడం భారత్ ప్రాధాన్యాన్ని చెప్పకనే చెబుతున్నాయి. అన్నింటికి మించి రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో భారత్ వైఖరిని అమెరికా సహా ఇతర దేశాలు ప్రశంసించడం తిరుగులేని మన దౌత్యవిజయానికి నిదర్శనం.

ఇటీవలి కాలంలో చైనా తన నేవీ బలోపేతానికి పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడం, సాల్మన్ దీవులతో భద్రతాపరమైన ఒప్పందం కుదుర్చుకోవడం ఆస్ట్రేలియాను తీవ్రంగా ఇబ్బంది పెట్టే అంశం. సాల్మన్‌దీవులతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా చైనా నేరుగా ఆ దీవుల్లో తన యుద్ధ నౌకలను నిలుపవచ్చు. అదేవిధంగా దీవుల్లో సామాజిక భద్రతను కాపాడటంలో అక్కడి ప్రభుత్వానికి సహకరించవచ్చు. తరచుగా చైనా నేవీ తన సముద్ర జలాల్లోకి చొరబాట్లు జరుపుతుండటం జపాన్‌కు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తన ప్రయోజనాలను కాపాడుకునేందుకు యూఎస్ ఇండో-పసిఫిక్ ఎకనామిక్ ఫ్రేమ్‌వర్క్ (ఐపీఈఎఫ్)ను ఏర్పాటు చేసింది. అమెరికా నేతృత్వంలోని ఈ ఫ్రేమ్‌వర్క్‌లో మొత్తం 13 దేశాలున్నాయి. ఈ దేశాలు వరుసగా అమెరికా, ఆస్ట్రేలియా, బ్రూనై, దారుస్సలాం, ఇండియా, ఇండొనేసియా, జపాన్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, మలేసియా, న్యూజిలాండ్, ఫిలిప్పైన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం. వాషింగ్టన్‌లో ఇటీవల ఆసియన్ దేశాలతో బైడెన్ సమావేశమైన నేపథ్యంతో ఇది ఏర్పాటైంది.

ఏ రూపంలో ఉన్నా ఉగ్రవాదం ఖండనార్హమేనని క్వాడ్ దేశాలు మే 24న ఉమ్మడి ప్రకటనలో కుండబద్దలు కొట్టాయి. యుఎన్ఎస్‌సీ 2593 (2021) తీర్మానం ప్రకారం మరే ఇతర దేశాన్ని బెదిరించడానికి లేదా ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడానికి లేదా మద్దతు ఇవ్వడానికి లేదా ఉగ్రదాడులకు ఆర్థిక సహాయం అందించేందుకు ఆఫ్ఘనిస్తాన్ భూభాగాన్ని ఉపయోగించుకోవడానికి వీల్లేదని స్పష్టంచేశాయి. సీమాంతర ఉగ్రవాదాన్ని 26/11, పఠాన్‌కోట్ ఉగ్రదాడులను తీవ్రంగా ఖండించాయి. ముఖ్యంగా ఇది పాకిస్తాన్‌కు హెచ్చరిక. ఎఫ్ఏటీఎఫ్ సిఫారసుల మేరకు ఉగ్రవాదానికి ఆర్థిక సహాయాన్ని అందించడానికి వ్యతిరేకంగా ఇతర దేశాలు పోరాడాలని పిలుపునిచ్చాయి. ఆసియన్ దేశాల ఐకమత్యానికి మద్దతు ప్రకటించాయి. యుఎన్ కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ ది సీ (యుఎన్‌సీఎల్ఓఎస్)లో పేర్కొన్న ప్రకారం అంతర్జాతీయ చట్టాలను అమలుపరచే విషయంలో క్వాడ్ దేశాలు కృషి చేయాలని పేర్కొన్నాయి. ఇది చైనాకు హెచ్చరిక. తూర్పు, దక్షిణ చైనా సముద్రాల్లో కూడా స్వేచ్ఛావాణిజ్యానికి ఏవిధమైన ఆటంకాలు



## నేపథ్యం

2004, డిసెంబర్‌లో హిందూ మహా సముద్రంలో సంభవించిన భూకంపం, సునామీకి దారితీసింది. దీన్నే 'బాక్సింగ్ డే సునామి' అని కూడా అంటారు. ఈ సునామీ సందర్భంగా దెబ్బతిన్న దేశాలకు సహాయం అందించడానికి నాలుగు దేశాలతో ఇండియా, ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా ఏర్పడిన సునామి అడ్‌హాక్ కోర్ గ్రూపు ప్రస్తుత 'క్వాడ్'కు పూర్వరూపం. 2007లో అప్పటి జపాన్ ప్రధాని షింజో అబే 'క్వాడ్రిలేట్రల్ సెక్యూరిటీ డైలాగ్' లేదా 'క్వాడ్రిలేట్రల్ ఇనిషియేటివ్' ఏర్పాటుకు ప్రతిపాదించారు. అప్పటినుంచి భారత్.. జపాన్, ఆస్ట్రేలియా, అమెరికాలతో బహుముఖ చర్చలు జరుపుతూ ఇందులో భాగస్వామి అయింది. 'డెమొక్రటిక్ పీస్' (ప్రజాస్వామిక శాంతి) భావనతో ఈ నాలుగు దేశాల మధ్య ఏర్పడిన రక్షణ ఏర్పాటు ఘనత మాత్రం షింజో అబేకి దక్కుతుంది. మధ్య ఆసియా, మంగోలియా, ఆగ్నేయాసియా, కొరియన్ ద్వీపకల్పాలను కలుపుతూ 'ఆసియన్ ఆర్క్ ఆఫ్ డెమొక్రసీ' ఏర్పాటు చేయాలన్నది ఈ క్వాడ్రిలేట్రల్ ఆర్క్ ప్రధాన లక్ష్యం. నిజానికి ఈ ఆర్క్‌లోకి వచ్చే దేశాలన్నీ చైనా చుట్టూ సరిహద్దుగా ఉన్న దేశాలే! చైనా అనుకూలురు దీన్ని 'యాంటీ చైనా మూవ్' అని పేర్కొంటే, చైనా వ్యతిరేకులు 'డెమొక్రటిక్ ఛాలెంజ్' అని వ్యవహరిస్తారు. భారత్ క్వాడ్ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చింది. ముఖ్యంగా సభ్య దేశాల మధ్య నౌకా విన్యాసాలు విస్తృతంగా చేపట్టడమే కాదు, భారత్-జపాన్‌ల మధ్య అంతకుముందు పెద్దగాలేని సంబంధాలు బలోపేతమయ్యాయి. అప్పటి అమెరికా అధ్యక్షుడు బుష్ అనుసరించిన విధానాలు, ముఖ్యంగా భారత్‌తో పెంచుకున్న స్నేహం చైనాకు ముకుతాడు వేయడానికే అన్న అభిప్రాయాన్ని కలిగించింది. ఈ నేపథ్యంలో అప్పటి ప్రధాని మన్మోహన్, చైనా ప్రధాని విన్ జియాబావోతో, ఆ దేశ అధ్యక్షుడు హు జింటావోతో చర్చలు జరిపిన తర్వాత ఒక్కసారిగా భారత్ వైఖరి మారిపోయింది. చైనాకు వ్యతిరేకంగా ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొనేది లేదని మన్మోహన్‌సింగ్ స్పష్టం చేశారు. దీంతో క్వాడ్ కార్యకలాపాలు మందగించాయి. క్వాడ్‌పై చైనాకు పెరుగుతున్న ఆగ్రహం నేపథ్యంలో అప్పటి ఆస్ట్రేలియా ప్రధాని కెవిన్ రూడ్ కూడా వెనకడుగు వేశారు. ఆస్ట్రేలియాకు చైనా ఆర్థిక భాగస్వామి కావడం వల్ల కెవిన్ క్వాడ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

2017 నవంబర్‌లో జరిగిన ఆసియన్ దేశాల సమావేశం సందర్భంగా అప్పటి జపాన్ ప్రధాని

# దౌత్య విజయం

ఉండకూడదని, అంతర్జాతీయ సముద్ర నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని స్పష్టంచేశాయి. ఈ ప్రాంతంలో యథాతథస్థితిలో మార్పు తీసుకొచ్చే ఏ చర్యలనైనా తీవ్రంగా పరిగణిస్తామని ఉమ్మడి ప్రకటన హెచ్చరించింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఆహారం, విద్యుత్, ఇతర మానవతా సహాయంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్న అంశాన్ని సమర్థించాయి. ఉద్రిక్తతలు తగ్గాలంటే చర్చలు, దౌత్యం మాత్రమే పరిష్కారమని భారత్ మొదటినుంచి చెప్పుకుంటూ వస్తోంది.

**ఐపీఎండీఏ ఏర్పాటు**

ఇండో–పసిఫిక్ పార్ట్‌నర్‌షిప్ ఫర్ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్ (ఐపీఎండీఏ) ఏర్పాటును క్వాడ్ దేశాలు స్వాగతించాయి. దీని ఏర్పాటు వల్ల పసిఫిక్ ద్వీపాలు, ఆగ్నేయాసియా, ఇండో ఆసియన్ ప్రాంతాల్లోని దేశాలకు ఈ ప్రాంత సముద్ర జలాలు, తీరాలను పూర్తిగా పర్యవేక్షించేందుకు వీలు కల్పిస్తుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో విపత్తులు సంభవించినప్పుడు మానవతా సహాయం అందించడం, అక్రమంగా చేపలు పట్టడాన్ని నిరోధించడం వంటి చర్యలకు కూడా ఐపీఎండీఏ వీలు కల్పిస్తుంది. ముఖ్యంగా ఇండో–పసిఫిక్, ఆగ్నేయాసియా, పసిఫిక్ ద్వీపాల్లో సుస్థిరతను, అంతర్జాతీయ నిబంధనల ఉల్లంఘన జరగకుండా, ఈ ప్రాంతంలోని దేశాల్లో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని పరస్పరం పంచుకుంటారు. ఇందుకు అవసరమైన సాంకేతికతను క్వాడ్ దేశాలు సమకూరుస్తాయి. క్వాడ్ దేశాలు ఐపీఎండీఏలో వచ్చే ఐదేళ్ల పాటు 50 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టి దీన్ని మరింత బలోపేతం చేస్తాయి. నిజానికి చైనా తన చుట్టుపక్కల దేశాల ప్రాదేశిక జలాల్లోకి అక్రమంగా చొరబడి చేపలు పట్టడం, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆ దేశానికి చెక్ పెట్టడానికే దీని ఏర్పాటని వేరే చెప్పాల్సిన అవసరం లేదు. దాదాపు దక్షిణ చైనా సముద్ర ప్రాంతం తమదేనని చైనా వాదిస్తోంది. తూర్పుచైనా సముద్రంలో జపాన్ నియంత్రణలోని శంకాకు దీవులు (ఇటీవలి కాలంలో వీటిని దియాయూ దీవులు అని కూడా పిలుస్తున్నారు) కూడా తమవేనని వాదిస్తోంది. ఈ దీవులపై దాడికి దిగితే తాము చూస్తూ ఊరుకునేది లేదని అమెరికా హెచ్చరిస్తోంది. అయితే చైనా పేరు ప్రస్తావించకున్నా, క్వాడ్ దేశాలు పరోక్షంగా తీవ్రంగానే ఆ దేశాన్ని హెచ్చరించాయి. క్వాడ్, ఆసియన్ దేశాలకు చైనాతో ఇప్పటికీ గణనీయమైన వాణిజ్య సంబంధాలున్నాయి. అందువల్ల క్వాడ్ సమావేశం నేరుగా చైనాకు హెచ్చరికలు జారీచేసే పరిస్థితి లేదన్నది గమనార్హం. ఉత్తరకొరియా క్షిపణి పరీక్షలను ఖండించాయి. మయన్మార్‌లో హింసకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చాయి.





**జమలాపురపు విఠల్‌రావు**

క్వాడ్ దేశాలు మే 24న టోక్యోలో సమావేశమవుతుండగానే, చైనా, రష్యాలకు చెందిన నాలుగు ఫైటర్ విమానాలు జపాన్ సమీపంలో విన్యాసాలు చేయడం వివాదం సృష్టించింది. ఇవి ప్రాదేశిక ఉల్లంఘనకు పాల్పడనప్పటికీ గత నవంబర్ నుంచి చైనా, రష్యా విమానాలు ఈవిధంగా జపాన్ సమీపంలోకి చొచ్చుకురావడం ఇది నాలుగోసారని జపాన్ రక్షణశాఖ వెల్లడించింది. అదేవిధంగా సెంట్రల్ జపాన్‌లోని నోటో పెనెన్సులా సమీపంలో ఉత్తర హొక్కాయ్‌డో ప్రాంతంలో రష్యా నిఘా విమానాలు మే 24న సంచరించినట్లు కూడా జపాన్ రక్షణశాఖ ఆరోపించింది. నిజంగా ఇది రెచ్చగొట్టే చర్య అంటూ జపాన్ వ్యాఖ్యానించింది. అయితే చైనాకు చెందిన గ్లోబల్ టైమ్స్ మాత్రం చైనా హెచ్–6కె బాంబర్లు, రష్యాకు చెందిన టియు–95 ఎంఎస్ బాంబర్లు జపాన్ సముద్రం, తూర్పు చైనా సముద్ర ప్రాంతాల్లో రొటీన్ పెట్రోలింగ్ కార్యక్రమాల్లో భాగంగా తమ విధులను నిర్వర్తించాయని ట్వీట్ చేసింది. అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించ లేదని రష్యా కూడా స్పష్టం చేయడం గమనార్హం. ఇక్కడ జపాన్–రష్యాల మధ్య కురిల్ ద్వీపాల విషయంలో వివాదం కొనసాగుతోంది. అదేవిధంగా జపాన్ ఆధీనంలో ఉన్న శంకాకు దీవులు తనవేనని చైనా వాదిస్తోంది. ఈ రెండు వివాదాల నేపథ్యంలో జపాన్‌కు హెచ్చరికగా రష్యా, చైనాలు ఈవిధంగా బాంబర్లను పంపాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మనకు ప్రధాన శత్రువైన చైనా ఈ చర్యకు పాల్పడిందంటే సరే. కానీ ప్రధాని నరేంద్రమోదీ పాల్గొన్న సమావేశం ఒకపక్క జరుగుతుండగానే రష్యా కూడా తన బాంబర్లను ఎందుకు పంపిందనేది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్న.

వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్ట్

షింజో అబె.. భారత్, ఆస్ట్రేలియా, యూఎస్ అధినేతలను చర్చలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ‘ఫ్రీ అండ్ ఇండో–పసిఫిక్’ వ్యూహాన్ని ముందుకు తెచ్చారు. ఈ భావనను మొట్టమొదట ప్రతిపాదించింది అప్పటి యూఎస్ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్. చైనా ‘బెల్డ్ అండ్ రోడ్ ఇనిషియేటివ్’కు ప్రతిగా దీన్ని పరిగణిస్తారు. ఈ సందర్భంగా నాలుగు దేశాల అధికారులు చర్చించి, సైనిక సహకారాన్ని పరస్పరం కొనసాగించాలని నిర్ణయించారు. అప్పుడే దక్షిణ చైనా సముద్రంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యం కూడా చర్చకు రావడం బహుశా అప్పటి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ‘క్వాడ్రిలేట్రల్’ను పునరుద్ధరించాలన్న నిర్ణయానికి వచ్చేలా చేసింది. 2017–19 మధ్యకాలంలో క్వాడ్రిలేట్రల్ ఐదుసార్లు సమావేశమైంది. 2018లో ‘రైసినా’ పేరుతో న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో నాలుగు దేశాలకు చెందిన నేవీ ముఖ్యఅధికారులు పాల్గొన్నారు. ఇది క్వాడ్ భద్రతకు సంబంధించిన మొట్టమొదటి సమావేశం. 2020 మార్చి నెలలో క్వాడ్ సభ్యులు న్యూజిలాండ్, దక్షిణ కొరియా, వియత్నాం ప్రతినిధులతో కొవిడ్–19 మహమ్మారిపై తీసుకుంటున్న చర్యలపై చర్చలు జరిపారు. క్వాడ్ ప్లస్‌గా పేర్కొనే ఈ సమావేశంలో పాల్గొన్న మొట్టమొదటి ఆసియన్ దేశం వియత్నాం. 2021 మే నెలలో జరిగిన సమావేశంలో ఇండో–పసిఫిక్‌తో సంబంధంలేని బ్రెజిల్, ఇజ్రాయిల్ దేశాలు పాల్గొన్నాయి. ఈవిధంగా క్రమంగా ప్రాధాన్యాన్ని సంతరించుకుంటూ, ఒక ప్రాంతీయ గ్రూపుగా విస్తరిస్తున్న క్వాడ్ ‘ఆసియన్ నాటో’గా రూపొందినా ఆశ్చర్యపడాల్సిన అవసరంలేదు. ★

# 180 అడుగుల రామాయణ వస్త్రం



**భాగ్యనగరం :** ధర్మవరం నివాసి జుజారే నాగరాజు చేనేత వృత్తిదారుడు. నేటి తరానికి రామాయణ విశిష్టత తెలియజేయాలనే ఉద్దేశంతో ఆయన 180 అడుగుల వస్త్రంలో 380 ఘట్టాలతో సంపూర్ణ రామాయణ చిత్రాలను రెండువైపులా అంచులలో చిత్రించి, మధ్యలో 'జై శ్రీరాం' అని 13 భాషలలో రాశారు. ఈ వస్త్రం బరువు 16 కిలోలు. అద్దకంలో ఎటువంటి రసాయన పదార్థాలు వాడకుండా సహజ రంగులతోనే నేయడం ఈ వస్త్రం విశిష్టత. దీనిని అయోధ్య రామమందిరానికి ప్రదర్శన నిమిత్తం సమర్పించనున్నారు. దీనిని జుజారే నాగరాజు ఆధ్వర్యంలో ఉమామహేశ్వరరావు, పల్లా సురేంద్ర కలసి నేసారు.

భాగ్యనగర్, అన్నోజిగూడలోని శ్రీ విద్యావిహార్ (ఆర్‌వికె) పాఠశాల ఆవరణలో జరుగుతున్న ఆర్ఎస్ఎస్ ప్రథమ, ద్వితీయ వర్ష సంఘ శిక్షావర్గలో పరమ పూజనీయ సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్ ఈ రామాయణ వస్త్రాన్ని ఆవిష్కరించారు.

కార్యక్రమం అనంతరం నాగరాజు, ఉమా మహేశ్వరరావు మోహన్‌జీని 2 మీటర్ల పొడవు, 44 ఇంచ్‌ల వెడల్పు కలిగి, 13 భాషల్లో 'జై శ్రీరామ్' అని రాసి ఉన్న, 24 రామాయణ చిత్రాలు గల వస్త్రంతో సన్మానించారు. ★




## రాజనాలకు రామ్మోహనరావు స్మారక పురస్కార ప్రదానం



**భాగ్యనగరం :** సమాచార భారతి (తెలంగాణ) ఆధ్వర్యంలో (మే 8) ప్రపంచ పాత్రికేయ దినోత్సవం, దేవర్షి నారద జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ రాజనాల బాలకృష్ణ వడ్లమూడి రామ్మోహనరావు స్మారక పురస్కారానికి ఎంపికయ్యారు. వ్యక్తిగత కారణాల వల్ల నాటి కార్యక్రమానికి ఆయన హాజరు కాలేదు. సమాచార భారతి కమిటీ సభ్యులు వేదుల నరసింహం, కోశాధికారి పి. రాఘవేంద్రశర్మ మే 28న బాలకృష్ణ నివాసానికి వెళ్లి ఆయనను సత్కరించి, పురస్కారం అందజేశారు. రాజనాల గత నలభై సంవత్సరాలుగా పత్రికా రంగంలో సేవలందిస్తున్నారు. ★

## షాద్‌నగర్‌లో ప్రాథమిక శిక్షా వర్గ

**షాద్‌నగర్ :** షాద్‌నగర్‌లోని ఇండియన్ హైట్స్ స్కూల్‌లో మే 18 నుండి 25 వరకు ప్రాథమిక శిక్షా వర్గ జరిగింది. ఈ వర్గలో పాలమూరు విభాగ్ (పాలమూరు, వనపర్తి, నాగర్‌కర్నూల్, అనంతగిరి జిల్లాల) నుండి 74 మంది పాల్గొన్నారు. దీనితో పాటు ఘోష్ వర్గ కూడా జరిగింది. ఇందులో 52 మంది ఘోష్ వాదకులు పాల్గొన్నారు. మే 24 సాయంత్రం జరిగిన సార్వజనిక ఉత్సవంలో విభాగ్ సంఘచాలక్ ఏమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రాంత సహ కార్యవాహ డా॥ అన్నదానం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ★






# ఐపీఎల్ నయా చాంపియన్ గుజరాత్ టైటాన్స్

ప్రపంచ క్రికెట్ అభిమానుల వేసవి వినోదం ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్)లో దిగ్గజ జట్లు ముంబై ఇండియన్స్, చెన్నై సూపర్‌కింగ్స్‌ల ఆధిపత్యానికి తెరపడింది. అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా ముగిసిన 15వ సీజన్ విజేతగా గుజరాత్ టైటాన్స్ నిలవడంతో సరికొత్త చరిత్రకు తెరలేచింది. టాటా ఐపీఎల్ 15వ సీజన్ టైటిల్‌ను గెలుచుకోవడం ద్వారా గుజరాత్ టైటాన్స్ రికార్డు సృష్టించింది. అరంగేట్రం సీజన్లోనే అంచనాలను మించి రాణించిన రెండో జట్టుగా రికార్డుల్లో చేరింది.

మొత్తం 10 జట్లు, 70 మ్యాచ్‌లు, 7 వారాల ఈ లీగ్ పోరులో తొలిరౌండ్ నుంచి టైటిల్ సమరం వరకూ గుజరాత్ టైటాన్స్ దూకుడుగా ఆడుతూ, నిలకడగా రాణించడం ద్వారా అత్యుత్తమ జట్టుగా నిలిచింది. లీగ్ దశ 14 రౌండ్లలో 10 విజయాలతో 20 పాయింట్లు సాధించడం ద్వారా లీగ్ టేబుల్ టాపర్‌గా నిలిచింది. క్వాలిఫైయర్-1 పోరులోనే రాజస్తాన్ రాయల్స్‌ను అలవోకగా ఓడించి ఫైనల్లో అడుగుపెట్టింది. రాజస్తాన్ రాయల్స్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేయడం ద్వారా 7 వికెట్ల అలవోక విజయంతో సరికొత్త చాంపియన్‌గా అవతరించింది. ఆల్ రౌండర్ హార్థిక్ పాండ్యా నాయకత్వంలోని గుజరాత్ టైటాన్స్‌కు రాజస్తాన్ రాయల్స్ ఫైనల్లో సమ ఉజ్జీ కాలేకపోయింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్, లెగ్ స్పిన్ జాదూ రషీద్‌ఖాన్, కిల్లర్ మిల్లర్, లిటిల్ వండర్ వృద్ధిమాన్ సాహ లాంటి కీలక ఆటగాళ్ల ప్రతిభతో గుజరాత్ టైటాన్స్ చెలరేగిపోయింది.



ట్రోఫీతో కెప్టెన్ హార్థిక్ పాండ్యా

### 20 కోట్ల నజరానా

ఐపీఎల్ ట్రోఫీని తొలి ప్రయత్నంలోనే నెగ్గడంతో గుజరాత్ టైటాన్స్ 20 కోట్ల రూపాయల ప్రైజ్ మనీ అందుకొంది. గత 15 సీజన్ల చరిత్రలో ఐపీఎల్ ట్రోఫీని అందుకున్న 7వ జట్టుగా రికార్డుల్లో చేరింది. ఇంతకు ముందు టైటిల్ సాధించిన జట్లలో ముంబై ఇండియన్స్ (2013, 2015, 2017, 2019, 2020), చెన్నై సూపర్‌కింగ్స్ (2010, 2011, 2018, 2021), కోల్‌కతా నైట్ రైడర్స్ (2012, 2014), సన్‌రైజర్స్ హైదరాబాద్ (2016), రాజస్తాన్ రాయల్స్ (2008), డెక్కన్ చార్జర్స్ (2009) విజేతలుగా ఉన్నాయి. ప్రస్తుత టోర్నీ ద్వారా ఈ దిగ్గజ జట్ల వరుసలో గుజరాత్ టైటాన్స్ నిలిచింది.

### ఇద్దరూ ఇద్దరే

గుజరాత్ సమష్టి బలంతో విజేతగా నిలిచినా.. రన్నరప్ రాజస్తాన్ రాయల్స్ ఆటగాళ్లు వ్యక్తిగత అవార్డుల రేసులో తమకు తామే సాటిగా నిలిచారు. అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌కు ఇచ్చే ఆరెంజ్ క్యాప్, అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌కు ఇచ్చే పర్పుల్ క్యాప్ అవార్డులను రాయల్స్ జోడీ జోస్‌బట్లర్, యుజువేంద్ర చహాల్ గెలుచుకొన్నారు. రాయల్స్ డాషింగ్ ఓపెనర్ జోస్ బట్లర్ 17 మ్యాచ్‌ల్లో 4 శతకాలు సహా 863 పరుగులు సాధించడం ద్వారా అత్యుత్తమ బ్యాటర్‌గా నిలిచాడు.

### చహాల్ రికార్డు

అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌కు ఇచ్చే పర్పుల్ క్యాప్‌ను లెగ్ స్పిన్నర్ యజువేంద్ర చహాల్ కైవసం చేసుకొన్నాడు. మొత్తం 17 మ్యాచ్‌ల్లో చహాల్ 27 వికెట్లు పడగొట్టడం ద్వారా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ఇప్పటివరకూ చెన్నై స్పిన్నర్ ఇమ్రాన్ తాహీర్ పేరుతో ఉన్న 26 వికెట్ల ఐపీఎల్ రికార్డును చహాల్ తెరమరుగు చేశాడు. ఆరెంజ్ క్యాప్‌తో పాటు చహాల్ 15 లక్షల రూపాయల ప్రైజ్ మనీ సైతం సొంతం చేసుకొన్నాడు.



క్రీడా కృష్ణ, 84668 64969

### వారెవ్వా! ఆశిష్ నెహ్రా

ఐపీఎల్ చరిత్రలో ఓ భారత శిక్షకుడి నేతృత్వంలో విజేతగా నిలిచిన తొలిజట్టుగా గుజరాత్ టైటాన్స్ రికార్డు నెలకొల్పింది. గత 14 సీజన్లుగా విజేతలుగా నిలిచిన జట్లన్నీ విదేశీ శిక్షకుల నాయకత్వంలోనే టైటిల్స్ నెగ్గుతూ వచ్చాయి. కరోనా జాగ్రత్తల్లో భాగంగా లీగ్ దశలోని మొత్తం 70 మ్యాచ్‌లను ముంబై, పుణె నగరాలలోని మొత్తం నాలుగు స్టేడియాలలోనే నిర్వహించడం, కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో క్వాలిఫైయర్స్-1, ఎలిమినేటర్ రౌండ్ పోటీలు, అహ్మదాబాద్ నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా క్వాలిఫైయర్-2, ఫైనల్స్ పోటీలు నిర్వహించడం ఓ అరుదైన రికార్డుగా మిగిలిపోతుంది.

గుజరాత్‌కు చెందిన ఓ ఆటగాడు (హార్థిక్ పాండ్యా) కెప్టెన్‌గా, గుజరాత్‌కే చెందిన ఓ వ్యక్తి (జే షా) బీసీసీఐ కార్యదర్శిగా, గుజరాత్‌లో నరేంద్ర మోదీ పేరుతో నిర్మించిన అహ్మదాబాద్ స్టేడియంలో తొలిసారిగా జరిగిన ఐపీఎల్ ఫైనల్స్‌లో గుజరాత్ జట్టే విజేతగా నిలవడం యాదృచ్ఛికమే కాదు, అసాధారణం, అపూర్వమే అవుతుంది.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# ఆ సంస్కృతి




'మా బడికి వచ్చి వాళ్లు అలా ఎందుకు చేశారు?' ఇది అమెరికాలోని రాబ్ ఎలిమెంటరీ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ఓ బాలిక తన అత్తయ్య లోరెనా అగస్టేను అడిగిన ప్రశ్న. ఆ దేశ చరిత్రలోనే రెండో ఘోరమైన కాల్పుల దుర్ఘటన రాబ్ ఎలిమెంటరీలో మే 25వ తేదీన జరిగింది. ఆ ఘటన నుంచి క్షేమంగా బయటపడి, ఆ రాత్రే తన అత్తయ్యను అడిగింది ఆ బాలిక. మొత్తం 21 మందిని పొట్టన పెట్టుకున్న అత్యంత ఉన్మాద చర్య అది. నిజానికి ఆ ప్రశ్న ఆ బాలిక అమెరికా పాలకులను అడగాలి. తుపాకీ సంస్కృతికి అడ్డుకట్ట వేయడం కంటే ఆయుధాల వ్యాపారమే ముఖ్యమనీ, మనిషి ప్రాణం కంటే మానవహక్కులే ప్రధానమని అనుకుంటున్న నేతలను అడగాలి. ప్రపంచంలో ఏ చిన్న దుర్ఘటన జరిగినా (ముఖ్యంగా భారత్‌లో) ఆ దేశాలకు పుట్టగతులు లేకుండా చేయాలనుకునే 'వాషింగ్టన్ పోస్ట్', 'న్యూయార్క్ టైమ్స్' వంటి పత్రికల అంధత్వం గురించి నిలదీయాలి. మే 29న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ రాబ్ ఎలిమెంటరీని సందర్శించి మృతులకు నివాళి ఘటించారు. ఈ కాల్పుల ఘటనను అమెరికా తీవ్ర విషాద ఘటనగా పరిగణించి జాతీయ పతాకాన్ని అవనతం చేయించింది.

టెక్సాస్‌లోని ఉవాల్డే పట్టణంలో ఆ ఘోరం జరిగింది. సాల్వడార్ రామోస్ అనే 18 ఏళ్ల కుర్రాడు సాయుధుడై వచ్చి ఒక తరగతి గదిలో దూరి, తలుపులు బిగించి నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపాడు. 19 మంది చిన్నారులు చనిపోయారు. మరో ఇద్దరు ఉపాధ్యాయులను కూడా పొట్టన పెట్టుకున్నాడు. బులెట్ ప్రూఫ్ జాకెట్‌తో, ఏఆర్ సెమీ ఆటోమేటిక్ రైఫిల్, మరో హ్యాండ్ గన్, భారీ సంఖ్యలో బుల్లెట్లతో వచ్చినప్పటికీ అతడిని ఎవరూ అడ్డుకోకపోవడం విశేషం. ఈ విషయాన్ని పోలీసులే ధ్రువీకరించారు. చిత్రం ఏమిటంటే తెలుగు సినిమా పోలీసుల మీద ఉన్న ఆరోపణను అమెరికా పోలీసులు అమలు చేసి చూపించారు. పాఠశాలలో కలకలాన్ని రోడ్డు మీద నుంచే గమనించిన ఒక మహిళ తనకు కనిపించిన ఒక పోలీసును లోపలికి వెళ్లమని తొందరపెట్టింది. అతడు పోలేదు. చనిపోయిన విద్యార్థులంతా ఐదు నుంచి పదేళ్ల వయసు వారే. ఆ పాఠశాలలో మొత్తం 540 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. దుండగుడు ప్రవేశించిన ఆ తరగతి గదిలో 30 మంది ఉన్నారు. అదృష్టవశాత్తు కొందరు గాయాలతో బయటపడ్డారు.

అమెరికా వ్యవస్థనూ, గురవింద గింజ న్యాయానికి ఏ మాత్రం తీసిపోని అక్కడి పత్రికలనూ ప్రశ్నించే ముందు భారతీయులు కూడా తమను తాము ప్రశ్నించుకోవాలి. అమెరికా! ఓ అమెరికా అంటూ పలవరించేవారు ఇలాంటి సంస్కృతినేనా భారత దేశానికి దిగుమతి చేయాలని అనుకుంటున్నారు? అమెరికా వెళ్లి చదువుకోవడం, ఉద్యోగం చేయడం, డబ్బు సంపాదించడం ఇవేమీ తప్పు కావు. కానీ అక్కడ సంస్కృతిని తమ వెంట తీసుకురావాలనుకునే వారి పట్ల అప్రమత్తంగా ఉండవలసిందే. రెండు మూడేళ్లు మాత్రమే అమెరికాలో ఉండి వచ్చినవారు మొదలు, రెండుదశాబ్దాలు ఉండి అడపా దడపా వచ్చిన వారు కూడా ఆ సంస్కృతిని నెమ్మది నెమ్మదిగా భారతదేశానికి అంటిస్తున్నారు. అమెరికాలో కానరాని ప్రశాంతత, పెచ్చరిల్లిన వివక్ష, తుపాకీ సంస్కృతి కారణంగా చాలామంది పౌరసత్వాన్ని వదులుకుని ఇతర దేశాలకు వెళ్లిపోతున్నారని ఇటీవలనే వార్తలు వెల్లువెత్తాయి. సామాన్య పౌరుడి ప్రాణానికి భరోసా లేని దేశం ఇప్పటికీ గొప్పదే అని అందామా?

ఈ సంవత్సరం సగం కూడా పూర్తి కాకుండానే ఇంతవరకు అమెరికా పాఠశాలల్లో 27 కాల్పుల ఘటనలు నమోదు కావడం ఎవరినైనా కలవరపెడతాయి. ఇక దేశంలో సామూహిక కాల్పుల ఘటనలు ఈ ఏడాదిలో ఇంతవరకు 212 జరిగాయని గన్ వయోలెన్స్ ఆర్కైవ్స్ అనే సంస్థ వెల్లడించింది. అంటే రోజుకు సగటున ఒకటి కంటే ఎక్కువే జరుగుతున్నాయి. ఈ తుపాకీ సంస్కృతి ఇంతగా వెర్రితలలు వేసిన తరువాత గాని అమెరికా పాలకులకి ఈ సమస్యలోని అమానుషత్వం తలకెక్కలేదు. ఇప్పటికీ కొందరికి తలకెక్కడం లేదు.

జపాన్‌లో జరిగిన క్వాడ్ సదస్సులో పాల్గొని తిరిగి వస్తుండగా విమానంలోనే అధ్యక్షుడు బైడెన్‌కు ఈ దుర్ఘటన గురించి తెలిసింది. గగనతలం నుంచే జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. అధ్యక్ష భవనంలో ప్రవేశించాక, భార్యతో కలసి మరొకసారి జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. అప్పుడే ఆయుధ లాబీలకి ముకుతాడు వేస్తానని ఓ మాట అన్నారు. తుపాకీ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటూ తనకు ఎన్నో విన్నపాలు వచ్చిన సంగతిని ఆయన గుర్తు చేసుకున్నారు. నిజానికి క్వాడ్ సమావేశం కోసం బైడెన్ బయలుదేతున్న సమయంలోనే న్యూయార్క్‌లో పదిమంది నల్లజాతీయులను కాల్చి చంపిన దుర్ఘటన చోటుచేసుకుంది. మిగిలిన దేశాలలో అత్యంత అరుదైన ఇలాంటి ఘటనలు అమెరికాలోనే ఎందుకు విరివిగా జరుగుతున్నాయని ఆయన ఆత్మశోధనకు కూడా దిగారు.

రామోస్ ఇలా రక్తపిపాసిగా మారడానికి అమెరికా వ్యవస్థ వినిపిస్తున్న కారణాలు భయపెట్టేవిగానే కాదు, నమ్మడం కష్టమనిపించేలా ఉన్నాయి. నత్తితో బాధపడే రామోస్ చిన్నతనంలో పాఠశాలలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడని, అదే అంతిమంగా ఇలాంటి కిరాతకానికి పాల్పడేటట్టు చేసిందని చెబుతున్నారు. మొదట అతడు తన నానమ్మను కాల్చబోతున్నాను అని ట్వీట్ చేశాడు. తరువాత ఇప్పుడు పాఠశాలకు బయలుదేరాను అని కూడా సందేశం పెట్టాడు. వీటన్నిటికంటే ముందు లాస్ ఏంజెలెస్‌కు చెందిన ఒక యువతికి 'ఇంకాసేపట్లో నేను' అంటూ సగం సందేశం పంపాడు. 11.30 ప్రాంతంలో ఆ ఘోరం జరిగిపోయింది. హంతకుడు రామోస్‌ను సరిహద్దు గస్తీ బృందం కాల్చి చంపింది.

కానీ ఈ ఉదంతంలో పోలీసుల వైఫల్యమే చాలా ఎక్కువ అని జేవియర్ కెజారెస్ ఆరోపిస్తున్నారు. పోలీసులు చురుకుగా వ్యవహరించలేదని ఆయన చెప్పారు. లోపల కలకలం రేగినా పోలీసులు బయటే గుమిగూడి ఉండిపోయారని అంటున్నారు. ఈయన కుమార్తె జాక్లిన్ కెజారెస్ ఆ పాఠశాలలోనే నాలుగో తరగతి చదువుతోంది. దురదృష్టవశాత్తు ఆ బాలిక కాల్పులలో చనిపోయింది. మనమే లోపలికి వెళదాం ఈ పోలీసులు ఏమీ చేయలేరు అని జేవియర్ అక్కడకు వచ్చిన వారిని ప్రేరేపించారు కూడా. ఇంతకీ



# మనకొద్దు!

రామోస్ తరగతి గది నుంచి బయటకు వచ్చిన తరువాత కూడా ఇద్దరిని కాల్చాడు, అప్పుడు మాత్రమే పోలీసులు ఎదురు కాల్పులకు దిగారని ఒక కథనం.

అధ్యక్షుడు జో బైడెన్ ఈ ఘటన పట్ల కదిలిపోయి నట్టు కనిపించినా, మళ్లీ తుపాకీ సంస్కృతిని అరికట్టడం మీద తాజాగా వాదోపవాదాలు మొదలైనా ఆచరణలో గట్టి కార్యాచరణకు అవకాశం దాదాపు లేదనే విశ్లేషకులు చెబుతున్నారు. ఇందుకు సంబం ధించి కీలకమైన సంస్కరణ ఏదీ తీసుకువచ్చే అవకాశం కూడా లేదని అంటున్నారు. అమెరికా సామాజిక వాతావరణం కూడా అందుకు తగినట్టే ఉంది. అక్కడి చాలా ప్రాంతాలలో తుపాకీ కలిగి ఉండడం సర్వసాధారణమైంది. నిత్య జీవితంలో తుపాకీ ఒక భాగమైందని చెప్పినా అతిశయోక్తి అనలేం. తుపాకీతోనే తమ స్వాతంత్ర్యంతోపాటు, ఆస్తులకు కూడా రక్షణ సాధ్యమవుతుందని ఇప్పుడు చాలామంది గట్టిగా నమ్ముతున్నారు. అసలు ఆయు ధంతో రక్షణ పొందవచ్చునంటూ రాజ్యాంగంలోని రెండో సవరణ అవకాశం కల్పించింది. కానీ ఎప్పుడు తుపాకీల మీద నియంత్రణ ఉండాలన్న అభిప్రాయం వెల్లువెత్తినా ఇదే రాజ్యాంగ సవరణను చూపించి రిపబ్లికన్లు ప్రభుత్వం నోరు నొక్కుతున్నారు. ఇలాంటి కాల్పుల ఘటనకు పాల్పడినవారిలో అత్యధికులు ఏదో మానసిక వ్యాధితో బాధపడేవారేనని, వారికి వైద్యం చేయించాలి తప్ప, తుపాకీ కలిగి ఉండే హక్కును హరించడం సరికాదని ఆ సంస్కృతి సమర్థకులు వాదిస్తున్నారు. 250 ఏళ్ల క్రితం జరిగిన ఆ రాజ్యాంగ సవరణను 2022లో కూడా గౌరవించ వలసిన అవసరం ఏమిటన్నదే ఇప్పుడు అక్కడ చాలామంది వేసే ప్రశ్న. తుపాకీతోనే హక్కులకు రక్షణ ఉంటుందన్న అనాగరిక, మధ్యయుగ భావన అగ్రరాజ్యంలో తిష్ట వేయడం నిజంగా వింతే.

స్వాతంత్ర్యం, నిన్ను నీవు రక్షించుకోవడం అనేవి అక్కడ ప్రాథమిక హక్కులు. ఇప్పుడు ఈ రెండింటి సాధనను దేశ మౌలిక విలువగా పరిగణిస్తున్నారు. తుపాకులు కలిగి ఉండడానికి పౌరులకున్న హక్కు గురించి నేషనల్ రైఫిల్స్ అసోసియేషన్ గట్టిగా సమర్థిస్తున్నది. భావ ప్రకటనా స్వేచ్ఛ మాదిరిగానే తుపాకీని కలిగి ఉండడం ప్రాథమిక హక్కుగానే అక్కడ భావిస్తున్నారు. అమెరికా సమాజంలో మితి మీరిన వ్యక్తి స్వేచ్ఛ ఉంది. కాబట్టి ఆయుధం కలిగి ఉండడం తమ హక్కేనని 74 శాతం అమెరికన్లు నమ్ముతున్నారు. వ్యక్తిగత భద్రత కోసం తుపాకీ ఉండి తీరాలని 24 శాతం మంది చెబుతున్నారు. ఈ అభిప్రాయాలకు తగ్గట్టే వ్యక్తిగత ఆయుధాలు కలిగి ఉన్న ప్రజలు అత్యధికంగా ఉన్న దేశంగా ప్రపంచం లోనే అమెరికా నిలుస్తున్నది. 2020 ప్రకారం అమెరికా జనాభా 33 కోట్లు. వారి వద్ద ఉన్న వ్యక్తిగత ఆయుధాలు 40 కోట్లు.



చిత్రం ఏమిటంటే 2012లో శాండీ హుక్ ప్రైమరీ పాఠశాలలో జరిగిన రక్తపాతం(పాఠశాలలో జరిగిన కాల్పులకు సంబంధించి అమెరికాలో దీనినే మొదటిదిగా చెబుతారు) కూడా తుపాకీ కలిగి ఉండడం ప్రాథమిక హక్కు అన్న అభిప్రాయం నుంచి అమెరికన్లను బయటకు తేలేకపోయింది. ఆ పాఠశాలలో దుండగులు జరిపిన కాల్పులలో ఆరు గురు పెద్దలు సహా 20మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. అయితే తుపాకీ సంస్కృతి, దానిలోని అమానవీయతల మీద అప్పుడు దేశం కొంచెం లోతు గానే ఆలోచించింది. మాజీ అధ్యక్షుడు, డెమాక్రటిక్ పార్టీ నాయకుడు బరాక్ ఒబామా ఈ దిశగా కొంత ప్రయత్నం చేశారు. కొన్ని రకాల తుపాకులను నిషేధించాలని ఆయన భావించారు. దీనికి ప్రత్యర్థి రిపబ్లికన్ పార్టీలోని కొందరు సభ్యుల నుంచి కూడా మద్దతు వచ్చింది. అయినా కార్య రూపం దాల్చలేదు. చట్టం తేవడానికి కాంగ్రెస్‌లో బలం చాలలేదు. డెమాక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య ఈ అంశం మీద ఉన్న విరుద్ధ అభిప్రాయాలు చాలా బలమైనవి.

ఒక్క టెక్సాస్ రాష్ట్రంలోనే ఈ తుపాకీ సంస్కృతి ఎంత విచ్చల విడిగా ఉన్నదో చెప్పే కొన్ని దారుణ మైన ఉదంతాలు ఉన్నాయి. బ్లాక్ లైవ్స్ మేటర్ ఉదంతం దరిమిలా డల్లాస్‌కు చెందిన 25 ఏళ్ల యువకుడు పోలీసుల మీద కాల్పులు జరిపాడు. ఐదుగురు చనిపోయారు. మరో తొమ్మిదిమంది పోలీసులు గాయపడ్డారు. 2017 నవంబర్‌లో సదర్‌ల్యాండ్ స్ప్రింగ్స్ దగ్గరి ఫస్ట్ బాప్టిస్ట్ చర్చ్ దగ్గర 26 ఏళ్ల యువకుడు కాల్పులు జరిపాడు. 26 మంది చనిపోయారు. అతడి మీద స్థానికుడు ఒకరు కాల్పులు ప్రారంభించడంతో పరారయ్యాడు. తరువాత తనకు తాను కాల్చుకున్నాడు. 2018 మే హ్యూస్టన్‌లోని శాంటా ఫె ఉన్నత పాఠశాలలో 17 ఏళ్ల యువకుడు కాల్పులు జరిపాడు. 8 మంది చనిపోయారు. 2019 ఆగస్ట్‌లో 21 ఏళ్ల యువకుడు డల్లాస్ దగ్గర వాల్‌మార్ట్‌లో కాల్పులు జరిపి 23 మందిని బలిగొన్నాడు. ఆ తరువాత మిడ్‌ల్యాండ్‌లో 36 ఏళ్ల యువకుడు కాల్పులు జరిపితే ఏడుగురు కూలిపోయారు.

శాండీ హుక్ దుర్ఘటన తరువాత 14 రాష్ట్రాలు తుపాకీ హక్కు మీద నిబంధనలను కఠినతరం చేశాయి. అవన్నీ డెమాక్రటిక్ పార్టీ అధికారంలో ఉన్నవే. ఎంత దారుణమంటే అమెరికాలో పిల్లలు, యువతరం మరణించడానికి వెనుక ఉన్న కారణా లలో తుపాకీదే ప్రథమ స్థానం. 2020 నుంచి పరిశీలిస్తే తుపాకీ కాల్పుల ఘటనల కారణంగా 18 ఏళ్ల వయసు యువకులు 4,300 మంది చని పోయారు. ఇదే సమయంలో 50 మంది అమెరికా పోలీసులు మరణించారు. రాను రాను తుపాకీతో సాగుతున్న హింస పట్ల చాలామంది తీవ్రంగా స్పందించడం మొదలయింది. తుపాకీ సంస్కృతిని నివారించే సాహసం లేకున్నా, కనీసం తుపాకీ ఉపయోగించుకోవడానికి నిబంధనలను క్రమబద్ధం చేయాలన్న డిమాండ్ కూడా వచ్చింది. తమ ప్రాణాలు కాపాడుకునే హక్కు పేరుతో తుపాకీ సంస్కృతి పెరుగుతున్నది. మరి పాఠశాలకు వెళ్లి చదువుకోవడానికి బాలలకు ఉన్న హక్కు మాటేమిటని ఇప్పుడు చాలామంది నిలదీస్తున్నారు.

మనిషి ప్రాణం కంటే మానవహక్కుకే తొలి ప్రాధాన్యం ఇచ్చే ఒక యాంత్రిక సంస్కృతి అమెరి కాలో ప్రబలిన మాట సుస్పష్టం. దీనిని భారత్‌లోకి రాకుండా చూసుకోవడమే ప్రథమ కర్తవ్యం. ఇందుకు కారణాలలో ఒకటిగా కుటుంబ వ్యవస్థ బలంగా లేకపోవడమేనని రాబ్ పాఠశాల కాల్పుల తరువాత మాజీ అధ్యక్షుడు ట్రంప్ చెప్పడం విశేషం. దీనిని అంతా గమనించాలి. శాంతియుత జీవనం గొప్పత నాన్ని మన సంస్కృతికి అందించిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వారి బాటలో నడవాలి. ★




## తెలుసుకుందాం

# వాసుదేవ పెరుమాళ్ ఆలయం



శ్రీకాకుళం జిల్లా మందస గ్రామంలోని ప్రాచీన దేవాలయం. సుమారు 266 సంవత్సరాల క్రితం ఇది పునర్నిర్మితమైనట్టు ఇక్కడ లభించిన ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఎర్రని ఇసుకరాయితో కళింగ శైలిలో తీర్చిదిద్దిన ఈ ఆలయ అపూర్వ శిల్పసంపద వర్ణనాతీతం. ఆలయంలో నెలకొని ఉన్న నిలువెత్తు సాలగ్రామ మూలమూర్తి తిరుపతి వేంకటేశ్వరుని విగ్రహాన్ని పోలి ఉంటుంది.

## కథ | ఎద్దు పాలు

అక్బర్ ఆస్థానంలో చతురుడు, సమయస్ఫూర్తికల బీర్బల్ ఉన్నాడు. ఒకసారి బీర్బల్‌ను పిలిచి ఒక వారం రోజుల్లో నాకు ఎద్దుపాలు తెప్పించు, లేనిచో కారాగారం తప్పదు అన్నాడు అక్బర్.

"ఎద్దు పాలు", అదీ వారం రోజుల్లో ఎలా సాధ్యం. సాహసించి అక్బర్‌తో చెప్పే ధైర్యం లేదు. నీరసంగా ఇంటిముఖం పట్టాడు బీర్బల్, ఎండ మండిపోతుంది. గొంతు దాహంతో పిడచ కట్టుకపోతుంది. బీర్బల్ ఇల్లు చేరి మంచి నీళ్లు తాగి, కూర్చున్నాడు. భార్య వచ్చి ఏమండి, ఏంటి అలా ఉన్నారు అని అడిగింది. ఆలోచనలో ఉన్న! ఎలా చెప్పను అక్బర్ చక్రవర్తి వారం రోజుల్లో "ఎద్దు పాలు" తెమ్మన్నాడు లేనిచో ఖైదు చేస్తానన్నాడు అంటూ భార్యతో అసలు విషయం చెప్పాడు అక్బర్.

భార్య ఆశ్చర్యపడి ఏంటీ "ఎద్దు పాలు" కావాలంటా? అని ఆలోచించింది. బీర్బల్ భార్య సమయస్ఫూర్తిగా ఆలోచించ గలదు. బీర్బల్ కూడా ఎలాంటి సమస్యనైనా భార్యతో చెప్పి సలహాలు తీసుకుంటాడు.

బీర్బల్ భార్య ఆలోచించి "మీరు బయటకు రాకండి. ధైర్యంగా ఉండండి. ఎద్దు పాలు నేను తెస్తాను" అంటూ బీర్బల్‌తో చెప్పి విడిచిన బట్టలు ఓ మూట కట్టుకొని బయలుదేరింది. అంతఃపురానికి వెళ్లే దారిలో ఓ పెద్ద చెరువు ఉంది ఆ చెరువు దగ్గరకు వెళ్లి మురికి బట్టలు ఉతుకుతూ ఏడుస్తుంది పెద్ద పెట్టున. అంతఃపురానికి వెళ్తున్న రాజభటులు ఆమెను చూసి చెరువు దగ్గరకు వచ్చి "ఏమ్మా ఎందుకు ఏడుస్తున్నావు? నీకు ఏమి కష్టం వచ్చింది? మాతో చెప్పు" అని బీర్బల్ భార్యను అడిగారు.

"అయ్యా మావూరి మునసబు కొడుక్కి మగ పిల్లాడు పుట్టాడు. ఆ మైల బట్టలు ఉతుకుతున్నాను. ఎంత ఉతికినా తరగటం లేదు" అంటూ పెద్ద పెట్టున రోదించింది బీర్బల్ భార్య. ఆశ్చర్యంగా చూశారు భటులు. ఆమెను అంతఃపురానికి



## పద్యం



సంతత పుణ్యశాలి యొక జాడను సంపద వాసిపోయి తా
నంతట పోకనెట్టుకొని యెప్పటియట్ల వసించియుండు; మా
సొంతము నందు చందురుని యన్ని కళల్ పెడబాసి పోయినన్
కాంతి వహింప దోటు తిరుగంబడి దేహము నిండ భాస్కరా

**భావం :** భాస్కరా! పుణ్యాత్ముడు తన సంపద అంతా పోయినా బాధపడక ఎప్పటిలా ఉంటాడు. చంద్రుడు నెల చివర కళలన్నీ పోయినా మళ్లీ కాంతునిగా వెలుగొందును కదా!

## శ్లోకం

దాతృత్వం, ప్రియవక్తృత్వం ధీరత్వముచితజ్ఞతా।
అభ్యాసేన న లభ్యంతే చత్వారస్సహజా గుణాః ॥

**భావం :** దానగుణం, ప్రియంగా మాట్లాడటం, ధీరత్వం, ఔచిత్యం.. ఈ నాలుగు నేర్చుకుంటే వచ్చే లక్షణాలు కావు. సహజంగా రావలసినవి.



## జత పరచండి


ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| బీచ్ | ప్రాంతం |
| --- | --- |
| కోవలం | ముంబై |
| మెరీనా | విశాఖపట్నం |
| జుహూ | కేరళ |
| మైపాడు | చెన్నై |
| భీమిలి | నెల్లూరు |

**జవాబులు :** కోవలం–కేరళ; మెరీనా–చెన్నై; జుహూ–ముంబై; మైపాడు–నెల్లూరు; భీమిలి–విశాఖపట్నం.

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### టేకూరు సుబ్రహ్మణ్యం



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రాజకీయ నాయకుడు. ఆగస్టు 9, 1900లో అనంతపురం జిల్లా, ఉరవకొండలో జన్మించారు. ఉద్యమంలో పాల్గొని నాలుగుసార్లు అరెస్టయ్యారు. అస్పృశ్యతా నివారణ, హిందీ ప్రచారం, హరిజనోద్ధరణ మొదలైన ఉద్యమాల్లో కూడా చురుకుగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున బళ్లారి లోక్‌సభ నియోజకవర్గం నుండి వరుసగా 15 సంవత్సరాల పాటు పార్లమెంటు సభ్యుడిగా కొనసాగారు. డిసెంబర్ 24, 1974న మరణించారు.



తోడ్కొని పోయారు. మహారాజా! "మునసబు కొడుక్కి మగ పిల్లాడు పుట్టాడట ఆ బట్టలు ఉతకలేక ఏడుస్తున్నానని అంటుందీమె" అని అంటూ ఆమెను రాజగారి ముందు ప్రవేశపెట్టారు రాజభటులు. రాజు ఖిన్నుడై ఏమ్మా "మగవాళ్లు ఎక్కడైనా పిల్లల్ని కంటారా? ఏంది? ఏమిటీ నాటకం?" గద్దించారు అక్బర్.

మహారాజా! ఎద్దు పాలు ఇవ్వగాలేంది మగాడు పిల్లల్ని కంటే తప్పేంటి అని అక్బర్‌తో అడిగింది బీర్బల్ భార్య గడుసుగా...

చక్రవర్తి అక్బర్‌కు తన తప్పేంటో తెలిసింది. బీర్బల్ విషయంలో తను చేసిన పొరపాటు అర్థమైంది. వెంటనే భటులతో మీరు వెళ్లి బీర్బల్‌ని తోడ్కొని రండి అంటూ అక్బర్ చక్రవర్తి ఆజ్ఞాపించాడు.

బీర్బల్ భార్య "క్షమించండి నేను బీర్బల్ భార్యనే. అయితే ఎద్దు పాలు తెమ్మన్నారు. ఆయన బెంగెట్టుకున్నారు. అది చూడలేక మీకు నిజం తెలియజేయాలనే ఇలా వచ్చాను అంటూ తెలియజేసింది.

అక్బర్ ఆవిడ చతురతకు ముగ్ధుడై బీర్బల్, దంపతులను మెచ్చుకొని సన్మానించాడు. బీర్బల్, ఆయన భార్య సంతోషంగా ఇంటి ముఖం పట్టారు. ★

## జనరల్ నాలెడ్జ్

1. కృష్ణానది జన్మస్థానం?
2. ప్రపంచంలోనే అతిపెద్ద సూర్యదేవాలయం ఏ దేశంలో ఉంది?
3. తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్?

సమాధానాలు : 1. మహాబలేశ్వరం; 2. ఈజిప్ట్; 3. పోచారం శ్రీనివాస్‌రెడ్డి.

## మెదడుకు మేత



మేసేది కాసింత
మేత, కూసేది
కొండంత మోత?

జవాబు : తుపాకీ, తూటా

## మంచిమాట




ఎదుటివారిలో తప్పులు వెతకడమే పనిగా పెట్టుకుంటే అన్నీ తప్పులే కనిపిస్తాయి.



# వారఫలాలు

06-12 జూన్ 2022



సింహంభట్ల సుబ్బారావు

6300674054

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఎంతోకాలంగా వేధిస్తున్న సమస్యలను పరిష్కరించుకుంటారు. వాహనాలు, గృహం కొనుగోలు యత్నాలు కలసివస్తాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు విధుల్లో ఒడిదొడుకుల నుంచి బయటపడతారు. పారిశ్రామికవర్గాలు, నాయకులకు విశేష గుర్తింపు. కళాకారులకు అవార్డులు. 6,7 తేదీల్లో అనుకోని ఖర్చులు. అనారోగ్యం. కుటుంబ సభ్యులతో తగాదాలు. ఆదిత్య హృదయం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

ఈతిబాధలు ఎదురైనా కొంత ఉపశమనం లభిస్తుంది. ఆస్తి వివాదాల పరిష్కారం. ఆదాయం ఇబ్బంది కలిగించినా క్రమేపీ అనుకూలిస్తుంది. ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి. విద్యార్థులకు నూతన విద్యావకాశాలు. వ్యాపారులలో లాభాలు ఆర్జిస్తారు. ఉద్యోగులకు పదోన్నతులతో కూడిన బదిలీలు ఉంటాయి. నిరుద్యోగులకు శుభవర్తమానాలు. 7,8 తేదీల్లో అనుకోని ఖర్చులు. మానసిక ఆందోళన. శివాష్టకం పఠించండి.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

అనుకున్న కార్యక్రమాలలో ముందడుగు వేసి విజయం సాధిస్తారు. ఆదాయం కొంత నిరాశ పర్చినా అవసరాలకు లోటు ఉండదు. విద్యార్థులు, నిరుద్యోగుల కృషి ఫలిస్తుంది. విచిత్ర సంఘటనలు ఎదురవుతాయి. వ్యాపారులను అదృష్టం వరిస్తుంది, లాభాలు దక్కుతాయి. ఉద్యోగస్తులకు విధి నిర్వహణలో ప్రతిబంధకాలు తొలగుతాయి. 9,10 తేదీల్లో వృథా ఖర్చులు. మనశ్శాంతి లోపిస్తుంది. దేవీ ఖడ్గమాల స్తోత్రంపఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

రాబడికి మించి ఖర్చులు. విద్యార్థులకు పోటీపరీక్షల్లో విజయం. శారీరక రుగ్మతలతో బాధపడతారు. వ్యాపారులకు పెట్టుబడుల్లో జాప్యం. లాభాల కోసం శ్రమపడాలి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు కొద్దిపాటి చిక్కులు ఎదురుకావచ్చు. సాంకేతిక నిపుణులు తటస్థ వైఖరితో ముందుకు సాగడం మంచిది. 11,12 తేదీల్లో విందు వినోదాలు. భూ లాభాలు. శివస్తోత్రాలు పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగు. ఆస్తి విషయాల్లో చికాకులు తొలగుతాయి. వివాహ, ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. ఉద్యోగులకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. వ్యాపారులకు లాభాలు. పారిశ్రామిక వేత్తలకు కొత్త సంస్థలతో అగ్రిమెంట్లు. రాజకీయవేత్తలు, సాంకేతిక వర్గాల వారికి ఆకస్మిక విదేశీ పర్యటనలు. 8,9 తేదీల్లో వృథా ఖర్చులు. ఆంజనేయ దండకం పఠించండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

నేర్పుగా వివాదాల నుంచి బయటపడతారు. కోర్టు వ్యవహారాలు అనుకూలంగా మారతాయి. స్థిరాస్తిపై అగ్రిమెంట్లు చేసుకుంటారు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు అందడంతో పాటు ఆశించిన లాభాలు తథ్యం. పరిశోధకులు, సాంకేతిక నిపుణులకు ఆకస్మిక విదేశీ పర్యటనలు. 6,7 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. విష్ణుసహస్ర నామ పారాయణ చేయండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

మీపై వచ్చిన అపవాదులు, విమర్శలు తొలగుతాయి. ఆశించిన రాబడి దక్కి అవసరాలు తీరతాయి. వాహనయోగం. వ్యాపారులకు పెట్టుబడులు అంది ఉత్సాహంగా గడుపుతారు. ఉద్యోగులు కొత్త హోదాలు దక్కించుకుంటారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు అప్రయత్నంగా అవకాశాలు దక్కించుకుంటారు. 11,12 తేదీల్లో బంధు విరోధాలు. విలువైన సామగ్రి జాగ్రత్త. శివపంచాక్షరి పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

విద్యార్థులు, నిరుద్యోగులు సత్తా నిరూపించుకునేందుకు తగిన సమయమే. షేర్ల మార్కెటింగ్‌లో అభివృద్ధి. గృహ నిర్మాణాలు ప్రారంభిస్తారు. వ్యాపారులు నైపుణ్యంతో లాభాలు దక్కించుకుంటారు. ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుంది. రాజకీయవేత్తలు, కళాకారులకు విజయాలు తథ్యం. సాంకేతిక నిపుణులు విదేశీ పర్యటనలు జరుపుతారు. 9,10 తేదీల్లో బంధువులతో విభేదాలు. విష్ణుధ్యానం చేయండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

స్థిరాస్తి విషయంలో అగ్రిమెంట్లు చేసుకుంటారు. వాహనాలు, స్థలాలు కొంటారు. కోర్టు వ్యవహారాలలో ఒత్తిడులు తొలగుతాయి. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులు విధి నిర్వహణలో సమర్థతను చాటుకుంటారు. పారిశ్రామికవేత్తలు, కళాకారులకు పరిశోధకులు పట్టుదలతో విజయాలు సాధిస్తారు. 10,11 తేదీల్లో అనుకోని ఖర్చులు. దూర ప్రయాణాలు. గణేశాష్టకం పఠించండి

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ట 1, 2 పాదాలు**

కొంత పట్టువిడుపు ధోరణి అవలంబించడం మంచిది. విద్యార్థుల శ్రమ ఫలిస్తుంది. వ్యాపారులకు సామాన్య లాభాలుంటాయి. ఉద్యోగులకు గుర్తింపు రాగలదు. విధి నిర్వహణలో అవరోధాలు తొలగుతాయి. పారిశ్రామికవేత్తల అంచనాలు నిజమవుతాయి. రాజకీయవేత్తలు, కళాకారులకు ఉత్సాహవంతమైన కాలం. 6,7 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. మానసిక అశాంతి. దేవీస్తోత్రాలు పఠించండి.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

స్థిరాస్తి వివాదాలు పరిష్కారదశకు చేరతాయి. రాబడి తృప్తినిస్తుంది. విలువైన డాక్యుమెంట్లు జాగ్రత్త. ఇంటి నిర్మాణాలు చేపడతారు. శారీరక రుగ్మతలు బాధించినా ఉపశమనం పొందుతారు. వాహనాలు కొంటారు. పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. 8,9 తేదీల్లో ఖర్చులు అధికం. సోదరులతో కలహాలు. లక్ష్మీ స్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

పరిమితికి మించిన ఖర్చులు మీదపడతాయి. శ్రమకు తగిన ఫలితం కనిపించక డీలా పడతారు. కొన్ని నిర్ణయాలను మార్చుకుంటారు. గృహ నిర్మాణ యత్నాలు వాయిదా పడతాయి. విద్యార్థులు మరింత శ్రమపడాలి. వ్యాపారులకు లాభాలు అంతగా కనిపించవు. ఉద్యోగులకు విధుల్లో కొద్దిపాటి ఆటంకాలు ఎదురవుతాయి. 9,10 తేదీల్లో శుభవార్తలు. దుర్గామాతకు అర్చనలు చేయండి. ★

# పదరసం-369

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ✠ | 1 | 2 | | 3 | ✠ | 4 | 5 | | 6 |
| 7 | ✠ | | ✠ | | ✠ | ✠ | | ✠ | |
| 8 | | ✠ | 9 | | | 10 | ✠ | 11 | |
| | ✠ | 12 | ✠ | | ✠ | 13 | | ✠ | |
| 14 | 15 | | ✠ | ✠ | ✠ | | ✠ | 16 | ✠ |
| ✠ | 17 | | | ✠ | 18 | | ✠ | 19 | 20 |
| 21 | ✠ | | ✠ | ✠ | ✠ | 22 | | ✠ | |
| 23 | | ✠ | 24 | | 25 | | ✠ | 26 | |
| | ✠ | 27 | ✠ | ✠ | | ✠ | 28 | ✠ | |
| 29 | | | | ✠ | 30 | | | | ✠ |

పదరసం – 369

పేరు : ..........................................................................................

చిరునామా:..........................................................................................

..........................................................................................

పిన్‌కోడ్ : .................. మొబైల్ : ..................................................

## ఆధారాలు

**అడ్డం**

1. హిందూమత సంబంధి (4)
4. మప్పితము తోడిది, గౌరవం వంటిదే (4)
8. తపాలా (2)
9. ఆస్తి సంక్రమింపచేస్తూ చట్టబద్ధంగా రాసేది (4)
11. ఇది ఒక భాష. లిపి మాత్రం కన్నడమే! (2)
13. ముని (2)
14. భేదులు, విరేచనం (3)
17. కోకిల, గంజాయి (3)
18. అల్లరి (2)
19. రవికలో దాగిన భాస్కరుడు (2)
22. నటి, నక్షత్రము (2)
23. జనకుడు (2)
24. నేటి కోడలు ఒకనాటికి ఇది కావచ్చు (4)
26. అరటిచెట్టు ఇంద్రనర్తకియా? (2)
29. నటుడు బాలకృష్ణ ఈ వంశజుడు (4)
30. మరణం, చావు (4)

**నిలువు :**

2. హైదరాబాద్‌లో చేతిగుడ్డ (2)
3. ఆవకాయ పెట్టడానికి ముందు మామిడికాయ ఇలా తరగాలి (4)
5. నక్షత్రము (2)
6. కరుణాత్ముడు అనే! (4)
7. నర్తకులకు దైవం (4)
10. దాశరథి రంగాచార్య నవల మా జతా వుంది (6)
12. మేఘము, మబ్బు (4)
15. బౌద్ధగురువు (2)
16. యవనిక (2)
20. డా॥ సి.నారాయణరెడ్డికి జ్ఞానపీఠం తెచ్చిపెట్టిన రచన (4)
21. అధునాతనం కాదు ప్రాచీనమే! (4)
25. లతా మంగేష్కర్ వృత్తి రీత్యా కూడా! (3)
27. తిరగబడిన మూత (2)
28. కత్తికి దీని మీద పదును పెడతారు (2)

**మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27**

**సమాధానాలను** పైగడులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2022 జూన్ 20 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

## పదరసం - 365 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 జా | గృ | 2 తి | ✠ | 3 గో | ష్ప | ✠ | 4 వ | త్రి | 5 క |
| తీ | ✠ | 6 మి | త్రు | డు | ✠ | 7 నీ | డ | ✠ | ద్రు |
| యం | ✠ | ర | ✠ | 8 గు | 9 హా | ✠ | మ | ✠ | వ |
| ✠ | 10 వా | ము | 11 డు | ✠ | లి | ✠ | 12 ర | 13 బి | ✠ |
| 14 తా | బి | ✠ | 15 పం | 16 దె | ము | 17 న | ✠ | 18 టీ | 19 క |
| 20 త | లా | 21 రి | ✠ | య్యం | ✠ | క్తి | ✠ | ✠ | టీ |
| ✠ | 22 లి | వ | 23 ణం | ✠ | ✠ | ✠ | 24 చం | 25 ద్ర | ✠ |
| 26 న | ✠ | 27 ట | తో | ✠ | 28 మ | 29 దో | ✠ | 30 వం | 31 ద |
| 32 మం | 33 చు | ✠ | 34 ర | 35 మ | ✠ | 36 శ | 37 వం | ✠ | 27 వ |
| 38 త | క్ష్మి | ర్ | ✠ | 39 ర | తి | ✠ | 40 క | వ | వం |

**విజేతలు:** ఎం.విజయలక్ష్మి, టి.వి.నారాయణ, బి.ఇందు శేఖర్–హైదరాబాద్, టి.రేవతి, వి.రామలింగాచారి, ఐ.సోని–యాదగిరిగుట్ట, ఎ.గాయత్రి–వికారాబాద్, వి.పద్మా రంగనాథ్–నిజామాబాద్, డా॥బి.ధన్వంతరి–మచిలీపట్నం, ఎన్.రాజు–కర్నూలు, ఎన్.వి.ఎస్.శర్మ–కోనసీమ, జి.వెంకటేశ్వరమ్మ, జి.యశోదాప్రీతి–ఒంగోలు, పి.సీతా మహాలక్ష్మి–తిరుపతి, టి.వి.సుబ్రహ్మణ్యశర్మ–నెల్లూరు, కె.సత్యనారాయణ–విశాఖపట్నం, వి.సరస్వతి, వి.శ్యామల–కాకినాడ, సి.హెచ్.వి.చక్రపాణి–గుంటూరు, కె.కాంతామణి –భువనేశ్వర్, జె.సత్యనారాయణ, వి.భాస్కరయ్య, డి.శివకుమార్–చెన్నై.

**బహుమతి పొందిన విజేత: ఎ.గాయత్రి-వికారాబాద్**

సినిమా

అరుణ




# ఫన్ తక్కువ, ఫ్రస్ట్రేషన్ ఎక్కువ

**బాలీవుడ్‌తో పోల్చితే టాలీవుడ్‌లో ఫ్రాంచైజ్ మూవీస్ చాలా తక్కువ. వేళ్ల మీద లెక్కించే చిత్రాలే వచ్చాయి. సీక్వెల్‌గా వచ్చిన 'బాహుబలి'ని చాలామంది ఫ్రాంచైజ్ ఖాతాలో వేస్తుంటారు కానీ అది కరెక్ట్ కాదు. అలా ఈ మధ్య కాలంలో వచ్చిన ఫ్రాంచైజ్ మూవీ 'ఎఫ్ 3'. దీనికి ముందు వచ్చిన 'ఎఫ్ 2' కథకు దీనికి సంబంధం ఉండదు. అందులోని పాత్రలను మాత్రమే తీసుకుని కొత్త కథను దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పాడు. మొదటి సినిమాలో ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్‌పై కామెడీ పండించిన అనిల్ ఇప్పుడీ సినిమాలో మోర్ ఫన్ కోసం మనీ మేటర్స్‌ను జత చేశాడు. అయితే ఫన్ తక్కువ ఫ్రస్ట్రేషన్ ఎక్కువగా 'ఎఫ్ 3' మిగిలిపోయింది.**

మాటల రచయితలు దర్శకులైతే సినిమాలో కథ కరవు అవుతుందని మరోసారి 'ఎఫ్ 3' నిరూపించింది. ఎందుకంటే ఇందులో కథ అని చెప్పుకోవడానికి ఏమీ లేదు. కొన్ని సన్నివేశాలతో పులిహోర కలిపేసి, దాన్ని ఆరగించమని దర్శకుడు ప్రేక్షకుల ముందు పెట్టాడు. ఆ పులిహోర రుచి తక్కువ, పులుపు ఎక్కువ అన్నట్టుగా ఉంది. వెంకీ (వెంకటేశ్) ఓ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్‌లో ఏజెంట్‌గా పనిచేస్తుంటాడు. తల్లి చనిపోగానే తండ్రి మళ్లీ పెళ్లి చేసుకుని నలుగురు పిల్లల్ని కంటాడు. వాళ్ల పోషణభారం కూడా వెంకీ మీదే పడుతుంది. ఇదే సమయంలో స్నేహితుడు రఘుబాబు నుండి యాభై లక్షలు, తన దగ్గర ఉన్న పది లక్షలు కలిపి హారిక (తమన్నా), హనీ (మెహ్రీన్) ఫ్యామిలీకి టిఫిన్ సెంటర్ పెట్టుకుంటామంటే అప్పుగా ఇస్తారు. వాళ్లు దివాలా తీసి, అప్పు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలో హనీ బాగా డబ్బున్న అమ్మాయి అని భ్రమపడి వరుణ్ యాదవ్ (వరుణ్ తేజ్) ఆమెను వలలో వేసుకోవడానికి స్నేహితుడు వెంకీ దగ్గరే అప్పుతీసుకుంటాడు. పాల బేబీ (అలీ) దగ్గర ఇల్లు తాకట్టు పెట్టి మరీ వరుణ్‌కు డబ్బులిస్తాడు వెంకీ. ఆ తర్వాత తాము మోసపోయామనే విషయం వీళ్లకు తెలుస్తుంది. ఇదే సమయంలో విజయనగరంలోని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద ప్రసాద్ (మురళీశర్మ) చిన్నప్పుడు ఇల్లు వదిలి వెళ్లిపోయిన తన కొడుకు రాక కోసం ఎదురుచూస్తున్నాడని తెలిసి, వీరంతా ఎవరికి వారు విడివిడిగా ఆయన కొడుకు రూపంలో ఆ భవంతిలో చేరతారు. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే మిగతా కథ.


పంచభూతాల గురించి అందరికీ తెలిసిందే. అవే మనలను శాసిస్తాయి. అయితే డబ్బు అనే మరో భూతం కూడా మనల్ని శాసిస్తుందని చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు. డబ్బును గౌరవంగా, చట్టబద్ధంగా పొందాలి తప్పితే అడ్డదారులు తొక్కి కాదనే సందేశాన్ని సినిమా చివరిలో చూపించాడు. కష్టాలను అధిగమించడానికి ఈజీ మనీ కోసం ప్రయత్నిస్తే కొన్ని సందర్భాలలో అది మనకు దక్కినా మనశ్శాంతి కరవు అవుతుందని, కంటినిండా నిద్ర పట్టదని సెలవిచ్చాడు. బుర్రకు పదును పెడితే ఏదో ఒక మార్గం దొరక్కపోదని, దాని ద్వారా విజయం సాధించవచ్చని తెలిపాడు. ఇందులోని పాత్రలన్నీ చివరకు ఓ చక్కని ఐడియాతోనే తమ జీవితాలను సరిదిద్దుకుంటాయి. దర్శకుడు ఈ సినిమా ద్వారా ఇచ్చిన సందేశం గొప్పగానే ఉన్నా, పేలవమైన కథ, కథనాల కారణంగా సినిమాలో ఫన్‌ను ఫ్రస్ట్రేషన్ డామినేట్ చేసేసింది. ప్రథమార్ధంలో వినోదానికి దర్శకుడు పెద్ద పీట వేశాడు. అది బాగానే పండింది. కానీ కథ విజయనగరం చేరే సరికీ అక్కడ మోతాదుకు మించిన వినోదం వెగటు పుట్టించింది. పైగా సినిమాలోనే ఏ ఒక్క సన్నివేశం కూడా కొత్తగా లేదు. వెంకటేశ్‌కు రేచీకటి, వరుణ్‌తేజ్‌కు నత్తి అనే అవలక్షణాలను పెట్టి తద్వారా కామెడీ పండించాలని చూశాడు దర్శకుడు. రేచీకటి అనేది కథకు కనెక్ట్ అయ్యింది కానీ వరుణ్‌కు నత్తి పెట్టాల్సిన అవసరమే లేదు. దానిని కవర్ చేయడానికి అతను ఉపయోగించే మేనరిజమ్స్ కూడా పండలేదు. ద్వితీయార్థంలో తమన్నాతో వేయించిన మేల్ గెటప్ బాగోలేదు. అతన్ని మగాడిగా భావించి, సోనాల్ చౌహాన్ వెంటపడే తరహా సన్నివేశాలు గతంలో ఎన్నో సినిమాలలో వచ్చేశాయి. పారిశ్రామికవేత్త ఆనంద ప్రసాద్, అతని కొడుకు తప్పిపోయాడనే ఎపిసోడ్ పేలవంగా ఉంది. రాజేంద్రప్రసాద్, సంపత్‌రాజ్ ట్రాక్ సైతం ఆకట్టుకోలేకపోయింది. వెరసీ ఏ సీన్‌కు ఆ సీన్ బాగా వస్తోందా లేదా? నవ్వు తెప్పిస్తున్నామా లేదా అని అనిల్ రావిపూడి చూశాడు తప్పితే ఓవర్ ఆల్‌గా కథలోని బలహీనతలను పట్టించుకోలేదు.

నటీనటుల విషయానికి వస్తే వెంకటేశ్ ఇక హీరో పాత్రలకు ఫుల్‌స్టాప్ పెట్టేసి క్యారెక్టర్ ఆర్టిస్టుగా మారిపోతే బెటర్. లేదంటే ఎంచక్కా 'దృశ్యం' లాంటి కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మూవీస్ చేస్తే బాగుంటుంది. అతని కామెడీ టైమింగ్ మాత్రం ఈ సినిమాలో అదిరిపోయింది. వరుణ్‌తేజ్, తమన్నా, మెహ్రీన్, రాజేంద్ర ప్రసాద్, మురళీశర్మ, ప్రగతి, తులసి, అన్నపూర్ణ, వై. విజయ, సునీల్, అలీ, సంపత్ రాజ్, 'వెన్నెల' కిశోర్, భరణి, శ్రీకాంత్ అయ్యంగార్.. ఇలా నటీనటుల లిస్ట్ కొండవీటి చాంతాడంత ఉంది. దర్శకుడు తన శక్తి మేరకు వాళ్లను ఉపయోగించుకున్నాడు కానీ కామెడీ హద్దులు దాటడంతో వెగటు పుట్టింది. ప్రతి సినిమాను పక్కాగా తీసే 'దిల్' రాజు, శిరీష్ బ్రదర్స్ ఈ సినిమా బడ్జెట్ విషయంలో లిబరల్‌గా ఉన్నారనిపించింది. ఉదాహరణకు సినిమా ప్రారంభంలో వచ్చే లబ్ డబ్ సాంగ్ కోసం భారీగా ఖర్చుచేశారు. పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ కూడా ఎలాంటి ఇంపాక్ట్ చూపించలేదు. బహుశా కంటెంట్ వీక్ కాబట్టి ఏదో రకంగా కవర్ చేద్దామని వాళ్లు అనుకుని ఉండొచ్చు. ఈ సినిమా సాంకేతిక నిపుణుల గురించి పెద్దంత చెప్పుకోవడానికి లేదు. ఏదేమైనా 'ఎఫ్ 2'ను దృష్టిలో పెట్టుకుని థియేటర్లకు వెళ్లిన వారికి నిరాశ కలగక మానదు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం


## మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.200/-



వెల : ₹.200/-



వెల : ₹.390/-



వెల : ₹.300/-



వెల : ₹.200/-




వెల : ₹.250/-




వెల : ₹.200/-




వెల : ₹.200/-




వెల : ₹.250/-




వెల : ₹.250/-




వెల : ₹.599/-




వెల : ₹.349/-



వెల : ₹.695/-



వెల : ₹. 799/-



వెల : ₹.50/-

**పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.

040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 63035 41244

From:
JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1,
Lingampally, Kachiguda,
Hyderabad-500027
web : jagritiweekly.com

Publishing on Every Thursday
Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023
RNI Regd. No. 3270/57.
Volume : 74 Issue : 32

# MAHAVEER
## GROUP OF INSTITUTIONS
(AN ISO 9001-2008 CERTIFIED INSTITUTION)







Counseling Code : MHVR
**MAHAVEER**
**INSTITUTE OF SCIENCE & TECHNOLOGY**
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Estd : 2001
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Courses Offered :
B.Tech — ECE | EEE | CSE | IT | MECH. | CIVIL | AERO — PG
M.Tech — DE & CS | VLSI | PE & ES | CSE | SE | AMS — MBA

Counseling Code : MHVR
**MAHAVEER**
**Institute of Science & Technology Polytechnic** (2nd Shift)
(Approved by AICTE, Affiliated to SBTET Hyderabad.)
Estd : 2009
Email: mist.admissions@gmail.com | website : mist.ac.in
Courses Offered :
Polytechnic — DECE | DEEE | DCME | DME | DCE

Counseling Code : AARM
**AAR MAHAVEER**
**ENGINEERING COLLEGE**
(Approved by AICTE, Affiliated to JNTUH, Hyderabad.)
Estd : 2010
Email: aarm.admissions@gmail.com | website : aarm.ac.in
Courses Offered :
B.Tech — ECE | EEE | CSE | MECH.

**MAHAVEER DEGREE COLLEGE**
**For Arts, Commerce & Science**
Estd : 2014
(Approved by Telangana Govt. - Affiliated to Osmania University)
Email: mdc.admissions@gmail.com | website : mahaveerdegreecollege.com
Courses Offered :
B.Com — Computers & General
B.Sc — MSCs

Sponsored by MAHAVEER EDUCATIONAL SOCIETY

**FOR NRI / MANAGEMENT SEATS**
Ph: 040-29880079, 29880086, 29880089, 29880081, 29880087
Cell : 9542001907, 9849944411
Vyasapuri, Bandlaguda, Post : Keshavgiri, Hyderabad - 500 005.